ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



గురువారం, 26 నవంబర్ 2026 | Thursday 26 November 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 214 | Vol.No 28 Issue No .214 | Hyderabad | www.visionandhra.in



17 నెలలైనా
అందని సిగాచీ పరిహారం..

- పూర్తి సాయం కోసం బాధిత కుటుంబాల ఎదురుచూపు

- ప్రకటించిన సాయం త్వరగా అందాలని కోరిక
- ప్రభుత్వం, యాజమాన్యం, కేంద్రం నుంచి వచ్చిన సాయంపై బాధితుల వివరణ



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

గత ఏడాది జూన్‌లో పాశమైలారం సిగాచీ ఫ్యాక్టరీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతి చెందిన 54 మంది కార్మికుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారం అంశం మరోసారి చర్చనీయాంశమైంది. బాధిత కుటుంబాలు పరిహారం పూర్తిగా అందాలని కోరుతూ పాశమైలారంలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత వర్గాలను వారు కోరుతున్నారు.

02



- పొల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2026 లో సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటనలు
- పొల్ట్రీ అంటే కేవలం కోళ్లు, గుడ్లు కాదు
- అది రైతు ఆర్థిక శక్తి, గ్రామీణ ఉపాధికి ఆయువుపట్టు
- సింగిల్ విండో అనుమతులు, మొక్కజొన్న కొరతకు పరిష్కారం, ప్రాధాన్యత రంగంగా గుర్తింపు
- పొల్ట్రీ రైతులకు సీఎం భరోసా
- 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ ఎకానమీ
- ఆ ప్రయాణంలో పొల్ట్రీ కీలక భాగస్వామి

పొల్ట్రీ రంగానికే తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట

POULTRY INDIA EXPO - 2026 ప్రారంభోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఎక్స్‌పోను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా పొల్ట్రీ రంగానికి చెందిన వేలాది మంది వ్యాపారులు, రైతులు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, నిపుణులు ఈ ఎక్స్‌పోకు హాజరయ్యారు. హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ ఎక్స్‌పో పొల్ట్రీ రంగంలో నూతన ఆవిష్కరణలకు, వ్యాపార అవకాశాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. హైదరాబాద్ లో పొల్ట్రీ ఇండియా ఎక్స్ పో 2026 ఏర్పాటు చేయడం అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. ఇలాంటి ఎక్స్‌పోలు తెలంగాణను పొల్ట్రీ హబ్‌గా నిలబెడతాయని, దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా తెలంగాణ పొల్ట్రీ రంగానికి గుర్తింపు తెస్తాయని ఆయన తెలిపారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన సీఎం, నూతన సాంకేతికతలు, ఆధునిక యంత్రాలు, దాణా తయారీ విధానాలు, వ్యాధి నివారణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

5 కోట్ల 30 లక్షల గుడ్లు - పొష్టికాహారంలో పొల్ట్రీ పాత్ర

5 కోట్ల 30 లక్షల గుడ్లను ఉత్పత్తి చేసి విద్యార్థులకు, యువతకు పౌష్టిక ఆహారాన్ని అందించడంలో పౌల్ట్రీ వ్యాపారులు భాగస్వాములు అవుతున్నారని సీఎం ప్రత్యేకంగా ప్రశంసించారు. గుడ్లు అనేది సంపూర్ణ పౌష్టికాహారమని, ప్రోటీన్, విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉండే ఆహారమని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, హాస్టళ్లలో పిల్లలకు గుడ్లు అందించే కార్యక్రమంలో పౌల్ట్రీ రంగం సహకారం ఎంతో కీలకమని సీఎం తెలిపారు. పిల్లల ఎదుగుదల, మెదడు అభివృద్ధి, రోగ నిరోధక శక్తి పెరగడానికి గుడ్లు ఎంతో అవసరమని చెప్పారు. యువతకు, క్రీడాకారులకు, గర్భిణీ మహిళలకు కూడా పౌష్టికాహారంగా గుడ్లు ఉపయోగపడతాయని అన్నారు. పౌల్ట్రీ రంగం కేవలం వ్యాపారం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యానికి సేవ చేస్తున్న రంగమని సీఎం అభివర్ణించారు. పౌల్ట్రీ రైతులు,

11



ఢిల్లీకి చేరిన తెలంగాణ అసమ్మతి సెగ

- సందీప్ కుమార్‌కు రాజగోపాల్ రెడ్డి సంచలన నివేదిక, సీఎం వర్గంలో అలజడి
రెండు రోజులు, రెండు భేటీలు, ఒకే మాట - వెనక్కి తగ్గేది లేదు
నిధుల్లో వివక్ష, షాడో సీఎంల అరాచకం - అధిష్ఠానానికి చేరిన ఫిర్యాదుల చిట్టా
కొత్త ఇన్‌చార్జ్ ఏం చేస్తారు? తెలంగాణ కాంగ్రెస్‌లో తదుపరి అడుగు ఏంటి?



తెలంగాణ స్టేట్ చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా రగులుతున్న అసమ్మతి సెగ ఇప్పుడు ఢిల్లీకి చేరింది. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న సందీప్ కుమార్ రెండు రోజుల పర్యటన ముగించి వెళ్లారు. ఈ పర్యటన సాధారణ పర్యటనలా కాకుండా, పార్టీలోని అంతర్గత విభేదాలను, నేతల అసంతృప్తిని నేరుగా అధిష్ఠానానికి చేరవేసే కీలక ఘట్టంగా మారింది. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితో రెండు రోజుల పాటు సందీప్

02

తెలంగాణ క్రీడాభివృద్ధికి బలమైన పునాదిగా
'ఖేలో ఇండియా'

- 2002 తర్వాత తొలిసారి ఇంత భారీ క్రీడా మహోత్సవం
- రూ. 203 కోట్లతో ఖేలో ఇండియా
- రూ. 120 కోట్లతో స్టేడియాల్లో ప్రపంచ స్థాయి హంగులు, అత్యాధునిక పరికరాలు
- 9,000 మందికి పైగా క్రీడాకారులు, 27 క్రీడలు, 20 స్టేడియాలు
- తెలంగాణలో కామన్వెల్త్ కంటే రెట్టింపు సందడి
- కర్రసాముకు జాతీయ వేదిక
- తాత్కాలిక ఏర్పాట్లు కాదు, భావితరాలకు శాశ్వత సౌకర్యాలు
- సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే కార్యాచరణలో భాగంగా 'ఖేలో ఇండియా' పోటీలు రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి బలమైన పునాదిగా నిలువనున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డిసెంబర్ 11 నుండి 22 వరకు రాష్ట్ర



ఆతిథ్యంలో తొలిసారిగా ఈ క్రీడా మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో

11





అచ్చంపేటకు అభివృద్ధి పండుగ

- రూ. 450 కోట్ల వరాలతో వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- మద్దిమడుగులో సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహానికి శంకుస్థాపన
- బంజారాల చిరకాల కల నెరవేరే వేళ
- రోడ్లు, స్కూళ్లు, ITDA భవనం, ఆదివాసీ భవన్
- నాగర్ కర్నూల్ జిల్లాకు మహర్దశ
- రాజ్యాంగ దినోత్సవాన ఇందిరమ్మ చీరలు, చేయూత పెన్షన్లు

02

- అచ్చంపేట సభలో సందడి

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని
రద్దు చేయాలి

- కేటీఆర్ డిమాండ్



02

స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్ విలీనంపై ఏకపక్ష నిర్ణయాలు వద్దు

02

విద్యారంగంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వానికి సూచించిన కవిత

నేడే మీ ఖాతాలోకి రూ. 2 వేలు

- 4.72 లక్షల కుటుంబాల్లో పండుగ!
- రాజ్యాంగ దినోత్సవం నాడే అచ్చంపేటలో చరిత్రాత్మక సభ
- సీఎం రేవంత్ చేతుల మీదుగా భారీ విడుదలలి
- చేయూత కింద ప్రతి నెలా రూ. 2 వేలు
- కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కూడా నేడే ప్రారంభంలి

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 26, విజన్ ఆంధ్ర:

ఎంతో కాలంగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది పేదలకు నేడు నిజంగా పండుగ రోజు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నేడు కొత్తగా ఎంపికైన 4.72 లక్షల మంది పింఛన్‌దారుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది.



నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటలో నేడు జరిగే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పింఛన్ నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి విడుదల చేయనున్నారు. అదే వేదికపై నుంచి కోటి మంది మహిళలకు 'ఇందిరమ్మ చీరల' పంపిణీ కార్యక్రమాన్ని కూడా నేడు ప్రారంభించనున్నారు. ఈ ఒక్క రోజు, రెండు పెద్ద పథకాల ప్రారంభంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాల్లో సంతోషం నిండనుంది. గ్రామాల్లో, పట్టణాల్లో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు నేడు తమ

02

ఫోన్‌లో మెసేజ్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



జీ మీడియా "దక్కన్ ఐకాన్స్" అవార్డు అందుకున్న విరాహత్ అలీ





హైదరాబాద్ నవంబర్ 26, విజన్ ఆంధ్ర: హైదరాబాద్ దక్కన్ పరిధిలో వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతలు పొందుతున్న 12మంది ప్రముఖులకు జీ జాతీయ మీడియా సంస్థ అందించిన "దక్కన్ ఐకాన్స్-

02

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

- దేశ అభివృద్ధికి భారీ ప్రోత్సాహం!
- ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో కీలక భేటీ
- మూడు భారీ ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- రూ.11,000 కోట్లతో కొత్త పథకం, రూ.4,288 కోట్లతో కంటైనర్ టెర్మినల్, అసోంలో కొత్త ఎయిర్‌పోర్ట్



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

దేశ అభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వం మరో పెద్ద అడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో మూడు అత్యంత కీలకమైన నిర్ణయాలకు ఆమోదం లభించింది. తయారీ రంగం, పోర్టుల అభివృద్ధి, విమానయాన రంగం – ఈ మూడు రంగాల్లో వేల కోట్ల పెట్టుబడులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా వేలాది ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు రానున్నాయి. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు ఈ నిర్ణయాలు మరింత బలాన్ని చేకూర్చనున్నాయి.

02

ఏపీ సొంత రాబడి పెరిగింది.. ఆదాయార్జన శాఖలపై చంద్రబాబు కీలక సమీక్ష

- రాష్ట్ర సొంత ఆదాయంలో 18.7 శాతం వృద్ధి నమోదు
- ప్రజలపై భారం లేకుండా ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు
- నవంబర్ 23 నాటికే 58 శాతం వార్షిక లక్ష్యం పూర్తి
- వాణిజ్య, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల్లో పెరిగిన రాబడి
- పన్నుల పరిశీలన, ఆడిట్‌లలో ఏఐ సాంకేతికత వినియోగం

02



స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్ విలీనంపై ఏకపక్ష నిర్ణయాలు వద్దు

ఇంటర్మీడియట్ బోర్డును ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు, జూనియర్ కాలేజీలు, పాఠశాల యాజమాన్యాలు, విద్యావేత్తలతో సమగ్ర చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే ప్రభుత్వం ఎలాంటి అడుగైనా వేయాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డును స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసే ప్రతిపాదనను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే, విద్యారంగానికి సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియపై స్పష్టత కొరవడిందని చెబుతూ... "స్కూల్ విద్యలో ఇంటర్‌ను విలీనం చేస్తారా? లేక ఇంటర్ విద్యలో పాఠశాల విద్యను కలుపుతారా? అన్న దానిపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. 9, 10, 11, 12 తరగతుల విధానం వస్తే తల్లిదండ్రులపై మరింత భారం పడుతుందని చెప్పారు. ఇప్పటికే ఇంటర్ విద్య కోసం రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, నిధుల విడుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఆమె తప్పుబట్టారు. కేంద్రం నుంచి కరవు సహాయం తీసుకురావడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. కరవు ప్రభావిత మండలాలపై ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించాలని, రైతులకు పంటల ధరలపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జీ మీడియా "దక్కన్ ఐకాన్స్" అవార్డు అందుకున్న విరాహత్ అలీ

2026" ప్రతిష్టాత్మక పురస్కారాన్ని.... దశాబ్దాల తరబడి సామాజిక, మీడియా రంగాల్లో సేవలందిస్తున్న సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(ఖజెజీ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అందుకున్నారు. బుధవారం నాడు బంజారాహిల్స్ లోని రెడీసన్ బ్లూ హోటల్ లో జీ మీడియా సంస్థ నిర్వహించిన సభలో, రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర సాగునీటి మరియు పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిల చేతుల మీదుగా విరాహత్ అలీ ఈ పురస్కారాన్ని పొందారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల చైర్మన్ ఫహీం ఖురేషి, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా ఖాన్, జీ సలాం టీవీ ఎడిటర్ తారిఖ్ ఫరీదీ, జీ తెలుగు ఛానెల్ ఎడిటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన విపక్ష నేతలను అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి వ్యతిరేకంగా అఖిలపక్ష నేతలు చేపట్టిన నిరసన సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులతో పాటు పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంపై కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. "కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడి పడి ఉన్న ప్రజా ఆస్తి అని కేటీఆర్ స్పష్టం చేశారు. నగర అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన స్థలాలను వేలం వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అచ్చంపేటకు అభివృద్ధి పండుగ

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం నేడు అభివృద్ధి పండుగకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనతో ఈ ప్రాంతమంతా సందడి నెలకొంది. రూ. 450 కోట్లతో నాగర్ కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం, మద్దిమడుగులో సంత్ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి, అచ్చంపేటలో భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటన కేవలం ఒక అధికారిక కార్యక్రమం కాదు, అచ్చంపేట ప్రజల చిరకాల కోరికలు నెరవేరే రోజుగా మారింది. రోడ్లు, పాఠశాలలు, గిరిజన సంక్షేమ భవనాలు, ఆలయ అభివృద్ధి, పర్యాటక అభివృద్ధి - ఇలా అన్ని రంగాలకు నిధులు వస్తున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మద్దిమడుగు - భక్తి, పర్యాటకానికి కేంద్రం

నేడు మధ్యాహ్నం మద్దిమడుగులో సంత్ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహ ఏర్పాటుకు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం. బంజారా, లంబాడా సామాజిక వర్గానికి ఆరాధ్యుడైన సంత్ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహం ఏర్పాటు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. రూ. 38 కోట్లతో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహం, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగనుంది. ఈ విగ్రహం పూర్తయితే మద్దిమడుగు రాష్ట్రంలోనే ప్రధాన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా మారుతుందని, ఏటా లక్షలాది మంది భక్తులు వస్తారని స్థానికులు అంటున్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే గొప్ప కట్టడంగా ఇది నిలుస్తుందని చెబుతున్నారు. అదేవిధంగా మద్దిమడుగులో రూ. 15 కోట్లతో శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో హరిత హోటల్ ఏర్పాటుకు శంకుస్థాపన, రూ. 18 కోట్లతో శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఆలయ అభివృద్ధితో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటకం మరింత పెరుగుతుందని, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. భక్తులకు వసతి, భోజనం, పార్కింగ్ వంటి సౌకర్యాలు మెరుగుపడతాయి. మద్దిమడుగు కార్యక్రమం అనంతరం సీఎం హెలికాప్టర్‌లో అచ్చంపేటకు చేరుకోనున్నారు.

అచ్చంపేట - హెలిప్యాడ్ నుంచి పాదయాత్రగా సభకు

అచ్చంపేటలో హెలిప్యాడ్ నుంచి పాదయాత్రగా బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకోనున్న ముఖ్యమంత్రి. ఈ పాదయాత్రలో ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది. దారి పొడవునా సీఎంకు పూల వర్షంతో, దప్పు చప్పుళ్లతో, బంజారా నృత్యాలతో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. బహిరంగ సభ ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం. సభా ప్రాంగణం మొత్తం కాంగ్రెస్ జెండాలతో, బ్యానర్లతో, ఫ్లెక్సీలతో నిండిపోయింది.

రూ. 450 కోట్లు - ఏయే పనులకు?

రూ. 274.32 కోట్లతో నాగర్ కర్నూల్ జిల్లాలో బీటీ రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ రోడ్ల అభివృద్ధితో జిల్లాలోని గ్రామాలకు మండల కేంద్రాలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుంది. రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించడానికి, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి, రోగులు ఆస్పత్రులకు వెళ్లడానికి ఈ రోడ్లు ఎంతో ఉపయోగపడతాయి. గతంలో గుంతల రోడ్లతో ఇబ్బంది పడిన ప్రజలకు ఇది పెద్ద ఊరట. రూ. 29.65 కోట్లతో నాగర్ కర్నూల్, పెద్ద కొత్తపల్లి, వెల్దండ ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పేద పిల్లలకు కూడా ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్య, క్రీడా సౌకర్యాలు అందుతాయి. రూ. 25 కోట్లతో అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ. 18.105 కోట్లతో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 130 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పిల్లలు ఇరుకు గదుల్లో కాకుండా విశాలమైన తరగతి గదుల్లో చదువుకోవచ్చు. రూ. 14 కోట్లతో అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో నూతన ఐటీడీఏ భవన నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 2 కోట్లతో అచ్చంపేట పట్టణంలో ఆదివాసీ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. గిరిజన, ఆదివాసీ ప్రజల సంక్షేమానికి ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు. గిరిజన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం, సంక్షేమ పథకాల కోసం ఒకే చోటికి రావచ్చు.

రాజ్యాంగ దినోత్సవం - సంక్షేమ పండుగ

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహిరంగ సభ వేదికగా ఇందిరమ్మ చీరల పంపిణీ, చేయూత కొత్త పెన్షన్ల పంపిణీని ప్రారంభించనున్న సీఎం. మహిళలకు ఇందిరమ్మ చీరలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చేయూత పెన్షన్లు అందజేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత ముందుకు తీసుకెళ్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వం, సామాజిక న్యాయం స్ఫూర్తితోనే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, పేదలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం సభలో చెప్పనున్నట్లు సమాచారం. అనంతరం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్న ముఖ్యమంత్రి. ఈ సభలో జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, రానున్న కార్యాచరణపై సీఎం ప్రసంగించనున్నట్లు సమాచారం.

భారీ ఏర్పాట్లు - అచ్చంపేటలో పండుగ వాతావరణం

సీఎం పర్యటన నేపథ్యంలో అచ్చంపేట, మద్దిమడుగులో భారీ ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయగా, సభా ప్రాంగణంలో ప్రజలు కూర్చునేందుకు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. జిల్లా అధికారులు, కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సీఎం పర్యటనతో నాగర్ కర్నూల్ జిల్లా అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని, అచ్చంపేట నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు. శంకుస్థాపన చేసిన పనులు త్వరగా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావాలని కోరుతున్నారు.

17 నెలలైనా అందని సిగాచీ పరిహారం..

ఈ ఘటన జరిగిన వెంటనే మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకటన బాధిత కుటుంబాలకు కొంత భరోసాను ఇచ్చింది. అయితే దాదాపు 17 నెలలు గడిచినా, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు రూ.1 లక్ష మాత్రమే అందిందని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి.

మృతదేహాలను అప్పగించే సమయంలో ప్రభుత్వం రూ.1 లక్ష చెల్లించిందని, ఆ తర్వాత మిగిలిన మొత్తం కోసం ఎదురుచూస్తున్నామని బాధితులు తెలిపారు. తమ కుటుంబాల్లో సంపాదించే వ్యక్తిని కోల్పోయామని, పిల్లల చదువులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు, రోజువారీ అవసరాలు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సిగాచీ యాజమాన్యం చెల్లింపులు

మరోవైపు సిగాచీ యాజమాన్యం మూడు విడతల్లో కొన్ని బాధిత కుటుంబాలకు రూ.37 లక్షలు చెల్లించింది. అదనంగా ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్, ఇతర ప్రయోజనాలు కూడా అందజేసినట్లు సమాచారం. ఈ చెల్లింపుల ద్వారా కుటుంబాలకు కొంత ఆర్థిక సహాయం అందిందని బాధితులు చెబుతున్నారు.

ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.42 లక్షలు చెల్లించామని సిగాచీ యాజమాన్యం హైకోర్టుకు విన్నవించింది. మిగిలిన నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని హైకోర్టుకు సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఈ అంశం ప్రస్తుతం న్యాయపరమైన ప్రక్రియలో ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వ సాయం

కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు పరిహారం ప్రకటించింది. అయితే ఇప్పటికీ పలు కుటుంబాలకు ఈ సాయం అందలేదని బాధితులు చెబుతున్నారు. అన్ని వైపుల నుంచి సాయం త్వరగా అందాలని వారు కోరుతున్నారు. ప్రకటించిన ప్రతి సాయం సకాలంలో అందితే కుటుంబాలకు భరోసా లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

బాధిత కుటుంబాల విజ్ఞప్తి

పాశమైలారంలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన బాధిత కుటుంబాలు, ప్రకటించిన పరిహారం పూర్తిగా చెల్లించాలని కోరారు. తమ కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని కోరారు. ఆత్మీయులను కోల్పోయి దుఃఖంలో ఉన్న తమకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆశించామని, పరిహారం త్వరగా అందితే కుటుంబ పోషణకు కొంత భరోసా లభిస్తుందని వారు తెలిపారు. పిల్లల భవిష్యత్తు, వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ దృష్ట్యా సాయం అవసరమని వివరించారు.

చాలా కుటుంబాల్లో మృతి చెందిన వ్యక్తే ఏకైక సంపాదనాపరుడు. ఆ వ్యక్తి లేకపోవడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కొందరు బాధితులు అప్పులు చేసి కుటుంబాన్ని నడుపుతున్నామని, పిల్లల చదువులు కొనసాగించడం కష్టంగా మారిందని చెప్పారు. మరికొందరు వృద్ధ తల్లిదండ్రుల వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

బాధిత కుటుంబాల్లో చాలా మంది మహిళలు ఉపాధి కోసం ప్రయత్నిస్తున్నారని, కానీ స్థిరమైన ఆదాయం లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని వారు వివరించారు. అందుకే ప్రకటించిన పరిహారం త్వరగా అందజేస్తే, ఆ మొత్తాన్ని పిల్లల చదువు, కుటుంబ అవసరాల కోసం ఉపయోగించుకుంటామని చెబుతున్నారు.

అధికారుల స్పందన - ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడి

ఈ అంశంపై అధికారులు స్పందిస్తూ, పరిహారం చెల్లింపు ప్రక్రియ వివిధ దశల్లో ఉందని, చట్టపరమైన అంశాలు, నిధుల కేటాయింపు, పత్రాల పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తయిన తర్వాత మిగిలిన మొత్తం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపినట్లు సమాచారం.

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా అన్ని వైపుల నుంచి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. పరిహారం అంశం త్వరగా పరిష్కారమై, బాధిత కుటుంబాలకు భరోసా లభించాలని ఆశిస్తున్నారు.

గత ఏడాది జూన్‌లో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. 54 మంది కార్మికులు మృతి చెందడం పట్ల అన్ని వర్గాలు సంతాపం వ్యక్తం చేశాయి. అప్పట్లో ప్రకటించిన సాయం పూర్తిగా అంది, బాధిత కుటుంబాలు కోలుకోవాలని అందరూ కోరుకుంటున్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు, మానసిక భరోసా, ఉపాధి అవకాశాలు కూడా అవసరమని చెబుతున్నారు.

మొత్తంగా సిగాచీ బాధిత కుటుంబాల పరిహారం అంశం త్వరగా పరిష్కారమై, వారి జీవితాల్లో కొంత ఊరట లభించాలని అందరూ ఆశిస్తున్నారు.

ఢిల్లీకి చేరిన తెలంగాణ అసమ్మతి సెగ

కుమార్ భేటీ అయ్యారు. ఈ భేటీలో వెనక్కి తగ్గని అసమ్మతి ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా, స్పష్టంగా వెల్లడించినట్లు సమాచారం. తమ నియోజకవర్గాల సమస్యలు, నిధుల విషయంలో జరుగుతున్న వివక్ష, పార్టీలో కొందరు నేతల తీరుపై వారు వివరంగా నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది.

నిధుల విషయంలో వివక్ష - మా నియోజకవర్గాలకు అన్యాయం

నిధుల విషయంలో వివక్ష చూపుతున్నారని, ముఖ్యమంత్రి, మంత్రుల నియోజకవర్గాలకే నిధులు వెళ్తున్నాయంటూ సందీప్‌కు రాజగోపాల్ రెడ్డి వివరించినట్లు సమాచారం. తమ నియోజకవర్గాల్లో రోడ్లు, తాగునీరు, సాగునీరు, పాఠశాల భవనాలు, ఆస్పత్రులు వంటి ప్రాథమిక అభివృద్ధి పనులకు కూడా నిధులు రావడం లేదని, ఫైళ్లు ముందుకు కదలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే ప్రజల ముందు తల ఎత్తుకోలేమని, దీని వల్ల పార్టీకి కూడా నష్టం జరుగుతుందని వారు సందీప్‌కు చెప్పినట్లు సమాచారం. నిధుల కేటాయింపులో పారదర్శకత ఉండాలని, అన్ని నియోజకవర్గాలకు సమాన అవకాశం ఇవ్వాలని, ఎమ్మెల్యేలను విశ్వాసంలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అడగడం తప్పు కాదని, అది ప్రజల హక్కు అని, ఆ హక్కును కాదనడం పార్టీకి మంచిది కాదని అసమ్మతి వర్గం వాదిస్తోంది. సందీప్ కుమార్ ఈ ఫిర్యాదులను శ్రద్ధగా విన్నారని, ప్రతి అంశాన్ని నోట్ చేసుకున్నారని సమాచారం.

ఇద్దరు షాడో సీఎంలు - అధికార కేంద్రాలుగా మారారన్న ఆరోపణ

ఈ భేటీలో అత్యంత సంచలనంగా మారిన అంశం షాడో సీఎంల వ్యవహారం. ఇద్దరు షాడో సీఎంలుగా వ్యవహరిస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారని సందీప్‌కు రాజగోపాల్ రెడ్డి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీలో కొందరు నేతలు తమకు తాముగా అధికార కేంద్రాలుగా మారి, జిల్లాల్లో, నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారని, ఎమ్మెల్యేలను, స్థానిక నేతలను గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించినట్లు సమాచారం. అధికారిక పదవిలో లేకపోయినా అధికారాన్ని చెలాయించే తీరు వల్ల పార్టీలో క్రమశిక్షణ దెబ్బతింటోందని, కార్యకర్తల్లో గందరగోళం నెలకొంటోందని ఆయన సందీప్‌కు వివరించినట్లు చెబుతున్నారు. అధిష్ఠానం జోక్యం చేసుకుని పార్టీలో ఒకే అధికార కేంద్రం ఉండేలా చూడాలని, అందరూ కలిసి పనిచేసే వాతావరణం కల్పించాలని రాజగోపాల్ రెడ్డి కోరినట్లు సమాచారం.

అనిరుధ్ రెడ్డి కూడా అదే మాట

అనిరుధ్ రెడ్డి కూడా సందీప్‌తో భేటీలో తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. తన నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనుల్లో జాప్యం, అధికారుల సహకారం లేకపోవడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకే మాటపై నిలబడటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వెనక్కి తగ్గేది లేదని, తమ నియోజకవర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైనా వెళ్తామని వారు స్పష్టం చేసినట్లు చెబుతున్నారు. ఇది వ్యక్తిగత పోరాటం కాదని, ప్రజల కోసం చేస్తున్న పోరాటమని వారు చెబుతున్నారు.

రేవంత్ రెడ్డి వర్గంలో గుబులు - సందీప్ ఏం నివేదిస్తారో?

దీంతో కొత్త ఇన్‌చార్జ్ సందీప్‌తో జాగ్రత్తగా ఉండాలని, తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను అధిష్ఠానానికి చేరవేస్తారని రేవంత్ రెడ్డి వర్గంలో గుబులు మొదలైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సందీప్ కుమార్ తెలంగాణ పరిస్థితిని నేరుగా, పక్షపాతం లేకుండా అధిష్ఠానానికి నివేదిస్తారని, దీని వల్ల పార్టీలో మార్పులు జరగవచ్చని ఆ వర్గం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ఇన్‌చార్జ్ వచ్చిన తర్వాత పార్టీలో సమీకరణాలు మారుతాయా, అసమ్మతి నేతలకు అధిష్ఠానం నుంచి మద్దతు లభిస్తుందా అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. సందీప్ కుమార్ అందరి అభిప్రాయాలు విని, సమతూకంతో నివేదిక ఇస్తారని పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి.

అధిష్ఠానం ఏం చేస్తుంది? - ఉత్కంఠ

సందీప్ కుమార్ పర్యటన తర్వాత అధిష్ఠానం తెలంగాణ వ్యవహారాలపై ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అసమ్మతి ఎమ్మెల్యేల ఫిర్యాదులను అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంటుందా, సర్దుబాటు చర్యలు తీసుకుంటుందా, లేక యథాతథంగా కొనసాగిస్తుందా అనేది చూడాలి. పార్టీలో విభేదాలు బహిరంగంగా రావడం వల్ల ప్రతిపక్షాలకు విమర్శించే అవకాశం లభిస్తుందని, దీనిని నివారించేందుకు అధిష్ఠానం చొరవ తీసుకోవాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. అందరినీ కలుపుకుని వెళ్లడమే పార్టీ బలమని, విభేదాలను సామరస్యంగా పరిష్కరించాలని వారు అంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రానున్న రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక మార్పులు జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సందీప్ కుమార్ నివేదిక ఆధారంగా అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెబుతున్నారు.

నేడే మీ ఖాతాలోకి రూ. 2 వేలు

నేడు ఎవరి ఖాతాల్లోకి డబ్బు వస్తుంది?

ప్రభుత్వం ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన 4.72 లక్షల మందిని కొత్తగా ఎంపిక చేసింది. వీరిలో ప్రధానంగా... వయసు పైబడిన వృద్ధులు, భర్తను కోల్పోయిన వితంతువులు, శారీరకంగా వికలాంగులు, ఒంటరిగా జీవిస్తున్న మహిళలు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు, ఎ×ఎ తో బాధపడుతున్న వారు, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వీరందరికీ 'చేయూత' పథకం కింద నేటి నుంచి ప్రతి నెలా రూ. 2 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. ఇప్పటికే పింఛన్ పొందుతున్న లక్షలాది మందితో కలిపితే రాష్ట్రంలో పింఛన్‌దారుల సంఖ్య ఇప్పుడు రికార్డు స్థాయికి చేరింది. పేదలకు అండగా నిలవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఒక్కరూ మిగిలిపోకూడదని సీఎం స్పష్టం చేశారు.

నేడు అచ్చంపేటలో ఏం జరగబోతోంది?

నేడు నవంబర్ 26 - రాజ్యాంగ దినోత్సవం. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ పవిత్రమైన రోజునే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంచుకోవడం వెనుక పెద్ద ఆలోచన ఉంది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవప్రదమైన జీవితం ఇచ్చింది. అదే స్ఫూర్తితో పేదలకు చేయూతనివ్వాలని ప్రభుత్వం భావించింది. అచ్చంపేటలో ఈ కార్యక్రమం కోసం భారీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేలాది మంది లబ్ధిదారులు, ప్రజలు ఈ సభకు హాజరు కానున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సీఎం రేవంత్ రెడ్డి నేడు స్వయంగా వేదికపై నుంచి ఒకే ఒక్క క్లిక్‌తో 4.72 లక్షల మంది ఖాతాల్లోకి డబ్బులు పంపిస్తారు. డబ్బు నేరుగా ఖాతాకే వస్తుంది కాబట్టి మధ్యవర్తులు, దళారులకు ఎలాంటి అవకాశం ఉండదు. లబ్ధిదారులు నేడు మధ్యాహ్నం నుంచే తమ బ్యాంకుకు వెళ్లి, ూూవీలో లేదా ఫోన్‌లోనే డబ్బు వచ్చిందో లేదో చెక్ చేసుకోవచ్చు.

చేయూత అంటే ఏంటి? ఎందుకు ఇంత ముఖ్యం?

'చేయూత' అంటే చేయి అందించడం, ఆసరా ఇవ్వడం. పేదవారికి, వృద్ధులకు, అనారోగ్యంతో ఉన్నవారికి నెలనెలా ఆర్థికంగా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. నెలకు రూ. 2 వేలు అనేది పెద్ద మొత్తం కాకపోవచ్చు. కానీ పేద కుటుంబాలకు అదే పెద్ద భరోసా. ఆ డబ్బుతో మందులు కొనుక్కోవచ్చు. నిత్యావసర సరుకులు తెచ్చుకోవచ్చు. బిడ్డల చదువుకు, చిన్న చిన్న అవసరాలకు వాడుకోవచ్చు. ఎవరి దగ్గరా చేయి చాచకుండా, ఎవరి మీదా ఆధారపడకుండా గౌరవంగా బతకవచ్చు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఈ పింఛన్ ఒక జీవనాధారం. "నాకు ప్రభుత్వం ఉంది, నాకు నెలనెలా డబ్బు వస్తుంది" అనే ధైర్యం వారికి

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

సంపాదకీయం

మారుతున్న జాతీయ సమీకరణాలు

వచ్చే ఏడాది తొలి అర్ధ భాగంలో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. పాత మిత్రులైన భారతీయ జనతా పార్టీ, శిరోమణి అకాలీదళ్ ఆరేళ్ల తర్వాత మళ్లీ ఒక్కటయ్యాయి. గురుపూర్ణిమ పర్వదినాన బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్, హో మంత్రి అమిత్ షా, అకాలిదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్ కలిసి పొత్తు విషయమై ప్రకటన చేశారు. దీంతో పంజాబ్ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఖాయమైంది. 24 ఏళ్లపాటు బీజేపీతో కలిసి నడిచిన అకాలీదళ్.. సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ 2020లో ఎన్డీయే కూటమి నుంచి వైదొలిగింది.పాత స్నేహితులైన బీజేపీ, అకాలీదళ్ మళ్లీ ఒక్కటవుతున్నాయని గత వారం రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీన్ని నిజం చేస్తూ సిక్కులు పవిత్రంగా భావించే గురునానక్ జయంతి రోజున ఈ రెండు పార్టీలు పొత్తు ప్రకటన చేశాయి. ఎవరు ఎన్ని సీట్లలో పోటీ చేస్తారనే విషయమై ప్రకటన చేయకపోయినప్పటికీ, ఎన్డీయే సీఎం అభ్యర్థిగా బడా భాయ్ (బాదల్) ఉంటారని అమిత్ షా హింట్ ఇచ్చారు. పాత మిత్రులైన అకాలీదళ్ తిరిగి ఎన్డీయేలో చేరడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ స్ఫందిస్తూ.. హిందూ-సిక్కు సోదరభావానికి తమ పొత్తు సంకేతమన్నారు.'బాదల్ సాబ్‌కు మాతో గాఢమైన, సుదీర్ఘ అనుబంధం ఉంది. అదేవిధంగా బీజేపీ, అకాలిదళ్ మధ్య బలమైన బంధం ఉంది. ఈ పొత్తు పంజాబ్‌లో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా హిందు-సిక్కు సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని నేను భావిస్తున్నాను" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే 2029 డిసెంబర్ నాటికి పంజాబ్‌ను డ్రగ్స్ నుంచి విముక్తి చేస్తామని షా హామీ ఇచ్చారుబీజేపీ ఏర్పడక ముందు దానికి పూర్వ రూపమైన భారతీయ జన్‌సంఘ్‌తో 1967లోనే అకాలీదళ్ పొత్తు పెట్టుకుంది. ఆ ఏడాది బీజేఎన్, అకాలీదళ్ కలిసి అప్పటికి కొత్త రాష్ట్రమైన పంజాబ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఆ తర్వాత బీజేపీ, శిరోమణి అకాలీదళ్ మధ్య 1996లో పొత్తు కుదిరింది. 1997లో ఈ రెండు పార్టీలు కలిసి పంజాబ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మరుసటి ఏడాది అకాలీదళ్ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో చేరింది. అప్పటి నుంచి ఈ రెండు పార్టీల మధ్య స్నేహం కొనసాగింది. కానీ 2020లో కేంద్రంలోని మోదీ సర్కారు సాగు చట్టాలను అమలు చేయాలని భావించింది. పంజాబ్ రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో మోదీ సర్కారు నిర్ణయంతో విభేదించిన శిరోమణి అకాలీదళ్ 24 ఏళ్ల స్నేహాన్ని వదులుకుంది.జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా పంజాబ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర వ్యవసాయ చట్టాలకు నిరసనగా ఆరేళ్ల క్రితం ఎన్డీఏ కూటమి నుంచి వైదొలిగిన బీజేపీ అత్యంత పాత మిత్రపక్షం శిరోమణి అకాలీద తిరిగి ఎన్డీఏ గూటికి చేరింది. గురునానక్ దేవ్ జీ ప్రకాశ్ పురబ్ పర్వదినం సందర్భంగా ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఎన్డీఏలో చేరినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ.. బీజేపీ?అకాలీదళ్ పొత్తు పంజాబ్ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసే సహజమైన భాగస్వామ్యమని, ఇప్పుడు ఎన్డీఏ పరిపూర్ణమైందని ఎక్స్ వేదికగా స్వాగతించారు.రాబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 117 స్థానాల్లోనూ బీజేపీ, శిరోమణి అకాలీదళ్ కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. ఈ కూటమిలో శిరోమణి అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషిస్తుందని, ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రి పదవి అకాలీదళ్‌కే దక్కుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. త్వరలోనే ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలపై తుది చర్చలు జరగనున్నాయని, పంజాబ్‌లో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడం, రైతుల సంక్షేమం, హిందూ?సిక్కు ఐక్యతను బలోపేతం చేయడమే ప్రధాన ఎజెండాగా ప్రజల్లోకి వెళ్తామని నాయకులు వెల్లడించారు.1996 నుంచి దశాబ్దాల పాటు కొనసాగిన ఈ రెండు పార్టీల పొత్తు 2020లో తెగిపోవడంతో, 2022 అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, అకాలీదళ్ వేర్వేరుగా పోటీ చేసి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాయి. పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌లకు గట్టి పోటీ ఇవ్వాలంటే మళ్లీ కలవడమే ఉత్తమమని ఇరు పార్టీల అగ్రనాయకత్వాలు భావించాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి 100కు పైగా స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని, అధికార ఆప్ పార్టీని సింగిల్ డిజిట్‌కే పరిమితం చేస్తామని సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ధీమా వ్యక్తం చేశారు.2022లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో విడిగా పోటీ చేసిన బీజేపీ, అకాలీదళ్ తీవ్రంగా నష్టపోయాయి. బీజేపీ రెండు సీట్లు మాత్రమే గెలవగా.. అకాలీదళ్ మూడు స్థానాలకే పరిమితమైంది. ఆ ఎన్నికల్లో 92 సీట్లు గెలిచిన ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌లో అధికారంలోకి వచ్చింది.2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు శాతం పెరిగినప్పటికీ పంజాబ్‌లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. మరోవైపు అకాలీదళ్ ఓటు బ్యాంక్ ఏకంగా 14 శాతం తగ్గడమే కాకుండా 10 సీట్లలో డిపాజిట్లు కోల్పోయింది.సిక్కులు ఎక్కువగా ఉండే పంజాబ్ గ్రామీణ ప్రాంతాల్లో అకాలీదళ్‌కు గట్టి పట్టు ఉంది. అలాగే హిందువులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలంగా ఉంది. కానీ గ్రామీణ ఓటర్ల మద్దతు లేకుండా బీజేపీ అధికారంలోకి రావడం కష్టం. అలాగే పట్టణ ప్రాంత ఓటర్ల సపోర్ట్ లేకుండా అకాలీదళ్ గెలిచే పరిస్థితి లేదు. విడిగా పోటీ చేయడం ద్వారా ఇద్దరమూ నష్టపోతున్నామని బీజేపీ, అకాలీదళ్ గుర్తించాయి. శిరోమణి అకాలీదళ్ పంజాబ్‌లో అధికారంలోకి వచ్చి దాదాపు పదేళ్లు అవుతోంది. వరుస ఓటములతో ఆ పార్టీలో చీలికలు వస్తున్నాయి. మరోవైపు బీజేపీ సైతం పంజాబ్‌లో అప్ సర్కారును గద్దె దించాలనే పట్టుదలతో ఉంది. దీంతో ఈ రెండు పార్టీల పొత్తుకు మార్గం సుగమమైంది.పంజాబ్‌లో అకాలీదళ్-బీజేపీది హిట్ జోడీ అని చెప్పొచ్చు. 1997 నుంచి 2017 వరకు పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు పర్యాయాలు ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయగా మూడుసార్లు (1997, 2007, 2012) అధికారం దక్కించుకున్నాయి. ఈ మూడు పర్యాయాలూ ప్రకాష్ సింగ్ బాదల్ పంజాబ్ సీఎంగా వ్యవహరించారు. 1966లో పంజాబ్ ఏర్పాటైన తర్వాత.. ఆ రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకున్న తొలి కూటమిగా అకాలీదళ్-బీజేపీ కూటమి నిలిచింది.పంజాబ్‌లో మొత్తం 117 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2022 ఎన్నికల్లో 92 సీట్లు గెలిచిన ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ 18 సీట్లకు పరిమితమైంది. అకాలీదళ్ 3, బీజేపీ 2 సీట్లు గెలవగా.. బీఎస్పీ, ఇండిపెండెంట్ చెరో సీటు గెలిచారు.2027 ఎన్నికల్లో పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్, అకాలీదళ్-బీజేపీతోపాటు ఎంపీ అమృత్ పాల్ సింగ్ నాయకత్వంలోని కొత్త పార్టీ కూడా బరిలోకి దిగనుంది. మరోవైపు బీజేపీలో ఉన్న మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ తిరిగి కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరుగుతోంది. దీంతో ఎవరికి మ్యాజిక్ ఫిగర్ వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.మరోవైపు, అకాలీదళ్ తిరిగి ఎన్డీఏలో చేరడం జాతీయ స్థాయిలోనూ బీజేపీకి వ్యూహాత్మకంగా కలిసిరానుంది. పార్లమెంట్ ముందుకు రానున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం కోసం ఎన్డీఏకు అదనపు బలం అవసరమైన వేళ అమిత్ షా జరిపిన చర్చలు ఫలించాయని అనుకోవచ్చు.

జిల్లాలోని పేద, మధ్య తరగతి ప్రజల ఉన్నతికి బ్యాంకులు ఊతమివ్వాలి

- బ్యాంకులు అందించే పథకాలన్నీ అర్హులకు అందించాలి:

- ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్.



నిర్మల్ జిల్లా, నవంబర్ 25,(విజన్ ఆంధ్ర); జిల్లాలోని పేద మధ్యతరగతి ప్రజల ఉన్నతికి బ్యాంకులు ఊతమివ్వాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ (డిసిసి), జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా బ్యాంకుల పనితీరు, బ్యాంకింగ్ శాఖలు, డిపాజిట్లు, రుణాల పంపిణీ, క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో బ్యాంకింగ్ రంగం గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని, గత త్రైమాసికంతో పోలిస్తే ప్రస్తుత త్రైమాసికంలో బ్యాంకుల మొత్తం వ్యాపారంలో వృద్ధి నమోదైనట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి బ్యాంకులు అధిక ప్రాధాన్యతనిస్తూ రైతులకు రుణాలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. గత త్రైమాసికంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన రుణాలు రూ.1,347.42 కోట్లు ఉండగా, ప్రస్తుత త్రైమాసికంలో రూ.2,447.42 కోట్లకు చేరినట్లు సమావేశంలో చెప్పారు. బ్యాంకర్ల కృషిని ఎంపీ అభినందించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి బ్యాంకులు రుణ సహకారం అందించడం గొప్ప విషయం అని చెప్పారు. గత త్రైమాసికంలో రూ.497.93 కోట్లుగా ఉన్న ఎంఎస్ఎంఈ రుణాలు ప్రస్తుత త్రైమాసికంలో రూ.644.23 కోట్లకు పెరిగినట్లు తెలిపారు. గృహ రుణాల విభాగంలో కూడా గత త్రైమాసికంతో పోలిస్తే సుమారు రూ.47.90 కోట్ల వృద్ధి నమోదైనట్లు వెల్లడించారు. అలాగే ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం, కిసాన్ క్రెడిట్ కార్డులు, పశుసంవర్ధక, మత్స్య రంగ రుణాలు, మహిళా సంఘాల రుణాలు, విద్యా రుణాలు, పీఎంజెజెబివై, పిఎంఎస్బివై, ఎపివై వంటి సామాజిక భద్రతా పథకాలు మెరుగ్గా అర్హులకు అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు మరింత రుణ సహకారం అందిస్తూ, ఆర్థిక అభివృద్ధికి బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్‌బీఓ రాములు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్‌గోపాల్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం నరేష్, నాబార్డ్ ప్రతినిధి అబ్దుల్లా రహూఫ్, డి ఆర్ ఓ రాథోడ్ రమేష్, అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో మంథని.. శ్రీధర్ బాబు మార్క్!!

- తండ్రి కలలకు తనయుడి సంతకం

- మంథని ప్రగతికి మూడు మైలురాళ్లు

- కళా వికాసం.. పేదల సంక్షేమం..

పుష్కర అభివృద్ధి







పెద్దపల్లి బ్యూరో చీఫ్, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): ఒకవైపు నాన్న నాటిన కళా విత్తనం మహావృక్షమై నూతన భవనంలోకి అడుగుపెడుతున్న భావోద్వేగం.. మరోవైపు 'సొంతింటి కల' నెరవేరిన నిరుపేద కుటుంబాల కళ్లలో మెరిసిన ఆనందభాష్పాలు.. ఇంకోవైపు గోదావరి పుష్కరాల వేళ మంథని రూపురేఖలను మార్చే అభివృద్ధి పనుల పరుగులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంథని పర్యటన ఆద్యంతం అటు అభివృద్ధి, ఇటు అనుబంధాల మేళవింపుగా సాగింది.

నాన్న ఆశయానికి నూతన రూపం..!

మంథనిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల నూతన భవనాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లో దివంగత నేత, తన తండ్రి స్వర్గీయ శ్రీపాదరావు జ్ఞాపకాలు, మంథని కళా వైభవం పట్ల ఆయనకున్న మమకారం స్పష్టంగా కనిపించాయి. "నాన్న నాడు ఎంతో ముందుచూపుతో ప్రారంభించిన సంగీత, నృత్య విద్యా కార్యక్రమాలు నేడు ఇంత గొప్పగా విస్తరించడం నాకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిస్తోంది" అంటూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. మంథని చిన్నారులు రవీంద్రభారతి వేదికపై తమ ప్రతిభను చాటడం గర్వకారణమని, సరస్వతి, నటరాజుల ఆశీస్సులతో మంథని నిజమైన 'సరస్వతి నిలయం'గా విరాజిల్లాలని ఆకాంక్షించారు.

కన్నీళ్లు తుడిచిన 'ఇందిరమ్మ' గూడు..!

అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలే కాదు.. పేదవాడి కళ్లలో ఆనందం చూడటమేనని మంత్రి మరోసారి నిరూపించారు. పోచమ్మవాడకు చెందిన నాయిని భవాని రాజు, నాయిని మల్లమ్మ, వడ్లవాడకు చెందిన మల్లోజు సునీత-నాగరాజు కుటుంబాల నూతన 'ఇందిరమ్మ ఇళ్ల' గృహప్రవేశ వేడుకల్లో మంత్రి స్వయంగా పాల్గొన్నారు. అద్దె ఇళ్ల కష్టాల నుంచి విముక్తి పొంది, సొంత గూటిలోకి అడుగుపెడుతున్న ఆ కుటుంబాల ఆనందంలో ఆయన పాలుపంచుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ ఇళ్లను అందిస్తోందని, ప్రతి నిరుపేద జీవితంలో వెలుగులు నింపడమే తమ లక్ష్యమని భరోసా ఇచ్చారు.

పుష్కర పనుల్లో రాజీ లేదు.. విమర్శలకు తావులేదు..!

రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంథని మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పారదర్శకతకు పెద్దపీట: పుష్కరాల వంటి పవిత్ర కార్యక్రమాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా, నాణ్యతతో గడువులోగా పనులు పూర్తి చేయాలని చీఫ్ ఇంజినీర్ (సీఈ) స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

యువతకు ఉపాధి బాట: మంథని ఐటీఐలో త్వరలోనే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) పనులను ప్రారంభించనున్నట్లు ప్రకటించి యువతలో కొత్త ఉత్సాహం నింపారు.

విమర్శకులకు కౌంటర్: పని చేసే వారిపై విమర్శలు సహజమని, వాటిని పట్టించుకోకుండా ప్రజా సంక్షేమమే అజెండాగా తమ ప్రయాణం కొనసాగుతుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

మొత్తంగా.. తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే కొడుకుగా, పేదల కష్టాలు తీర్చే ప్రజాప్రతినిధిగా, మంథని భవిష్యత్తును తీర్చిదిద్దే దార్శనికుడిగా మంత్రి శ్రీధర్ బాబు పర్యటన స్థానికుల హృదయాలను హత్తుకుంది.

'అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన'



మందమర్రి, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) : రెండేళ్లలో మందమర్రి పట్టణంలోని ప్రతి కాలనీలో సి.సి రోడ్లు,డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార,గనులు,భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి 1 కోటి 93 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ సి.సి రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు,అధికారులతో కలిసి ప్రారంభోత్సవం,శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మందమర్రి మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో 58 లక్షల రూపాయలతో లక్ష్మీ భవానీ కాలనీలో చేపట్టిన అంతర్గత సి.సి రోడ్డును ప్రారంభించి,3వ వార్డులో ఖబ్రస్తాన్ వరకు 76 లక్షల రూపాయలతో అప్రోచ్ సి.సి రోడ్డు,19వ వార్డులో 59 లక్షల రూపాయలతో అంతర్గత సి.సి రోడ్డు,2 వార్డు,22 వార్డులో 52 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని,ప్రజల మధ్యకు వెళ్లినప్పుడే వారి సమస్యలు,అవసరాలు తెలుస్తాయని తెలిపారు. మందమర్రి పట్టణంలోని అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అత్యవసరమైన పనులను ముందుగా పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మందమర్రి పట్టణంలో టామ్‌కామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్మన్ భాష శిక్షణ తరగతులను సందర్శించి శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో మాట్లాడారు. 6 నెలలుగా శిక్షణ కొనసాగిస్తున్న అభ్యర్థులను అభినందించారు. ప్రస్తుతం బి-1 స్థాయి శిక్షణ పూర్తి చేసుకున్న వారు బి-2 స్థాయిని కూడా విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జర్మన్ భాషలో ప్రావీణ్యం సాధించడంతో పాటు అవసరమైన పరీక్షలలో ఉత్తీర్ణత సాధిస్తే జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2 సంవత్సరాలకు పైగా పని అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యతనిస్తూ ప్లేస్‌మెంట్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. జర్మన్ భాషా శిక్షణ పొందిన వారికి టామ్‌కామ్‌లో శిక్షకులుగా అవకాశాలు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకూ పింఛన్లా?

- అర్హులైన వృద్ధులకు మాత్రం మొండిచేయి!

- గ్రామంలో ఒక్కరికే వృద్ధాప్య పింఛన్..

- మిగతా అర్హులంతా అనర్హులేనా?

- ఫోర్ వీలర్ వాహనాలున్నా పింఛన్లా? సర్వే అధికారుల పనితీరుపై ప్రశ్నలు!

- పింఛన్ల సర్వే ఏ మత్తులో చేశారు? అనర్హులకు వరం.. అర్హులకు శాపం!

- 85 ఏళ్ల వృద్ధులకు పింఛన్ కష్టాలు..

- ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోంది?

- అనర్హులకు పింఛన్లు.. అర్హులైన వృద్ధులకు అన్యాయం!

- మండలవ్యాప్తంగా సమగ్ర విచారణ చేపట్టి అనర్హులను తొలగించాలి..

- అర్హులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలి



గ్రామంలో ఒక్కరికే పింఛన్.. మిగతావారికి ఎందుకు లేదు?

వృద్ధాప్య పింఛన్ల విషయంలో గ్రామాల్లో అర్హులైన వారందరికీ సమానంగా న్యాయం జరగాలని ప్రజలు కోరుతున్నారు. ఒకే గ్రామంలో ఒకరికి పింఛన్ మంజూరై, అదే పరిస్థితుల్లో ఉన్న ఇతర వృద్ధులకు పింఛన్ అందకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పింఛన్ల మంజూరులో ఏ ప్రాతిపదికన అర్హులను ఎంపిక చేస్తున్నారు? ఒకరికి పింఛన్ మంజూరు చేసినప్పుడు, అదే అర్హతలు కలిగిన ఇతరులకు ఎందుకు మంజూరు చేయడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులకూ.. ఫోర్ వీలర్ వాహనాలున్న వారికీ పింఛన్లా?

ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నవారికి, ఫోర్ వీలర్ వాహనాలు కలిగిన వారికి కూడా పింఛన్లు అందుతున్నాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పింఛన్లకు అర్హత లేని వారికి పథకం ఎలా వర్తిస్తోంది? అర్హతలను పరిశీలించకుండా పింఛన్లు మంజూరు చేశారా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. పింఛన్ల సర్వే నిర్వహించిన అధికారులు ఏ ప్రాతిపదికన అర్హులను గుర్తించారు? క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించారా? లేక కార్యాలయాల్లోనే కూర్చొని సర్వే పూర్తి చేశారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

85 ఏళ్ల వృద్ధులకు పింఛన్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం ఎందుకు?

85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు జీవనాధారం కోసం పింఛన్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. అలాంటి వృద్ధులకు పింఛన్లు అందకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వృద్ధాప్యంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

మండలవ్యాప్తంగా సమగ్ర సర్వే చేపట్టాలి

కొండాపూర్ మండలవ్యాప్తంగా పింఛన్ల పంపిణీపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అర్హత లేని వారికి పింఛన్లు అందుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం తొలగించాలని, అర్హులైన వృద్ధులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, వాహనాలు ఉన్నవారికి పింఛన్లు అందుతున్నాయనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, పింఛన్ల సర్వేలో జరిగిన తప్పిదాలను సరిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు. అనర్హులకు పింఛన్లు అందిస్తూ.. అర్హులైన వృద్ధులకు అన్యాయం చేస్తే ఎలా? 85 ఏళ్ల వృద్ధుల పింఛన్ల విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోంది? మండలవ్యాప్తంగా పింఛన్లపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు మెరుగైన సేవలే ధ్యేయం..

- భిక్కనూరు సొసైటీ అడుగులు!

- తొలి సమావేశంలో రైతు ప్రయోజనాలపై చర్చ..

- ఎరువులు, విత్తనాల లభ్యతకు ప్రాధాన్యం



భిక్కనూరు, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగానికి మరింత చేయూత అందించడమే లక్ష్యంగా భిక్కనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో పాలకవర్గం తొలి సమావేశాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు లింగాల రాజబాబు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతుల అవసరాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా రైతులకు సాగు సమయంలో ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సహకార సంఘం ద్వారా అందించే సేవల్లో జాప్యం లేకుండా చూడాలని నిర్ణయించారు. రైతులు కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించడంపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లింగాల రాజబాబు గౌడ్ మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతే తమ పాలకవర్గం ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని, సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ చేపడతామని తెలిపారు. పాలకవర్గ సభ్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎం. రాజు, సిబ్బంది పసుల రవికిరణ్, బాసం స్వామి, జె.పి. ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్సిడీ రుణాలపై అవగాహన సదస్సు



దేశమంతా మారుమోగిన తెలంగాణ బిగుల్ శబ్దం

- సిల్వర్ మెడల్‌తో సత్తా చాటిన మన పోలీసులు!
- 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీల్లో తెలంగాణకు రెండో స్థానం
- అనుభవంతో అదరగొట్టిన ఎ+ట్రాబా బిగులర్లు
- వెంకటస్వామి, రాంలాల్‌కు ఘన సన్మానం



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్,నవంబర్ 25, విజన్ ఆంధ్ర: బిగుల్ శబ్దం వినిపిస్తేనే గుండె ఝుల్లుమనాలి. క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తి – అన్నీ ఆ ఒక్క శబ్దంలో కనిపించాలి. అలాంటి శబ్దంతోనే తెలంగాణ పోలీస్ బ్యాండ్ బృందం దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ అండ్ బిగులర్ పోటీల్లో తెలంగాణ పోలీస్ జట్టు సిల్వర్ మెడల్‌తో పాటు ప్రతిష్టాత్మక కప్‌ను సొంతం చేసుకుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ బ్యాండ్ బృందాలు పోటీపడిన ఈ పోటీల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలవడం అంటే మామూలు విషయం కాదు.

విజయ వెనుక ఇద్దరు హీరోలు

ఏడుగురు సభ్యులతో కూడిన తెలంగాణ జట్టులో అందరూ అద్భుతంగా ప్రదర్శన ఇచ్చినా, అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం ఇద్దరు – హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి, పోలీస్ కానిస్టేబుల్ రాంలాల్. వీరిద్దరూ ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీలో ఔట్‌డోర్ విభాగంలో ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేస్తున్నారు. ఇది వారికి మొదటిసారి కాదు. ఇప్పటికే ఏడుసార్లు ఆల్ ఇండియా పోటీల్లో పాల్గొన్న అనుభవం వీరి సొంతం. ఆ అనుభవమే ఈసారి జట్టుకు సిల్వర్ మెడల్ తెచ్చిపెట్టింది. అకాడమీలో శిక్షణ పొందుతున్న వందలాది మంది పోలీస్ సిబ్బందికి వీరిద్దరూ బిగులర్ విభాగంలో శిక్షణ ఇస్తున్నారు. తమకు తెలిసిన విద్యను తోటి సిబ్బందికి నేర్పిస్తూ, తెలంగాణ పోలీస్ ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెడుతున్నారు.

అకాడమీలో ఘన సత్కారం

ఈ విజయాన్ని గుర్తిస్తూ అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష బిస్త్, ఐపీఎస్ ఇద్దరినీ ప్రత్యేకంగా అభినందించారు. కమాండేషన్ సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ – "తెలంగాణ పోలీస్ అకాడమీ కేవలం లా అండ్ ఆర్డర్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లోనే కాదు, బ్యాండ్, బిగులర్ వంటి విభాగాల్లో కూడా అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ ఇస్తోంది. వెంకటస్వామి, రాంలాల్‌లు తమ అంకితభావంతో, అనుభవంతో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి కృషి వల్లే తెలంగాణకు ఈ గౌరవం దక్కింది" అని ప్రశంసించారు.

హాజరైన ప్రముఖులు

ఈ సత్కార కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు ఎన్. వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు టి. భరత్, వేముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ పేరు జాతీయ స్థాయిలో మరోసారి మారుమోగడం పట్ల అకాడమీ సిబ్బంది, శిక్షణ పొందుతున్న అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కీరవాణి సంగీతంలో గ్లోబల్ సమిట్‌పై ప్రత్యేక గీతం

- నాలుగు భాషల్లో అదిరిపోయే పాట!
- డిసెంబర్ 7, 9 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు
- సీఎస్ సంజయ్ జాజు వెల్లడి



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర: తెలంగాణలో జరగనున్న గ్లోబల్ సమిట్‌కు మరింత వైభవం తీసుకురానున్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి. ఆయన సంగీత దర్శకత్వంలో గ్లోబల్ సమిట్‌పై ప్రత్యేక గీతాన్ని రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు తెలిపారు.

నాలుగు భాషల్లో గీతం

ఈ ప్రత్యేక గీతం ఏకంగా నాలుగు భాషల్లో ఉంటుందని సీఎస్ సంజయ్ జాజు వెల్లడించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌తో పాటు మరో భాషలో కూడా ఈ గీతాన్ని రూపొందిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి, గ్లోబల్ సమిట్ లక్ష్యాలను ప్రతిబింబించేలా ఈ పాట ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి సంగీతం అందించడం వల్ల ఈ గీతానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. సమిట్‌కు వచ్చే విదేశీ ప్రతినిధులకు తెలంగాణ గొప్పతనాన్ని ఈ పాట ద్వారా చాటి చెప్పాలన్నది లక్ష్యం.

డిసెంబర్ 7, 9 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

గ్లోబల్ సమిట్ సందర్భంగా డిసెంబర్ 7, 9 తేదీల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ సంప్రదాయ నృత్యాలు, సంగీతం, కళారూపాలు ప్రదర్శించనున్నారు. సమిట్‌కు వచ్చే ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతిని దగ్గరగా చూపించేలా ఈ కార్యక్రమాలను తీర్చిదిద్దుతున్నారు. కీరవాణి గీతం కూడా ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. గ్లోబల్ సమిట్ ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని సీఎస్ తెలిపారు.

చర్చి ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మంత్రి అజారుద్దీన్
- మెన్నోనైట్ బ్రద్రెన్ చర్చ్ నూతన పాలక మండలితో మంత్రి భేటీ
- జడ్చర్ల 58 ఎకరాల భూమి అంశంపై కీలక చర్చ
- నూతన కమిటీకి అభినందనలు
- సమస్యల పరిష్కారానికి దీపక్ జాన్‌తో సమన్వయం చేసుకోవాలని సూచన



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్,నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

మైనారిటీ సంస్థల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్పష్టం చేశారు. మెన్నోనైట్ బ్రద్రెన్ చర్చ్ ఆఫ్ ఇండియా నూతనంగా ఎన్నికైన పాలక మండలి ప్రతినిధులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

నూతన పాలక మండలి పరిచయం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన పాలక మండలి సభ్యులను ప్రతినిధి బృందం మంత్రికి పరిచయం చేసింది.

- అధ్యక్షుడు: డాక్టర్ సి.ఎస్. జోయెల్
- ఉపాధ్యక్షుడు: కె.ఇ. రాజారత్నం
- ప్రధాన కార్యదర్శి: ఎ. శ్యామ్‌రావు
- సహాయ కార్యదర్శి: ప్రసాద్
- కోశాధికారి: బండారి ప్రసాద్
- కార్యవర్గ సభ్యులు:లి బ్రదర్ జి.జి. పాల్, బ్రదర్ ఎం.ఎ. వందన

నూతన కమిటీకి మంత్రి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

దేశవ్యాప్తంగా 956 చర్చిలు – 3 లక్షల మంది సభ్యులు

ఈ సందర్భంగా సంస్థ విస్తృతి గురించి ప్రతినిధులు మంత్రికి వివరించారు. దేశవ్యాప్తంగా 956 చర్చిలు, సుమారు 3 లక్షల మంది సభ్యులు, 10 ఫీల్డ్ అసోసియేషన్లతో మెన్నోనైట్ బ్రద్రెన్ చర్చ్ సామాజిక, ఆధ్యాత్మిక, వైద్య, విద్యా రంగాల్లో సేవలు అందిస్తోందని తెలిపారు.

జడ్చర్ల భూమి ఆక్రమణ – ప్రధాన అంశం

అయితే భేటీలో అత్యంత కీలకంగా చర్చకు వచ్చిన అంశం – చర్చి ఆస్తుల ఆక్రమణ.

జడ్చర్లలో సుమారు 58 ఎకరాల భూమితో పాటు చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య, మిషనరీ సేవలకు సంబంధించిన మరికొన్ని విలువైన ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని, అక్రమ లావాదేవీలు జరిగాయని ప్రతినిధులు ఆరోపించారు. ఆ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వ సహకారం కోరారు.

చట్టప్రకారం చర్యలు – మంత్రి హామీ

ప్రతినిధుల వినతిపై మంత్రి అజారుద్దీన్ సానుకూలంగా స్పందించారు.

"ఆస్తులకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. చర్చికి చెందిన ఆస్తులను తిరిగి అప్పగించే ప్రక్రియలో ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తాం" అని హామీ ఇచ్చారు. వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలపై మరింత చర్చించి, సమన్వయం చేసుకునేందుకు తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను కలవాలని మంత్రి ప్రతినిధులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల ద్వారా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించడంపై ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. మైనారిటీ వర్గాల సంక్షేమం, వారి సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం – మతపెద్దల మధ్య ఇలాంటి సమన్వయం ఎంతో అవసరమని ఈ భేటీ మరోసారి స్పష్టం చేసింది.

తెలంగాణ ప్రభుత్వం
సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
అపరేషన్/మేడ్చల్ జోన్
ప్రార్ట్ టెండర్ పేపర్ నోటిఫికేషన్ నెం: 08 ఆఫ్ 26-27
ప్రార్ట్ టెండర్ అనుభవం గల మరియు జి.ఎస్.టి. సమోదిత వెండర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆహ్వానించబడుచున్నది: "26-27 లోని టి.ఎస్.పి.ఎస్. నెం.లు: 17, 18 (వర్గెర/సాగర), 19, 20, 21 (ఎస్.సి.), 22, 23, 24 – మేడ్చల్ & హబ్సిగూడ సర్కిళ్లలో బైపర్సేషన్/ఇంటర్‌లింకింగ్ లైన్లు మరియు ఎస్.ఎస్. నిర్వహణ పనులకు, మరియు 26-27 లోని మెటీరియల్ టి.ఎస్.పి.ఎస్. నెం.లు: 12 నుండి 23 – మేడ్చల్ జోన్‌లో విభిన్న సామగ్రి సేకరణకు". బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం: 26.11.2026 14:00 గంటల నుండి, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ & సమయం: 04.12.2026, 17:00 గంటల వరకు, హార్డ్ కాపీల సమర్పణ తేదీ & సమయం: 05.12.2026, 14:00 గంటల వరకు, టెక్నికల్ బిడ్ తెరిచే తేదీ & సమయం: 05.12.2026, 14:30 గంటలకు & ప్రైస్ బిడ్ తెరిచే తేదీ & సమయం: 07.12.2026, 15:00 గంటలకు. మరిన్ని వివరాల కొరకు దయచేసి www.tender.telangana.gov.in/www.tgsouthernpower.org సందర్శించండి.
సం/-
చీఫ్ ఇంజనీర్,
అపరేషన్/మేడ్చల్ జోన్,
మింట్ కాంపౌండ్, టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్.
DIPR RO NO 14382-PP/CL/ADVT/2026-27 తేదీ 25-11-2026



కొండగట్టు 'నిజరూప దర్శనం' సామాన్యులకు దూరం..!

- కోట్లల్లో ఆదాయం వున్నా.. భక్తులకు వసతులు కరువు.!
- వీఐపీల సేవలో అధికారుల నిర్లక్ష్యంతో భక్తుల నరకయాతన..
- చరిత్రలో తొలిసారి ప్రధాన ద్వారం మూసివేత..!
- హనుమాన్ జయంతి తరహా నిబంధనలతో సకుటుంబ భక్తులకు ఇక్కట్లు..
- రూ. 21.98 కోట్ల ఆదాయం ఉన్నా కరువైన సౌకర్యాలు
- స్థానిక ఎమ్మెల్యే ఆలయ ఏర్పాట్ల పై ప్రత్యేక చొరవ చూపాలి..!

మల్యాల, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర):

చరిత్రలోతొలిసారి ప్రధాన ద్వారం మూసివేత

తెల్లవారుజాము నుంచే నిజరూప దర్శనం కోసం భక్తులు భారీగా బారులు తీరారు. భక్తుల రద్దీపై ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ఆలయ ఈవో, అధికారులు, పోలీసు యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయలేదు. 3 నుండి 4 గంటల పాటు క్యూలైన్లలో వేచి ఉండి సహనం కోల్పోయిన భక్తులు ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుంటూ లోపలికి దూసుకెళ్లడంతో తోపులాట, తొక్కిసలాట చోటుచేసుకుంది. పరిస్థితి చేయిదాటిపోవడంతో కొండగట్టు ఆలయ చరిత్రలోనే తొలిసారిగా అధికారులు ఆలయ ప్రధాన ద్వారాన్ని మూసివేయాల్సి వచ్చింది.



తేడా తెలియని అధికారులతో భక్తులకు అవస్థలు

హనుమాన్ జయంతి ఉత్సవాలకు, మిగతా పర్వదినాలకు మధ్య ఉన్న కనీస వ్యత్యాసాన్ని గుర్తించడంలో ఆలయ యంత్రాంగం విఫలమైంది. హనుమాన్ జయంతికి ప్రధానంగా మాలధారులు (మగవారు) మాత్రమే వస్తారు. కానీ చందనోత్సవం, కార్తీక పౌర్ణమి వంటి ఉత్సవాలకు భక్తులు సకుటుంబ సమేతంగా వస్తారు. వీరిలో గర్భిణులు, చంటిపిల్లల తల్లులు, వృద్ధులు (సీనియర్ సిటిజన్లు), అనారోగ్యంతో బాధపడేవారు ఉంటారు. ఈ వాస్తవాన్ని విస్మరించిన అధికారులు, వాహనాలను రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేయడంతో మండుటెండలో నడిచి రావడానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మార్గమధ్యంలో కనీసం చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదు.

నీడ, తాగునీరు కరువు.. కోనేరులో నాచు

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ క్యూలైన్ల వద్ద కనీసం తాత్కాలిక షెడ్లు (పందిళ్లు) గానీ, ఫ్యాన్లు గానీ ఏర్పాటు చేయకపోవడంతో ఉక్కపోత, దాహంతో చిన్నపిల్లలు, వృద్ధులు అల్లాడిపోతూ అస్వస్థతకు గురయ్యారు. మరోవైపు ఆలయ కోనేరు (గుండం)లో నీళ్లు లేకపోవడం, స్నానఘట్టాల వద్ద ట్యాప్‌ల కింద నాచు పేరుకుపోయి భక్తులు జారిపడే ప్రమాదం ఉండటంపై తీవ్ర అసంతృప్తి



వ్యక్తమైంది. సుదూర ప్రాంత భక్తులకు వసతి గదులు దొరక్క రాత్రివేళ చలిలో ఆరుబయటే గడపాల్సి వచ్చింది. కొబ్బరికాయల విక్రయాల వద్ద అధిక ధరలు వసూలు చేయడం, చిల్లర ఇవ్వకుండా భక్తులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంపై భక్తులు మండిపడ్డారు.

రూ. 21.98 కోట్ల ఆదాయం ఉన్నా కరువైన అభివృద్ధి

నివేదికల ప్రకారం 2025--26 ఆర్థిక సంవత్సరంలో కొండగట్టు దేవస్థానానికి దాదాపు రూ. 21 కోట్ల 98 లక్షల (సుమారు రూ. 20--25 కోట్లు) వార్షిక ఆదాయం సమకూరుతోంది. ఇంత భారీ స్థాయిలో హుండీ, కానుకల రూపంలో ఆదాయం వస్తున్నా, దానికి తగినట్లుగా ఆలయంలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి ఏటా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ, సామాన్య భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆలయ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. మంగళవారం, కార్తీక పౌర్ణమి, గిరి ప్రదక్షిణ, మరియు స్వామి వారి 'నిజరూప దర్శనం' ఒకేరోజు రావడంతో రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా తరలివచ్చిన భక్తులు సరైన ఏర్పాట్లు లేక తీవ్ర నరకయాతన అనుభవించారు. ?

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపాలి

ఆలయ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు వస్తోందని స్థానికులు అంటున్నారు. కేవలం వీఐపీల దర్శనాలకే పరిమితం కాకుండా, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొండగట్టు ఆలయ వ్యవహారాలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని భక్తులు, స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఆయన స్వయంగా రంగంలోకి దిగి అధికారుల తీరును ప్రక్షాళన చేయాలని, సామాన్య భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తులు, స్థానికుల ప్రధాన డిమాండ్లు ఇవే

మౌలిక వసతులు.. ఆలయానికి వస్తున్న భారీ ఆదాయానికి అనుగుణంగా క్యూలైన్లలో శాశ్వత షెడ్లు, తాగునీరు, వసతి గదులు, కోనేరు వద్ద భద్రతా చర్యలు కల్పించాలి.

ట్రాఫిక్ నియంత్రణలో చేతులెత్తేసిన అధికారులు

భక్తుల వాహనాలను 'వై' జంక్షన్ వరకు అనుమతించి, అక్కడ పోలీసుల సహాయంతో వాహనాలు నిలిచిపోకుండా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి.

క్యూలైన్ల విభజన ఎక్కడ..? అంతరాలయ దర్శన విధానంలో మార్పులు చేసి.. అంతరాలయం, సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లను వేరువేరుగా ఏర్పాటు చేయాలి.

సమాచార కేంద్రం లేదు

ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక విచారణ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, అందరికీ అందుబాటులో ఉండేలా ఒక ఫోన్ నంబర్ ఇవ్వాలి. ఇకనైనా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందించి కొండగట్టు ఈవో మరియు అధికారుల పనితీరుపై దృష్టి సారించాలని, సామాన్య భక్తులకు గౌరవప్రదమైన నిజరూప దర్శనం కల్పించాలని భక్తజన కోటి ముక్తకంఠంతో కోరుతున్నది.

మహబూబాబాద్‌లో దారుణం..!



- ప్రసవం అయ్యేవరకు ఏం చేస్తున్నారు?
- కళాశాల యాజమాన్యంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం..
- విద్యార్థినులపై పర్యవేక్షణ ఏది..!
- ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని సమగ్ర విచారణకు డిమాండ్

ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థినికి ప్రసవం, శిశువు మృతి!

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

మహబూబాబాద్ జిల్లాలో ఘోరమైన, కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ హాస్టల్‌లోనే ఓ డిగ్రీ విద్యార్థినికి ప్రసవం జరిగింది. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థిని ప్రసవించడం, ఆ తర్వాత జన్మించిన శిశువు మృతి చెందడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటన గిరిజన సంక్షేమ హాస్టళ్లలో, కళాశాలల్లో విద్యార్థినుల భద్రత, పర్యవేక్షణ, ఆరోగ్య పరిరక్షణపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.

హాస్టల్‌లోనే ప్రసవం – ఆస్పత్రికి తరలింపు

వివరాల ప్రకారం... మహబూబాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీకి అనుబంధంగా ఉన్న బాలికల హాస్టల్‌లో ఉంటున్న ఓ డిగ్రీ విద్యార్థినికి మంగళవారం హాస్టల్‌లోనే పురిటి నొప్పులు వచ్చి ప్రసవం జరిగింది. విషయం తెలియగానే హాస్టల్ సిబ్బంది, కళాశాల సిబ్బంది హుటాహుటిన స్పందించి విద్యార్థినిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే జన్మించిన శిశువు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని సమాచారం. ఘటనపై ఆసుపత్రి వర్గాలు, పోలీసులు, కళాశాల యాజమాన్యం నుంచి అధికారికంగా పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.



తల్లిదండ్రులకు సమాచారం – పోలీసుల విచారణ?

ఘటన జరిగిన వెంటనే విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. హాస్టల్‌లో ప్రసవం ఎలా జరిగింది, విద్యార్థిని గర్భం దాల్చిన విషయం హాస్టల్ సిబ్బందికి, కళాశాల యాజమాన్యానికి ముందే తెలిసిందా, తెలిసి కూడా పట్టించుకోలేదా, లేక విద్యార్థిని ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదా అనే అంశాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన వెనుక ఎవరైనా బాధ్యులా అనే కోణంలో కూడా విచారణ జరగాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీసులు కూడా ఘటనపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

విద్యార్థి సంఘాల ఆగ్రహం – యాజమాన్యంపై తీవ్ర విమర్శలు

ఈ ఘటన వెలుగులోకి రాగానే విద్యార్థి సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యార్థినికి ప్రసవం జరిగే వరకు కళాశాల యాజమాన్యం ఏం చేస్తోంది?" అంటూ నిలదీశారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. హాస్టల్ వార్డెన్, కేర్ టేకర్, కళాశాల ప్రిన్సిపల్‌లు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణలో హాస్టల్ నిర్వహణ, వార్డెన్ విధులు, కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం అన్ని కోణాల్లో పరిశీలించాలని కోరారు. అంతేకాదు, బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్య సదుపాయాలు, మానసిక సలహాలు, అవసరమైన ఆర్థిక, న్యాయ సహాయం అందించాలని, ఆమె భవిష్యత్ చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఈ ఘటనతో విద్యార్థిని మానసికంగా ఎంతో కుంగిపోయి ఉంటుందని, ఆమెను ఒంటరిగా వదిలేయకుండా అండగా నిలవాలని సూచిస్తున్నారు.

గిరిజన హాస్టళ్ల పరిస్థితిపై మళ్లీ చర్చ

ఈ ఒక్క ఘటన మహబూబాబాద్‌కే పరిమితం కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థినుల భద్రత, పర్యవేక్షణ, ఆరోగ్య పరిరక్షణ ఎలా ఉందనే చర్చను మళ్లీ తెరపైకి తెచ్చింది. హాస్టళ్లలో సిబ్బంది కొరత, మహిళా వార్డెన్లు లేకపోవడం, రాత్రిపూట పర్యవేక్షణ లేకపోవడం, ఆరోగ్య పరీక్షలు సరిగా జరగకపోవడం వంటి సమస్యలు చాలా చోట్ల ఉన్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే అన్ని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి, విద్యార్థినుల భద్రతకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ప్రతి హాస్టల్‌లో మహిళా వార్డెన్, ఆరోగ్య కార్యకర్త, కౌన్సెలర్‌ను నియమించాలని డిమాండ్ వినిపిస్తోంది.



అధికారుల స్పందన కోసం ఎదురుచూపు

ప్రస్తుతం ఈ ఘటనపై జిల్లా అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విచారణ ప్రారంభించారా, బాధ్యులపై ఏం చర్యలు తీసుకుంటారు అనే దానిపై అందరి దృష్టి నెలకొంది. బాధిత విద్యార్థిని పేరు, వివరాలను బహిర్గతం చేయవద్దని, ఆమె గోప్యతకు భంగం కలగకుండా చూడాలని సామాజిక కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందా, లేక ఈ ఘటన కూడా కొన్ని రోజుల్లో మరుగున పడిపోతుందా అనేది వేచి చూడాలి.

సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతరు

తిరువరకుండ్రమ్ కొండపై వెలగని కార్తీక దీపం.
హిందూ సమాజంపై
విషంచిమ్ముతున్న సీఎం విజయ్
ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యం, సమానత్వంపై దాడి
సి.ఎం విజయ్ కి సద్బుద్ధి కలగాలని
శివాలయంలో పూజలు:
శంతన్ రామరాజ
రాష్ట్ర కార్యదర్శి
జాతీయ బిసి సంక్షేమ సంఘం తెలంగాణ

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (విజన్ ఆంధ్ర):హిందూ సమాజంపై విషం చిమ్ముతున్న తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కి సద్బుద్ధి కలగాలని స్థానిక శివాలయంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ మధురై తిరువకుండ్రమ్ కొండపై దీపం వెలుగకుండా కుట్ర పన్నిన తమిళనాడు ముఖ్యంత్రి



విజయ్ తన పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. మదురైలోని అన్ని వర్గాల ప్రజలకు లేని అభ్యంతరం కేవలం ముఖ్యమంత్రికే ఎందుకని ప్రశ్నించాడు. కొండపై దీపం వెలిగించొచ్చని ఇది అనాదిగా వస్తున్న సనాతన ఆచారమణి రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా సుప్రీం కోర్టుకు వెళ్లడమేమిటని అన్నాడు. సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చినా కూడా ఎవరి ప్రయోజనాల కోసం పోలీస్ బందోబస్తుతో ఈకార్యక్రమాన్ని ఆపాడో హిందువులు అర్థం చేసుకోవాలన్నాడు. ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉండి మెజారిటీ ప్రజల మనోభావాలను కించపర్చడం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించాడు.ప్రభుత్వ ఈ అసంబద్ధ చర్యల ద్వారా ప్రజల్లోని ఐక్యత నశించి కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని అన్నాడు.మొదటినుండీ తమిళ పాలకులు హిందూధర్మ నాశనం కోసమే పనిచేస్తున్నారని దుయ్యబట్టాడు. గత స్టాలిన్ సర్కార్ అయితే హిందూ మతాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చి తీవ్ర అవమాన పర్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక సంఖ్యలో తమిళనాడులో ఆలయాలు, దేవాదాయ భూములు ఉన్నాయని తెలిపాడు. వీటిద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్ళిస్తూ కూడా హిందూ ద్వేషిగా మారడం సిగ్గుచేటన్నాడు. పొద్దున లేస్తే రాజ్యాంగం గురించి మాట్లాడే పాలకులు ఒక్కోసారి ఉగ్రవాదుల కంటే దారుణంగా ఆలోచిస్తుండడం భావిభారతావనికి పెనుముప్పని ఆందోళన వెలిబుచ్చారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సాక్షాత్తు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రే తుంగలో తొక్కితే రాజ్యాంగానికి విలువెక్కడిదని ప్రశ్నించాడు. హిందూ ఆచారాల పట్ల తమిళనాడు సర్కార్ వైఖరిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని పిలునుచ్చారు. హిందూ సమాజం పూజలు చేసుకోవడం, మాలలు వేసికుంటే సరిపోదని ఇలాంటి ఘటనలు కుట్రలు జరిగినప్పుడు ప్రశ్నించడం నేర్చుకోవాలని హితవు పలికాడు. మనమూ, మన దేశం, మన సంస్కృతి అనే ఏకరూప సమభావనతో కూడిన జాతీయవాదమే మన మనుగడకు శ్రీరామరక్ష అని అన్నాడు. ఇకనైనా హిందూ సమాజం మేల్కొని తమకు జరుగుతున్న నష్టాన్ని, అన్యాయాన్ని, అవమానాన్ని ఐక్యత అనే పాశుపతాస్త్రంతో తుత్తునియలు చెయ్యాలని ఆకాంక్షించారు.

మున్సిపల్ కార్మికులని పరామర్శించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 25 (విజన్ఆంధ్ర)జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు ప్రయాణిస్తున్న ఆటో ప్రియా టాకిస్ రోడ్డు వద్ద బైక్ అడ్డు రావడంతో అదుపు తప్పి బోర్లా పడింది.ఈ ఘటనలో 9 మంది కార్మికులకు గాయాలు అయ్యాయి. వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి చికిత్స అందించడం జరుగుతుంది..వీరిలో 7 గురి పరిస్థితి సాధారణంగా ఉంది.ఇద్దరి పరిస్థితి కొద్దిగా గాయాలు అయ్యి సర్జరీ చేసే అవకాశం ఉందని డాక్టర్లు తెలిపారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్ ప్రభుత్వ ఆసువత్రి కి వెళ్లి బాధితులని పరామర్శించడం జరిగింది.కనకవ్వ,సావిత్రి కి సర్జరీ చేసే అవకాశం ఉందని వారికి మెరుగైన వైద్యం అందించి సరియైన సదుపాయాలు అందించాలని కోరారు.మిగితా లలిత,రాజమని, రవలి,స్వప్న,విజయ, మరియా పరిస్థితి బాగానే ఉందని తెలిపారు.ఆర్ఎన్ఓ సంతోష్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలను అందించాలని తెలిపారు.

భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

రీసర్వే ద్వారా భూముల విస్తీర్ణంపై రైతులకు స్పష్టమైన వివరాలు అందించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (విజన్ ఆంధ్ర)దామెర మండలం వెంకటాపూర్‌లో భూముల రీసర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్గ్రామంలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం వెంకటాపూర్‌లో భూములు కొలతలు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూ విస్తీర్ణాన్ని రీ సర్వే చేశారని, ఇంకా ఎంత మిగిలి ఉందని, ఎన్ని రోజుల్లో రీ సర్వే పూర్తి చేస్తారని, భూముల కొలతల విధానం, సాంకేతిక పరికరాల వినియోగం తదితర అంశాలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వేలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు.భూముల కొలతలను పక్కాగా చేపట్టాలని సూచించారు. సర్వేయర్లు భూముల రీ సర్వే అనంతరం సంబంధిత రైతులకు సాగు విస్తీర్ణం ఎంత ఉందనే వివరాలతో స్పష్టతనివ్వాలన్నారు. భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా అదనంగా మరొక రోవర్ ను కేటాయించామని, మరొక గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభించాలని సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల గ్రామాల సర్పంచులు పంచగిరి రాజు, చంద్రం, రవి యాదవ్, భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, డీఐ సతీష్ చంద్ర, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
దామెర మండలం వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి గ్రామానికి చెందిన అర్హులందరీ వివరాలను పక్కాగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కోసం లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మోర్తాల శ్రీనివాస్ అనే లబ్ధిదారుడి వివరాలను ఆన్‌లైన్‌లో బీమా కోసం వివరాలు నమోదు చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ఆన్లైన్ ప్రక్రియ ముగిసిన అనంతరం లబ్ధిదారుడి ఫోన్‌కు వచ్చిన సందేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన వారందరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. బీమా నమోదులో లబ్ధిదారు, వారికి సంబంధించిన నామినీ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వీవో భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజూ ఎంతమంది పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతున్నారు, వారికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ ప్యూరిఫైయర్, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించి వివరాలు ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచగిరి రాజు, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీ దేవి, ఇతర అధికారులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడి పూజకు కోనేరు కోనప్పకు ఆహ్వానం
కౌటాల శివాలయంలో ఈ నెల 29న మహాపడి పూజ



కౌటాల, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): కౌటాల శివాలయ ప్రాంగణంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా సిర్పూర్ మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్పను కౌటాల అయ్యప్ప స్వాములు ఆహ్వానించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు కోనేరు కోనప్పను మర్యాదపూర్వకంగా కలిసి మహాపడి పూజ కార్యక్రమ వివరాలను తెలియజేశారు. స్వామివారి పూజా కార్యక్రమానికి హాజరై పూజలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించే మహాపడి పూజకు ఎంతో ప్రత్యేకత ఉందని స్వాములు తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.కౌటాల శివాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ మహాపడి పూజకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వాముల ఆహ్వానాన్ని కోనేరు కోనప్ప స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కౌటాల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్
అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా పథకం ప్రయోజనం అందించాలి

వరంగల్ జిల్లాప్రతినిధి నవంబర్ 25(విజన్ ఆంధ్ర) ;-వరంగల్ జిల్లా కేంద్రంలోని రాయపర్తి మండలంలోని మైలారం గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లబ్ధిదారుల ఎంపిక, నమోదు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రంలో కొనసాగుతున్న లబ్ధిదారుల ఎంపిక, నమోదు ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పథకానికి అర్హులైన కుటుంబాలను గుర్తించి, వారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు.ప్రతి కుటుంబానికి ఎంపిక చేసిన నామినీ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా పథకం ప్రయోజనానికి దూరం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ సందర్శనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజి



రెడ్డి,ఐడి ఎస్సీ కార్పొరేషన్ సురేష్, తహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో శ్రీనివాస్, డిఇ ఓ ప్రశాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బెజ్జూర్ మండల మాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక
మండల అధ్యక్షుడిగా ఆదే అశోక్ రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక



బెజ్జూర్, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): బెజ్జూర్ మండల మాలి సంక్షేమ సంఘం నూతన మండల కమిటీ ఎన్నికలు బుధవారం మాలి కుల పెద్దలు, యువకులు, సంఘ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నూతన మండల అధ్యక్షుడిగా ఆదే అశోక్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాలి కులస్తులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదే నాందేవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్లే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కొట్రంగి రామకృష్ణ, కాగజ్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షులు నికాడి బాపురావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు.నూతనంగా ఎన్నికైన మండల కమిటీలో అధ్యక్షుడిగా ఆదే అశోక్, ఉపాధ్యక్షులుగా కావిడే గోపాల్, నికాడి మోహన్, ప్రధాన కార్యదర్శిగా గుర్లే పోచన్న, కార్యదర్శులుగా నికాడి మోహన్, చాటారి రాజు, కోశాధికారిగా టాకిరే రణీత్, ప్రచార కార్యదర్శిగా నికురి అంజన్న, సలహాదారుగా కావిడే సుగుణాకర్ ఎన్నికయ్యారు.అలాగే కార్యవర్గ సభ్యులుగా గుర్లే అంజయ్య, చాటారి గణపతి, సందే పురుషోత్తం, నికాడి కుమార్, మోర్లే భీమయ్యలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నికతో మండలంలోని మాలి కుల సంక్షేమ సంఘం కార్యకలాపాలకు మరింత ఊపందుకుంటుందని సంఘ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. మాలి కుల ఐక్యతను బలోపేతం చేస్తూ, సంఘ అభివృద్ధి, కుల సంక్షేమం, యువత ప్రోత్సాహం కోసం నూతన కమిటీ కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మాలి కులస్తులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ, మాలి కులస్తుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు, యువతకు ప్రోత్సాహం అందించడంలో ముందుండాలని సంఘ పెద్దలు సూచించారు. ఈ ఎన్నికల కార్యక్రమం మాలి కులస్తుల ఐక్యత, సంఘటిత శక్తికి నిదర్శనంగా నిలిచింది.

క్షత్తగాత్రులని పరామర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 25(విజన్ఆంధ్ర)జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు ప్రయాణిస్తున్న ఆటో ప్రియా టాకిస్ రోడ్డు వద్ద బైక్ అడ్డు రావడంతో అదుపు తప్పి బోర్లా పడిన విషయం తెలిసిందే .ఈ ఘటనలో 9 మంది కార్మికులకు గాయాలు అయ్యాయి. వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి చికిత్స అందించడం జరుగింది.వీరిలో 7 గురి పరిస్థితి సాధారణంగా,ఇద్దరికి గాయాలు ఎక్కువ అయ్యి సర్జరీ చేసే అవకాశం ఉందని డాక్టర్లు తెలిపారు.ఈ విషయం తెలుసుకొని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్లి బాధితులని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం జరిగింది. ఆర్ ఎం ఓ సంతోష్ ఇత్ర వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలను అందించాలని,క్షతగాత్రులకు అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు , టి పిఓ వినీత్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ డేవిడ్ రాజ్, ప్రశాంత్ ,రాజాం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులు, భద్రత మరియు POSH చట్టంపై అవగాహన
మహిళలపై హింస నిర్మూలనకు 16 రోజుల అవగాహన కార్యక్రమం. పాల్గొన్న ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్, కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి జిల్లా 25 నవంబర్ (విజన్ ఆంధ్ర)జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలంలోని ధన్వాడ గ్రామంలో మహిళలపై హింస నిర్మూలనకు నిర్వహిస్తున్న 16 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలపై హింస నివారణ, మహిళల హక్కులు, భద్రత, సమానత్వం, గృహహింస నివారణ, బాల్య వివాహాల నిరోధం, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, హెల్ప్‌లైన్ సేవలపై జిల్లా సంక్షేమ అధికారిణి మల్లేశ్వరి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ -- 2013), దాని ప్రాముఖ్యత, ఫిర్యాదు చేసే విధానం, మహిళలకు కల్పించిన రక్షణలు, పాఠశాలల్లో సురక్షితమైన వాతావరణం ఆవశ్యకత గురించి వివరించారు.మహిళలపై హింస, వేధింపులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మహిళలకు గౌరవప్రదమైన మరియు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీల్, ఇవీజ క్రిష్ణ, ఇజ్జూ వెంకటస్వామి, సురేష్, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్న కట్టా మనోజ్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి
అక్రమంగా కడుతున్న నిర్మాణాలను తొలగించాలి
సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్
హనుమకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

హనుమకొండ జిల్లా ప్రతినిది నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): హనుమకొండ జిల్లా అయినవోలు మండలం వెంకటాపురం గ్రామంలో సర్వే నంబర్ 324 లో కబ్జాకు గురైన భూమిని ప్రభుత్వ భూమి యని తేల్చినాక కూడా కబ్జాదారుడు నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ప్రశ్నించారు.గత ఆరు నెలల క్రితం స్థానిక పేదలు, సిపిఐ చేసిన పోరాటం ఫలితంగా మండల రెవెన్యూ అధికారులు ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి అని తేల్చినాక కూడా దానికి హద్దులు నిర్ణయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నశీదున కబ్జాదారుడు రెచ్చిపోయి ప్రభుత్వ భూమి చుట్టూ ఫినిషింగ్ చేస్తూ స్థానిక రైతులను, పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, ఇదేమిటని అడిగిన వారిపై దాడులు, దౌర్జన్యాలు



చేస్తున్నాడని, ఈ పరిస్థితిని నిరసిస్తూ గత వారమే స్థానిక ఐనవోలు మండల తహసిల్దారు, ఆర్డిఓకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. దీంతో బుధవారం పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహాధర్నా కార్యక్రమం హనుమకొండ ఆర్డిఓ ఆఫీస్ ముందు చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ ఆందోళనలోపేదలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల తీరును ఈ సందర్భంగా జరిగిన ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు తీవ్రంగా దుయ్యబట్టారు. కబ్జా దారుల కొమ్ముకాస్తున్నారని ఒక సందర్భంలో ఆరోపణలు సైతం చేయాల్సి వచ్చింది. 100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందున ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కబ్జాదారుడైన కట్ట మనోజ్ రెడ్డి పైన తక్షణమే ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శాంతియుతంగా జరుగుతున్న ధర్నా కార్యక్రమానికి వచ్చి సమాధానం చెప్పాల్సిన అధికారులు ఈ సందర్భంగా పోలీసులను పిలిపించడంతో ఆందోళనకారులు మరింత తీవ్రంగా కబ్జా దారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.దీంతో ఆర్డీవో మాట్లాడుతూ కచ్చితంగా కబ్జాదారుడు పైన చర్యలు తీసుకుంటామని, అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని నాయకులు -ప్రజల తో జరిగిన చర్చల సందర్భంగా హామీ ఇచ్చారు.ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేదంటే ప్రజలే అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడటానికి ముందుకు వస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి ముద్దెల ఎల్లేష్ కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి, జిల్లా సమితి సభ్యులు మాలోతు శంకర్ నాయక్, నాయకులు మాదాసు యాకూబ్, అల్వాల రాజు, పాము రమ, గుమ్మడి రాజుల సుధాకర్, కొట్టే వెంకటేష్, జూకంటి పద్మ, ఆరోరి భాగ్య, ఆలకుంట యాకయ్య, కుటుంబ రామారావు, మాదాసు మాణిక్యం, యాకమ్మ, వెంకటమ్మ తదితరులతో పాటు వందలాదిమంది పేదలు పాల్గొన్నారు.

ప్రతి తల్లి పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించాలి



నాంపల్లి, నవంబర్ 25:(విజన్ ఆంధ్ర):పిల్లలను మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా ప్రతి తల్లి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి సూచించారు. ఐసిడిఎస్ చింతపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాంపల్లి మండల కేంద్రంలో మహిళా సమైక్య భవనంలో గ్రామ సమైక్య లీడర్లకు నిర్వహించిన సమావేశంలో సూపర్వైజర్లు విజయలక్ష్మి, వసంతలు 'నషాముక్తి భారత్ పరివర్తన్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి బిడ్డకు తల్లే మొదటి రక్షకురాలని పేర్కొన్నారు. పిల్లలు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకుండా తల్లులు చిన్నప్పటి నుంచే వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి తల్లి రోజుకు కనీసం 20 నిమిషాల సమయాన్ని పిల్లల కోసం కేటాయించి, వారితో ప్రేమగా మాట్లాడాలని, వారి ప్రవర్తనను గమనిస్తూ సమస్యలను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. పిల్లలను ఇతరులతో పోల్చి చూడకుండా వారి అభిరుచులు, భావాలను గౌరవించాలని సూచించారు. పిల్లల స్నేహితుల పరిచయాలు, వారి దైనందిన కార్యకలాపాలను పర్యవేక్షించడంతో పాటు ఇంట్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. ముఖ్యంగా డిజిటల్ పరికరాల వినియోగంపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, ఇవన్నీ కఠినంగా కాకుండా ప్రేమపూర్వకంగా చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, సీసీలు, మండల సమైక్య అధ్యక్షురాలు వీరమల్ల శైలజ, కోశాధికారి పోలోజు అరుణ, కార్యదర్శి వంగాల వరలక్ష్మి, సంఘ సభ్యులు, వివోఏలు పాల్గొన్నారు.

సర్ సిల్క్ భూముల నిర్వాసితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది నిర్వాసితులు అధైర్యపడవద్దు.. న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తాం: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



కాగజ్‌నగర్, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ సర్ సిల్క్ భూములకు సంబంధించి నోటీసులు అందుకున్న నిర్వాసిత కుటుంబాలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ధైర్యంగా ఉండాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భరోసా ఇచ్చారు. నిర్వాసితుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సర్ సిల్క్ భూముల నోటీసులతో ఆందోళన చెందుతున్న కుటుంబాలకు అండగా నిలుస్తామని కోనేరు కోనప్ప తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఆయా భూములపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు నోటీసులు అందుకోవడంతో ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో వారికి ధైర్యం చెప్పారు. నిర్వాసితులెవరూ అధైర్యపడవద్దని, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల హక్కులకు భంగం కలగకుండా, వారికి న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూముల విషయంలో నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తాను, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వారి వెంటే ఉంటామని కోనప్ప స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలు తమ సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిర్వాసితుల హక్కుల కోసం న్యాయపోరాటం కొనసాగిస్తామని, ప్రజలకు న్యాయం జరిగే వరకు వెనుకడుగు వేయబోమని భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సర్ సిల్క్ భూముల నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలపై పోరాటం చేస్తామని కోనేరు కోనప్ప పేర్కొన్నారు. బాధితులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు.

విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగుపడాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) విద్యార్థుల అభ్యసన స్థాయి మరింత మెరుగుపడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం వెంకటాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వారి అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనానికి ముందు అందించే అల్పాహారం, పాలు పంపిణీ తదితర అంశాలను ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.మొదటి, రెండో, మూడో తరగతుల విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారు రాసిన నోట్‌బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులు రాసిన పదాల అర్థాలు తెలుసా అని వారి అభ్యసన స్థాయిని పరీక్షించారు. విద్యార్థులు పలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతో వెరీ గుడ్ అంటూ విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా నాలుగు, ఐదు తరగతులను సందర్శించి విద్యార్థులతో పాఠ్యాంశాన్ని చదివించారు. ఫిజికల్ సైన్స్ సంబంధించి విద్యార్థులు బోర్డుపై రాసిన విధానం, చెప్పిన సమాధానాలు సరిగ్గా ఉండటంతో అదే కాన్ఫిడెన్స్ తో ముందుకు సాగాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. లైబ్రరీ రూమ్ ఉందా అని ఆరా తీశారు. ఎనిమిదో తరగతి సందర్శించి ఖాన్ అకాడమీ పాఠ్యాంశాలను వింటున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎలా లాగిన్ అవుతున్నారని ఆరా తీశారు. పాఠశాలకు సంబంధించిన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయులు మరింతగా పెంపొందించాలన్నారు. సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలకు సంబంధించి మిగిలి ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలను అందించాలని పంచాయతీరాజ్ ఏఈ ని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజు, స్థానిక తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంఈఓ జుమ్మా నాయక్, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తహసిల్దార్ భవనశీ, అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

దాదాపు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.



భూపాలపల్లి జిల్లా 25 నవంబర్ (విజన్ ఆంధ్ర)బుధవారం మహాదేవపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాన్ని, అగ్నిమాపక కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. పాత సమితి హెడ్‌క్వార్టర్స్‌గా ఉన్న మహాదేవపూర్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఈ ప్రాంత రైతులు, ప్రజల నుంచి చాలాకాలంగా ఉందని గుర్తు చేశారు. ప్రజల అవసరాన్ని, ప్రాంత ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం, 2025 ఫిబ్రవరి 3న ముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ పరిధిలో వివిధ కేటగిరీలకు చెందిన 18 పోస్టులకు ప్రభుత్వ ఆమోదం లభించిందని తెలిపారు. ప్రస్తుతం మహాదేవపూర్ మండల కేంద్రంలో డైరెక్టర్ జనరల్ ఫైర్ సర్వీసెస్, జిల్లా ఫైర్ అధికారి, స్థానిక ఫైర్ అధికారుల పర్యవేక్షణలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు ఫైర్ స్టేషన్ అత్యంత అవసరమని పేర్కొన్నారు. మహాదేవపూర్‌తో పాటు పలిమెల, మహాముత్తారం, కాటారం, మల్హర్ మండలాల ప్రజలకు సైతం సత్వర అగ్నిమాపక సేవలు అందించాలనే ఉద్దేశంతో మహాదేవపూర్‌ను ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ఎంపిక చేసినట్లు వివరించారు. ప్రజల ఆకాంక్ష మేరకు క్యాబినెట్ ఆమోదంతో తొలుత అవసరమైన సిబ్బందిని కేటాయించి ఏర్పాట్లను ముందుకు తీసుకెళ్లనున్నామని, త్వరలోనే అన్ని హంగులు, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో పూర్తిస్థాయి ఫైర్ స్టేషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.మహాదేవపూర్ మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడం ద్వారా ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రికి, సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు, డీజీ ఫైర్ సర్వీసెస్‌కు, అధికారులకు, సిబ్బందికి మరియు మహాదేవపూర్ ప్రాంత ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంతకుమారి, జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు, శ్రీనివాస్, సర్పంచ్ హసీనా బాను, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, రాష్ట్ర ఉపాధి హామీ పథకం సభ్యులు దండు రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతగాని తిరుమల, పిఏసిఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీఆర్ ఈఈ విద్యాసాగర్, డిఈ సాయిలు, తహసిల్దార్ సత్యనారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు

స్థానికంగా ఉండకుండా రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులపై చర్యలు ఏవి..?

- స్థానికంగా నివాసం ఉంటూ విధులు నిర్వహించాలి!



కామారెడ్డి బ్యూరో నవంబర్ 25 (విజన్ ఆంధ్ర)కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల, గ్రామాలలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధులు నిర్వహించే ప్రాంతంలోనే స్థానికంగా నివాసం ఉండేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతానికి వర్తించే అలవెన్సులు పొందుతూ, స్థానికంగా నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారువిద్య, వైద్య--ఆరోగ్య, రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్, సంక్షేమం తదితర శాఖలు ఇతర శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఉద్యోగులు స్థానికంగా ఉంటే విద్యార్థులు, రోగులు, రైతులు, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సకాలంలో అందే అవకాశం ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏజెన్సీ అలవెన్సులు అందిస్తున్నప్పటికీ, ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండకుండా ప్రతిరోజూ ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.కొన్ని శాఖల్లో మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు సైతం నెల నెల వాహనాల అలవెన్సులు, సొంత వాహనాల్లోనే ప్రైవేట్ డ్రైవర్లను కొనసాగిస్తూ బిల్లులు చెల్లిస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత శాఖల ఉద్యోగుల హాజరు, స్థానిక నివాసం, విధుల నిర్వహణ, ఏజెన్సీ అలవెన్సుల వినియోగంపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంకు

అర్హులైన కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర రావు



అయిజ నవంబర్ 25 (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అయిజ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర రావు అన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆ కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు.ఈ పథకం అమలులో భాగంగా అయిజ మున్సిపాలిటీ పరిధిలో తదుపరి క్యాంపులు నవంబర్ 26న నిర్వహించబడును అని తెలియజేశారు. అయిజ మున్సిపాలిటీలోని క్రింది తెలిపిన 14 వార్డులలో క్యాంపులు నిర్వహించబడతాయి.వార్డుల వారీగా క్యాంపు నిర్వహించే ప్రదేశాలు..3వ వార్డు -- మారెమ్మ గుడి దగ్గర.4వ వార్డు -- బస్తీ దవాఖాన దగ్గర.15వ వార్డు -- ప్రైమరీ స్కూల్, ఎస్సీ కాలనీ.16వ వార్డు -- న్యూ బిల్డింగ్ వాటర్ ట్యాంక్ దగ్గర.14వ వార్డు -- మౌలాలి మసీదు దగ్గర.18వ వార్డు -- నీలకంఠేశ్వర స్వామి గుడి దగ్గర.20వ వార్డు -- జివిఆర్ఎం.హై స్కూల్ దగ్గర.5వ వార్డు -- యుపిఎస్.స్కూల్ దగ్గర, పర్దిపురం 6వ వార్డు -- దర్గా దగ్గర.తుపత్రాల 7వ వార్డు -- టాగూర్ స్కూల్ నందు.8వ వార్డు -- భారత్ నగర్ ప్రైమరీ స్కూల్ దగ్గర.9వ వార్డు -- జెడ్ పి హెచ్ ఎస్. బాయ్స్ హై స్కూల్ దగ్గర.10వ వార్డు -- అంగన్‌వాడీ స్కూల్ దగ్గర.దుర్గానగర్17వ వార్డు -- లాల్ బాష ఇంటి దగ్గర నిర్వహించబడునని ఇట్టి అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు.రిజిస్ట్రేషన్‌కు కావలసిన పత్రాలు..రేషన్ కార్డు,కుటుంబ పెద్ద ఆధార్ కార్డు,మొబైల్ ఫోన్ నంబర్.కావున అర్హులైన కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరడమైనదని తెలియజేశారు.

బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి బేటీ బచావో..

బేటీ పడావో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్ హరిత



ఆసిఫాబాద్, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): బాలికల విద్య, ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, రక్షణ, సంక్షేమానికి సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఆడపిల్లలు దేశానికి గర్వకారణమని, బాలికలను రక్షించుకోవడం, వారికి నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. బడి మానేసిన బాలికలను గుర్తించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని అధికారులకు సూచించారు. బాలికలకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి కోర్సుల ద్వారా బాలికలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థినులకు అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం-2013 ప్రకారం ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాలికలు, మహిళల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలని, బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాల సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాలికలు, చిన్నారుల రక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అందుబాటులో ఉందని, అవసరమైన సమయంలో ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం బాలికల రక్షణకు సంబంధించిన చట్టాల గోడపత్రాలను అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ డీఎస్పీలు

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (విజన్ ఆంధ్ర)2025 గ్రూప్-1 నియామక ప్రక్రియలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లుగా ఎంపికైన ఐదుగురు అధికారులు శిక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల విధుల్లో చేరగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ట్రైనీ డీఎస్పీలు శాంతన్ కుమార్ రెడ్డి, సాయి ప్రత్యూష్ రెడ్డి, సబిత, ఆంజనేయులు, యశస్విని ఉన్నారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గడ్డం ఇందుప్రియను కలిసిన మున్నూరు కాపు జిల్లా నాయకులు



కామారెడ్డి బ్యూరోనవంబర్ 25(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా కామారెడ్డి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు మామిళ్ల అంజయ్య , గడ్డం ఇందుప్రియ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గడ్డం ఇందుప్రియ కి శాలువా కప్పి ఘనంగా సన్మానించి, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, రాష్ట్ర మున్నూరు కాపు కార్యదర్శి మామిళ్ల లింగం, కామారెడ్డి మండల మున్నూరు కాపు క్యాషియర్ మాజీ సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

గోలేటి ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి: డీడీ అంబాజీ



రెబ్బెన.గోలేటి, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటి ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. చదువులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో భోజన నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ ఆదేశించారు. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా బోధన కొనసాగిస్తూ, పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని తెలిపారు. ఏ విద్యార్థి కూడా చదువులో వెనుకబడకుండా నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట ప్రత్యేక తరగతులు నిర్వహించి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, పరిశుభ్రత, నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై డిప్యూటీ డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధంగా పాఠశాల నిర్వహణ కొనసాగిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోత్ దేవయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి క్లబ్ బిబిపేటలో ఉచిత వైద్య శిబిరం



కామారెడ్డి బ్యూరో నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) కామారెడ్డి జిల్లా బిగి పేట మండల కేంద్రంలోవాసవి క్లబ్ బిబిపేట భవనంలో యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరము నిర్వహించారు,శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పాల్మనాలజీ, కార్డియాలజీ సంబంధించిన స్పెషలిస్టులు వచ్చి 135 మందికి ఈ సి జి, బి పి డి రక్త పరీక్షలు నిర్వహించారు, తదుపరి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు, కార్యక్రమంలో డాక్టర్ వంశీ నందన్ రావు, డాక్టర్ అఖిల్, డాక్టర్ సాయి రెడ్డి యశోద హాస్పిటల్స్ కామారెడ్డి ఇంచార్జ్ చందుపట్ల శ్రీనివాస్ వాసవి క్లబ్ బీబీపేట్ అధ్యక్షులు మురికి శ్రీనివాస్ కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, కోశాధికారి జోర్రిగల శ్రీనివాస్, అంతర్జాతీయ వైస్ గవర్నర్ బాశెట్టి నాగేశ్వర్, తాటిపల్లి రమేష్, జోన్ చైర్మన్ నాగభూషణం, హరిప్రసాద్, పెద్ది నాగేశ్వర్, విశ్వ మోహన్ తదితరులు పాల్గొన్నారు

జింక చర్మాన్ని ఉపయోగిస్తూ పూజల పేరుతో అమాయక భక్తులను మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- నిందితుడి ఇంట్లో జింక చర్మం స్వాధీనం

- అటవీ జంతువుల చర్మాలను అక్రమంగా కలిగి ఉండటం

చట్టరీత్యా నేరం.లిఆదిలాబాద్ టు టౌన్ ఎస్సై ప్రణయ్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 25 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీ, సంజయ్ నగర్‌కు చెందిన జూకంటి గంగాధర్ (45) అనే వ్యక్తి ఇంట్లో ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా జింక చర్మం లభించింది. విచారణలో నిందితుడు గత 20 సంవత్సరాలుగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అనుకుంట గ్రామ శివ మార్కండేయ మందిరంలో పూజారిగా పనిచేస్తున్నట్లు తెలిపాడు. 2020లో కర్ణాటక అటవీ ప్రాంతంలో ఒక వ్యక్తి వద్ద జింక చర్మాన్ని కొనుగోలు చేసి ఇంటికి తీసుకొచ్చినట్లు వెల్లడించాడు. జింక చర్మంపై కూర్చొని పూజలు చేస్తే దుర్గామాత అనుగ్రహం కలుగుతుందని, భక్తుల సమస్యలను పరిష్కరిస్తానని నమ్మిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు గోధుమ రంగులో ఉన్న జింక చర్మాన్ని స్వాధీనం చేసుకొని. నిందితుడిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారుడి

కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 25 (విజన్ ఆంధ్ర)ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. పట్టణంలోని నీలా నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన పసుపుల రాజు నూతన గృహాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించి, లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన గృహాన్ని పరిశీలించి, ఇంటి నిర్మాణ నాణ్యత, కల్పించిన వసతులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కటి గృహాన్ని నిర్మించుకున్న లబ్ధిదారుడిని అభినందించారు. జిల్లాలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు పసుపుల రాజు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారమైందని ఆనందం వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, హౌసింగ్ ఈఈ నాసిర్, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలికల విద్యపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 25,:(విజన్ ఆంధ్ర) : బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. బాలికలను ఎదగనివ్వాలని, చదివించాలని, ఆడపిల్లలు దేశానికి గర్వకారణమని, వారిని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. బడిమానేసిన ఆడపిల్లలపై దృష్టి సారించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి బడికి తీసుకురావాలని, బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడపిల్లలకు నైపుణ్య శిక్షణలో భాగంగా బ్యూటీషన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులు నిర్వహించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాలలోని బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ లో పనిచేసే మహిళా ఉద్యోగుల రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 ప్రకారం ప్రతి కార్యాలయంలో కమిటీ ఏర్పాటు చేయాలని, బాలికలు, మహిళల హక్కుల పట్ల చైతన్యం తీసుకురావాలని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాలల కోసం హెల్ప్ లైన్ 1098 ను ఏర్పాటు చేయడం జరిగిందని, సమాచారం తెలిపిన వ్యక్తుల సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు. అనంతరం బాలికల రక్షణ చట్టాల గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూప, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మహేష్, మహిళా సాధికారత సేవ కేంద్రం సమన్వయకర్త శారద, సిబ్బంది, రాణి, మమత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక యాంత్రీకృత ధోబీఘాట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- రజకుల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 25(విజన్ ఆంధ్ర)ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన యాంత్రీకృత ధోబీఘాట్ సేవలను రజకులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ ధోబీ కాలనీలో అంజని పుత్ర కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక యాంత్రీకృత ధోబీఘాట్‌ను కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, బహుజన వీరవనిత చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంప్రదాయ కులవృత్తుల అభివృద్ధి, రజకుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆధునిక యంత్రాలను వినియోగించుకోవడం ద్వారా సంప్రదాయ వృత్తిని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. యాంత్రీకృత ధోబీఘాట్ వల్ల శారీరక శ్రమ తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని, తక్కువ సమయంలో ఎక్కువ పనిని పూర్తి చేసి మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. సొసైటీ సభ్యులందరూ సమన్వయంతో, ఐకమత్యంగా ఉంటూ ధోబీఘాట్‌ను సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఆధునిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి. సోనియా, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, స్థానిక వార్డు కౌన్సిలర్ యోగేష్ షాలిని, కౌన్‌అంజని పుత్ర కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మైలారం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు, రజక సంఘం నాయకులు, దత్తు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ద్వారా ప్రతి అర్హత కుటుంబానికి ఆర్థిక భరోసా

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార,

గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 25 విజన్ ఆంధ్ర : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి అర్హత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామపంచాయతీలో జీవిత భీమా నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి జీవిత భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. రేషన్ కార్డు ఆధారంగా కుటుంబంలోని 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన సభ్యులకు 5 లక్షల రూపాయల జీవిత భీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు నామినీల వివరాలు, వారికి కేటాయించవలసిన వాటాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నమోదు సమయంలో వివరాలను పరిశీలించి, కుటుంబ సభ్యుల ఆమోదం పొందిన అనంతరం ఆన్‌లైన్‌లో సమర్పిస్తారని, వెంటనే మొబైల్‌కు సందేశంతో పాటు లింక్ వస్తుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సేవలు, కొత్తగా ఆసరా పెన్షన్ల మంజూరు వంటి పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఉచిత బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించామని, విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గంగిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. గ్రామానికి 118 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటికే 85 ఇండ్లు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయని, మిగిలిన ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పాఠశాల అభివృద్ధికి 50 లక్షల రూపాయలు, గత సంవత్సరం 15 లక్షల రూపాయలు, ప్రస్తుత సంవత్సరం మరో 15 లక్షల రూపాయలు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గంగిపల్లి నుంచి ఎల్కంటి వరకు 1 కోటి 57 లక్షల రూపాయలతో చేపట్టిన పంచాయతీరాజ్ రహదారి ప్రారంభించడం జరిగిందని, గంగిపల్లి నుంచి గోదావరి సమీపంలోని శ్మశాన వాటిక వరకు రహదారి నిర్మాణానికి 2 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు. జైపూర్ పవర్ ప్లాంట్‌లో గ్రామానికి చెందిన ఐదుగురికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో 1 వేయి 250 మెగావాట్ల నూతన విద్యుత్ ప్లాంట్ ప్రారంభమైనప్పుడు భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ గంగిపల్లి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగు విధానాలపై రైతులకు స్పష్టత ఇవ్వాలి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) నవంబర్ 25 : తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకుల డిమాండ్ యాసంగి సాగుపై రాష్ట్ర ప్రభుత్వంఅవలంబిస్తున్న విధానాలను వెల్లడించి రైతులకు స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు రామలింగా రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. యాసంగి, రబీ సాగుపై జిల్లా రైతులు అనేక సందేహాలతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతుల సందేహాలను నివృత్తి చేసి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కరువు ప్రభావిత మండలాల రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎంతమేర ఉందో వెల్లడించాలని కోరారు. రైతులకు రోజుకు ఎన్ని గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. రాబోయే యాసంగి సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్నితెలియజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సాగుపై భరోసా కల్పించాలని కోరారు. యాసంగి రైతు భరోసా ఎప్పుడూ ఇస్తారు అనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ భీమా పథకంపై స్పష్టత లేదని పేర్కొంటూ, ప్రస్తుతం అమలులో ఉన్న రైతు బీమా పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతు బీమా గడువు ముగిసిన తర్వాత చని పోయిన రైతు కుటుంబాలకు వెంటనే భీమా పరిహారం తో సమానంగా పరిహారం అందియ్యాలన్నారు. ఈ సమావేశంలో ఇలేని మల్లికార్జున రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, ఏవీ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- ఇందిరమ్మ బీమా పథకం నమోదు

శిబిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.



గద్వాల నవంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని 16వ వార్డు పరిధిలో భీమ్ నగర్ ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ బీమా పథకం నమోదు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ మేలు జరిగేలా అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో బీమా కూడా ముఖ్యమైనదని తెలిపారు. ఇంటి యజమాని ఆకస్మికంగా మృతి చెందితే ఆయా కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు అందజేసి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తులను నమోదు చేసేందుకు సర్వర్ సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఈడీఎం శివను ఆదేశించారు. పథకం నమోదుకు ప్రజలు తమ ఆధార్, రేషన్ కార్డును సమీప శిబిరం వద్దకు తీసుకురావాలని సూచించారు. సంబంధిత అధికారులు వివరాలను నమోదు చేయడం జరుగుతుందని, ప్రజలు ఎలాంటి డాక్యుమెంట్స్ వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఫోన్లకు వివరాలు నమోదు చేశాక మెసేజ్ వస్తుందని తెలిపారు. నామినీలుగా ఒకరి కంటే ఎక్కువ మందిని కూడా సూచించేందుకు అవకాశం ఉందన్నారు. శిబిరాల వద్ద ప్రజలు ఎక్కువ సేపు నిరీక్షించే పరిస్థితి ఉండరాదని, ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి పంపాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వేదవతి, వార్డు అధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ లో ఉన్న 30 పడుకల హాస్పిటల్ ను తక్షణం పూర్తి చేయాలి

పట్టణ బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి నిరసన దీక్షలో పాల్గొన్న

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి



అయిజ నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు అయిజ బీజేపీ పట్టణ అధ్యక్షుడు ముదిరాజ్ నర్సింహ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు బుధవారం పెండింగ్ లో ఉన్న 30 పడుకల హాస్పిటల్ తక్షణం పూర్తి చేసి, ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలని నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ఎస్ రామచంద్రారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగత నాలుగున్నర సంవత్సరాలు పైగా అయిజ పట్టణంలో 30 పడకల ఆసుపత్రి పూర్తి చేయాలని పలు రకాలుగా ఉద్యమాలు చేసిన, ధర్నాలు చేసిన ప్రభుత్వ అధికారులైనటువంటి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి విన్నవించిన ఎలాంటి పురోగతి లేదని తెలిపారు. ఈ 30 పడకల ఆసుపత్రి పూర్తి అయితే అయిజ పట్టణం, మండల జనాభా లక్ష కు పైగా జనాభా ఉందని, దీనితోపాటు ఇతర మండలాల వాళ్లు కూడా ఈ హాస్పిటల్ కి వచ్చి వాళ్ళ యొక్క సమస్యలు తీర్చుకుంటారని అన్నారు. గతంలో పాలకులు మారిన ప్రభుత్వాలు మారిన ఈ హాస్పిటల్ ని పట్టించుకునే నాధుడు లేడు. ఎందుకంటే దాదాపు ఎంతోమంది ప్రజలు ఈ యొక్క అయిజ నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లి పేద ప్రజలు వైద్యం చేసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. కానీ ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోకుండా ఈ యొక్క పేద ప్రజల యొక్క బాధలు పట్టించుకునే పరిస్థితి లేదు. అదే విధంగా ఈ ఆస్పటల్ పూర్తి కానందుకు ఆసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేన ఎలాంటి చలనం లేదని అన్నారు. దీనితో పాటు ఈ ప్రైమరీ హెల్త్ సెంటర్ దాదాపు ప్రతినెల వందలాది కాన్పులు జరుగుతున్నాయి, కానీ నిండు గర్భిణీలకు ఎలాంటి సౌకర్యాలు లేవు, కనీసం టాయిలెట్స్ లేవు, అదే విధంగా రోడ్డుపైనే ఆ యొక్క కాంపౌండ్ లోనే నీళ్లు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల ద్వారా బయట నుంచి వచ్చినటువంటి రోగులకు అదనంగా రోగాలు యాడ్ అవుతున్నారు. అదేవిధంగా పెద్ద గుంతలు పడినా పట్టించుకోవడం లేదు, పొరపాటున ఆ ప్రాంతానికి ఎవరైనా కంపౌండ్ లో అటువైపు వెళ్తే ఆ గుంతల పడి ప్రాణాలు పోయిన ఆశ్చర్యం లేదని అన్నారు. ఆ గుంతలలో కాలం చెల్లినేటివో, మంచివో కానీ మాత్రలు మొత్తం అందులో పడేసినారు. ఒకసారి పరీక్షించండి, అదేవిధంగా హాస్పటల్ లో పెచ్చులు ఊడుతున్న, అదే విధంగా ఎలక్ట్రిసిటీ సంబంధించి కనీసం బోర్డ్ కూడా లేవు. ఎప్పుడు ఏ ప్రమాదం జరిగిన ఆశ్చర్యం లేదని తెలిపారు. అదే విధంగా డాక్టర్స్ ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియదు, అసలు సరిగ్గా అందుబాటులో ఉండరు. అరకొర డాక్టర్లు ఉండటం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి పిఎచ్సీ. లో ఉన్నటువంటి డాక్టర్స్ రెగ్యులర్ గా రావాలని కోరారు. రోజు వందలాది పేషెంట్లు వస్తున్నారు. అదేవిధంగా ముఖ్యమైన డిమాండ్ ఏమంటే 30 పడగల ఆసుపత్రి తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బిజెపి పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ గౌడ్,తూముకుంట అంజి,రాజశేఖర్,రజక నర్సిములు,ప్రతిప్ శెట్టి,లవకుశ,గడిగె రఘు శ్రీకాంత్,అశ్విన్,వర్మ,వీరేష్,సురేష్,కిషోర్,తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుని కుటుంబానికి రూ. లక్ష ప్రమాద బీమా పరిహారం



హనుమకొండ, జిల్లా ప్రతినిధి నవంబర్ 25:(విజన్ ఆంధ్ర) : హనుమకొండలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుడు మోతపోతుల రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి బ్యాంక్ తరఫున ఉన్న ప్రమాద బీమా పథకం కింద మంజూరైన లిరూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు)లి పరిహారాన్ని బుధవారం అందజేశారు. బాధితుని నామినీ, భార్య మోతపోతుల రజిత కి జిల్లా సహకార అధికారి, హనుమకొండ - బడావత్ మోహన్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా బడావత్ మోహన్ మాట్లాడుతూ, ఖాతాదారులకు బ్యాంక్ అందిస్తున్న ఇలాంటి బీమా పథకాలు ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తాయని అన్నారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయత్రి బ్యాంక్ అందిస్తున్న సేవలను, సామాజిక బాధ్యతను అభినందించారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మ్యాదరి సందీప్ కుమార్ , బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్25:(విజన్ ఆంధ్ర) : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి (DEO) శ్రీ సచ్చిదానంద చారి కి తెలంగాణ ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఇన్‌స్ట్రక్టర్లు మరియు ఆయా యూనియన్ (AITUC) ఆధ్వర్యంలో బుధవారం రోజున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ... "కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ప్రీ ప్రైమరీ స్కూళ్లలో గత రెండు సంవత్సరాలుగా ఇన్‌స్ట్రక్టర్లు మరియు ఆయాలు ఎంతో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారు. చిన్న పిల్లల సంరక్షణ, పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల భద్రత వంటి బాధ్యతలను వారు నిర్వర్తిస్తున్నారు. అయినా వారికి ఇన్స్ట్రక్టర్లకు మరియు ఆయాలకు 5 నెలలుగా వేతనాలు చెల్లించలేదు. దీనివలన వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి. అలాగే ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనం ఇవ్వాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి, ఇన్‌స్ట్రక్టర్లకు మరియు ఆయాలకు ఐడి కార్డ్స్ ఇవ్వాలి, వీరందరికీ 12 నెలల జీతం ఇవ్వాలి, ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. DEO గారు సానుకూలంగా స్పందించారు. త్వరగా పరిష్కారం చేయకపోతే AITUC ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాము." అని అన్నారు. ఈ కార్యక్రమంలో AITUC జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎ. చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అయ్యప్ప స్వామి దీక్ష భక్తిశ్రద్ధలతో ఆచరించాలి.

అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డాక్టరేట్ కాకర్ల భీమయ్య



నారాయణపేట, నవంబర్ 25(విజన్ ఆంధ్ర) : హరిహర పుత్రుడు శ్రీ అయ్యప్ప స్వామి మాలధారణ చేపట్టిన భక్తులు దీక్షా నియమ నిష్ఠలను తూచా తప్పకుండా భక్తిశ్రద్ధలతో ఆచరించాలని అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డాక్టరేట్ కాకర్ల భీమయ్య అన్నారు. బుధవారం మోత్కపల్లి బల భీమసేన ఆలయంలో ఆలయ పూజారులు భీమాచార్య శ్రీనివాస్ చేతుల మీదుగా అయ్యప్ప దీక్ష మాలధారణ చేపట్టారు. ఈ సందర్భంగా 30వ పాదం గురుస్వామి డాక్టరేట్ కాకర్ల భీమయ్య మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు నిత్యం స్వామివారిని స్మరిస్తూ భక్తి, శ్రద్ధలతో పూజలు నిర్వహించాలన్నారు. దీక్షా కాలంలో నియమ నిష్ఠలు, ఆచార వ్యవహారాలను పాటిస్తూ సాత్విక జీవనం సాగించాలని సూచించారు. స్వామి శరణుఘోషతో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని అన్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు నిత్యం స్వామి వారి నామస్మరణ చేస్తూ క్రమశిక్షణతో దీక్ష నియమాలను పాటించాలని ఆయన స్వాములకు సూచించారు.స్వాములు సాత్విక ఆహారం తీసుకుంటూ కోపతాపాలకు దూరంగా ఉంటూ

న్యాయవాదుల సమస్యలపై ఐఏఎల్ డిమాండ్ల పోస్టర్ ఆవిష్కరణ

- ఈ-ఫైలింగ్‌తో పాటు భౌతికంగా కేసుల దాఖలుకు అవకాశం కల్పించాలి

- న్యాయవాదులకు సమగ్ర సంక్షేమ పథకాలు అమలు చేయాలి



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) వరంగల్, హనుమకొండ జిల్లా కౌన్సిల్ల ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన డిమాండ్ల పోస్టర్‌ను బుధవారం వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఐఏఎల్ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. గీతామాకు, హనుమకొండ జిల్లా జడ్జి ఎం.ఆర్. సునీతకు సమర్పించారు.ఈ సందర్భంగా ఐఏఎల్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భీమనాథ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులు, ఆర్థికంగా వెనుకబడిన న్యాయవాదులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ-ఫైలింగ్‌తో పాటు భౌతికంగా కేసుల దాఖలుకు అవకాశం కొనసాగించాలని, న్యాయవాదులకు ఆరోగ్య బీమా, పెన్షన్, జూనియర్ న్యాయవాదులకు నెలవారీ స్టైఫండ్, న్యాయవాదుల రక్షణ, కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.డిజిటలైజేషన్ న్యాయవ్యవస్థను సులభతరం చేయాలే తప్ప న్యాయవాదులకు,కక్షిదారులకు ఇబ్బందులు కలిగించకూడదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఐఏఎల్ నాయకులు ప్రధానంగా పది డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు:మహిళా న్యాయవాదులకు ప్రత్యేక వాష్‌రూములు, వెయిటింగ్ రూములు, భద్రత కల్పించాలని,నూతన చట్టాలు, ఈ-కోర్టులు, డిజిటల్ ఆధారాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని,న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. న్యాయవాదులు న్యాయవ్యవస్థలో కీలక భాగమని, వారి వృత్తిపరమైన గౌరవం, ఆర్థిక భద్రత, సంక్షేమానికి ప్రభుత్వంతో పాటు సంబంధిత న్యాయ అధికారులు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు కోరారు. న్యాయవాదుల సంక్షేమం బలోపేతం అయినప్పుడే న్యాయవ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. ఉపేందర్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. రామకృష్ణ కూడా పాల్గొన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన న్యాయవాదులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, బి. ప్రభాకర్, కె. చిరంజీవి ఎం. సదాశివుడు, అడ్వకేట్ జయశంకర్ దిలీప్, రఫీ, సలావుద్దీన్, కేతరాజు సతీష్, ఎం. సంతోష్, ఎన్. చంద్ర మౌళి, శ్రవణ్ కుమార్, ఎన్. కార్తీక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం..దాడులకు దిగితే సహించేది లేదు

- బీఆర్ఎస్ నేతలు రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వ కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సరికాదు

- డీసీసీ ఇనగాల ..



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 25(విజన్ ఆంధ్ర) : అభివృద్ధిపై చర్చకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వ కార్యాలయాలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (డీసీసీ భవన్)లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభివృద్ధి పనులపై చర్చించేందుకు చౌరస్తాకు రావాలని సవాల్ విసిరితే, బీఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలపై చర్చించకుండా ప్రభుత్వ కార్యాలయాలపై దాడులకు ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు.కేటీఆర్ వరంగల్‌కు వచ్చింది ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాదని, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికేనని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ గత పదేళ్ల పాలనలో నగరాన్ని అభివృద్ధి చేయకుండా అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. సెంట్రల్ జైలును కూల్చి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూశారని, సరైన ప్రణాళిక లేకుండా ఆసుపత్రి నిర్మాణం చేపట్టారని విమర్శించారు. నగరంలో విద్యాసంస్థల నిర్మాణాలను కూడా మధ్యలోనే వదిలేశారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు.కనీసం పార్కింగ్ వసతి లేకుండా కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేయాలని మీరు నిర్ణయం తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే పూర్తి వసతులు ఉండేలా నిర్మాణం చేపట్టామని,ఆనాడు మీ హయాంలో చేసిన తీర్మానంలో కాళోజీ కళాక్షేత్రం ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన నిర్ణయం తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.ఇందులో ఎలాంటి కబ్జాలకు తావులేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై ఒక్క కబ్జా ఆరోపణనైనా ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో వేల ఎకరాల భూములు దోపిడీకి గురయ్యాయని, పేపర్ లీకేజీలకు కూడా అప్పటి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌ను పక్కన పెట్టారని, ఆయన అనవసర వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.వరంగల్ నగర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. తాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.500 కోట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.6,000 కోట్ల నిధులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులపై నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇస్తే స్వాగతిస్తామని, రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా అభివృద్ధిపై చర్చకు రావాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్లో మరింత బలంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, విజయశ్రీ రాజాలి, మామిండ్ల రాజు, తాడిశెట్టి విద్యాసాగర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరూరి సాంబయ్య, మాజీ చైర్మన్ రామకృష్ణ, జిల్లా మీడియా సెల్ ఇన్‌చార్జి మార్క విజయ్ కుమార్, లీగల్ సెల్ చైర్మన్ తోట రాజకుమార్, నాయకులు పులి రాజు, బోడడిన్న, రహిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రతిభ చాటాలి

అనంతపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల మండలం అనంతపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సందర్శించారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థుల మార్కుల వివరాలను అడిగారు. సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కుల గురించి తెలుసుకొని తగు సూచనలు చేశారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా పాఠ్యాంశాలను తరచు పునఃశ్చరణ చేసుకోవడం వలన పరీక్షల్లో ప్రతిభ చాటేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థుల దినచర్యను తెలుసుకొని, తెల్లవారుజామునే నిద్రలేచి చదవడం వలన ఆయా పాఠ్యాంశాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా చదవడం వలన పరీక్షల సమయంలో ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రశాంతంగా రాయవచ్చన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఏకరూప దుస్తులను తప్పనిసరిగా వేసుకొని రావాలన్నారు. ఉపాధ్యాయులతో పాఠశాల స్థాయిలో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ వారికి వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేయాలని ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశించారు. విద్యార్థులు ఫెయిల్ కాకుండా మంచి ఫలితాలు సాధించాలని ఉన్నత చదువులతో జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల గురించి తరచూ తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి చర్చించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం కింద అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఆదేశించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమీపంలోని ప్రాథమిక పాఠశాల సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పలువురు విద్యార్థులతో పాఠాలను చదివించి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రీ ప్రైమరీ తరగతి గదిలో చిన్నారులతో నేర్చుకున్న పాటలు, వివిధ అంశాలను చదివించి ప్రశంసించారు. చిన్నారులను ఆకట్టుకునేలా తరగతి గది గోడలపై వివిధ పెయింటింగ్స్ ఉండాలని, ఆట బొమ్మలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వివిధ సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని గ్రామ సర్పంచును, ఉపాధ్యాయులను కోరారు. సర్పంచ్, ఉపాధ్యాయులు పాఠశాలలో నెలకొన్న వివిధ సమస్యలను కలెక్టర్ సృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గృహ సంబంధ వ్యర్థాల ప్రవాహానికి ఇబ్బందులు ఉన్నాయని గ్రామస్తులు తెలియజేయడంతో పరిశీలించారు, డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తే నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టినందున సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికీ మంజూరు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ పర్యటనలో సర్పంచ్ నిత్య, ఉపసర్పంచ్ సూరి, గద్వాల ఎంపీడీవో శైలజ, తదితరులున్నారు.

చేనేత రంగ అభివృద్ధికి మాస్టర్ వీవర్స్ సహకరించాలి.

- గద్వాలలో రూ.10 కోట్ల నిధులతో చేనేత క్లస్టర్ నిర్మాణం.

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల చేనేత జరీ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయని, చేనేత రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మాస్టర్ వీవర్స్ తమవంతుగా సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మైక్రో స్మాల్ ఎంటర్ప్రైజెస్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో డిఐపిసి (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్స్ సెంటర్), టీజీ ఐపాస్ (తెలంగాణ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మాస్టర్ వీవర్స్ సహకారంతో గద్వాల బ్రాండ్ తో చేనేత చీరలు నేసే కార్మికులకు మరింత ప్రయోజనం చేకూరేందుకు రూ.10 కోట్ల నిధుల అంచనాతో గద్వాలలో చేనేత క్లస్టర్ నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.8 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు, మాస్టర్ వీవర్స్ రూ.50 లక్షలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని నది అగ్రహారం రహదారిలో ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో చేనేత క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా చేనేత కార్మికులకు రంగుల అద్దకం, డిజైనింగ్, వృత్తిలో శిక్షణ, మార్కెటింగ్ చేసుకునేందుకు అవసరమైన వివిధ నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు గాను 1.5 ఎకరాల స్థలాన్ని కేటాయించి ఇవ్వడం జరుగుతుందన్నారు. గద్వాల ఆర్టిసన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో బ్యాంకు ఖాతా తెరచి మాస్టర్ వీవర్స్ భాగస్వామ్యం ఉండేలా రూ.50 లక్షల నిధులను సమకూర్చాల్సిందిగా కోరారు. క్లస్టర్ నిర్మాణంతో చేనేత కళాకారులకు నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ ఇవ్వడమే కాక మాస్టర్ వీవర్స్ కు మార్కెటింగ్ అవకాశాలపై కూడా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దశాబ్దాలుగా ఎంతోమంది చేనేత కార్మికులు కష్టపడి నేసిన చీరలను అమ్ముకోవడంతో ఇక్కడి వ్యాపారులకు మేలు జరిగిందన్నారు. కాబట్టి చేనేత కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సామాజిక బాధ్యతగా మాస్టర్ వీవర్స్ తమ వంతు సహకారాన్ని అందించాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంఎస్ఇ సిడిపి జాయింట్ డైరెక్టర్ సిఎస్ఎస్ రావు, అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, చేనేత రంగ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిపేటలో ఘనంగా ఆర్థిక అక్షరాస్యత - ఆర్థిక సమ్మిళిత అవగాహన శిబిరం

సామాజిక భద్రతా పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా - ప్రజలకు బ్యాంకింగ్ అధికారుల పిలుపు



సిద్ధిపేట, జిల్లా ప్రతినిధి నవంబర్ 25: నవంబర్ (విజన్ ఆంధ్ర) : ప్రతి కుటుంబానికి బ్యాంకింగ్ సేవలు చేరువ చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక సమ్మిళిత పథకాల సంతృప్త స్థాయి అమలు ప్రచార కార్యక్రమం లో భాగంగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -- సిద్ధిపేట లీడ్ బ్యాంక్ లోకల్ బ్రాంచ్. మేనేజర్ఆధ్వర్యంలో మంగళవారం సిద్ధిపేటలోని విపంచి నిలయంలో ప్రత్యేక ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక సమ్మిళిత అవగాహన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్ధిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీ మల్లికార్జున్, జిల్లా ఆడిట్ అధికారి శ్రీమతి జయశ్రీ, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ శ్రీ జి. నిఖిల్ రెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ కె. హనుమంత రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధిపతి శ్రీ బి. శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ బి. హరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ఆర్థిక సమ్మిళిత కార్యక్రమం కేవలం బ్యాంకు ఖాతాలు ప్రారంభించడానికే పరిమితం కాకుండా, ప్రతి పౌరుడికి బ్యాంకింగ్ సేవలు, బీమా రక్షణ, పెన్షన్ సదుపాయాలు, డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పట్టణ పేదలు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రాంతీయ అధిపతి శ్రీ బి. శ్రీనివాస్ మాట్లాడుతూ, 21.10.2026 నుండి 31.12.2026 వరకు నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన వ్యక్తిని సామాజిక భద్రతా పథకాల పరిధిలోకితీసుకురావాలని బ్యాంకు శాఖలకు సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పి ఎం ఎస్ బి వైఅటల్ పెన్షన్ యోజన ఏపీ వైపంటి పథకాలు సామాన్య ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు భద్రత కోసం అర్హత మేరకు ఈ పథకాలలో నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పీఎం జెడివై ఖాతాలు, ఆధార్ సీడింగ్, రీ-కేవైసీ ఆర్ యు వై కేవైసీ నామినీ నమోదు, నిరుపయోగంగా ఉన్న బ్యాంకు ఖాతాల పునరుద్ధరణ, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, సురక్షితమైన ఆన్‌లైన్ లావాదేవీలు, సైబర్ నేరాలు మరియు డిజిటల్ అరెస్ట్ మోసాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ బి. హరిబాబు మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యత అనేది ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవన నైపుణ్యమని, సంపాదనలో కొంత భాగాన్ని పొదుపు చేయడం, అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయడం, అప్పులను బాధ్యతాయుతంగా వినియోగించడం, బీమా మరియు పెన్షన్ ద్వారా కుటుంబ భవిష్యత్తుకు భద్రత కల్పించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతా కలిగి ఉండటమే కాకుండా, దానిని సక్రమంగావినియోగించుకోవడం, మోసపూరిత ఫోన్ కాల్స్, లింకులు, ఓటిపి అభ్యర్థనల పట్ల అప్రమత్తంగా ఉండటం ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధిపేట పరిధిలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బ్యాంకింగ్ స్టాల్లను ఏర్పాటు చేశారు. ఖాతాదారులకు వివిధ బ్యాంకింగ్ సేవలు, సామాజిక భద్రతా పథకాల నమోదు, ఆధార్ అనుసంధానం, రీ-కేవైసీ, నామినీ వివరాల నమోదు తదితర సేవలను అందించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు అక్కడికక్కడే నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా బ్యాంకు ఖాతాదారులు, స్వయం సహాయకసంఘాలమెప్మా రిసోర్స్ పర్సన్లు ఆర్ పి ఎస్ ఆర్గనైజింగ్ బాడీస్ ఓ బి సి, సి ఎఫ్ ఎలకౌన్సిలర్లు, యూనియన్ బ్యాంక్ శాఖల మేనేజర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.ప్రతి కుటుంబానికి బ్యాంకింగ్ సేవలు -- ప్రతి అర్హుడికి బీమా భద్రత -- ప్రతి వృద్ధుడికి పెన్షన్ భరోసా అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమాన్నిప్రజలందరూసద్వినియోగం చేసుకొని, అర్హత కలిగిన సామాజిక భద్రతా పథకాలలో నమోదు చేసుకోవాలని లీడ్ బ్యాంక్ అధికారులు పిలుపునిచ్చారు.

వైద్య విద్యలో విద్యనభ్యస్తామని చేసే కడావరిక్ ప్రమాణం .



భూపాలపల్లి జిల్లా 25 నవంబర్ (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాల మానవ నిర్మాణ శాస్త్రం విభాగంలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులు శరీర నిర్మాణాన్ని మానవ శరీరం (కడవర్) ద్వారా అభ్యసించబోయే విద్య గురించి , మరణించిన తర్వాత కూడా విజ్ఞానంగా ఉపయోగపడే కడావర్లను గౌరవిస్తూ విద్యనభ్యస్తామని చేసే కడావరిక్ ప్రమాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ శ్రీధర్ రావు, ఉప ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రసాద్ రెడ్డి , డాక్టర్ రాజేష్ , పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ పావని, అనాటమీ విభాగం నుంచి డాక్టర్ అజయ్ ప్రకాష్, డాక్టర్ లోయిస్ ఫీబి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు శరీర దానం గురించి, అది విజ్ఞానంగా మారే ప్రక్రియ గురించి ప్రదర్శించిన నాటిక అందర్నీ అలరించింది. తరువాత మానవ నిర్మాణ శాస్త్రం విభాగ డాక్టర్లుకడావర్ ప్రమాణం చేయించి విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ ఆకుల నరేష్ బాబు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) నవంబర్ 25 : సామాజిక సమాజిక సమరసతా వేదిక, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గజ్వేల్ శాఖ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సిద్దిపేట జిల్లా వారి సంయుక్త అధ్వర్యంలో మిర్దొడ్డి మండలం, అందె గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, రెడ్ క్రాస్ సొసైటీ సిద్దిపేట జిల్లా చేర్మెన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డా. ఆకుల నరేశ్ బాబు, ప్రముఖ అర్థోపిడిక్ సర్జన్ డా. బండారి శ్రీధర్, చెవి, ముక్కు, గొంతు సర్జన్ గంగనమోయిన రాజమోహన్, పిల్లల వైద్యులు డా. అలుగువెల్లి సురేశ్ రెడ్డి, కంటి వైద్యులు డా. యిప్ప ప్రవంతి, స్త్రీ వైద్య నిపుణులు డా. పొన్నబోయిన శ్రీలత, వర్ల హైమావతి, డా.విష్ణు కాంత్, డా. అరవింద్ పాల్గొని వైద్య సేవలు అందించారు. సుమారు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఔషదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, మమత, బాలశేఖర్, విజయ భాస్కర్, సంతోష్, శైలజ,చేతన గ్రామీణ వికాస సేవా సమితి సభ్యులు సుమన్, కనకరాజు, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ పర్షరాములు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గిరిజన తండా పంచాయతీలుగా గుర్తించాలి

- రిజర్వేషన్లు పూర్తిగా అమలు చేయాలి

- గిరిజన ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టరాదు

- గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీరుకార్చబడిన పథకాలు పునరుద్ధరించాలి

- బంజారా భారత్ సంస్థాపక జాతీయ అధ్యక్షులు మాజీ ఎంపీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవీంద్ర నాయక్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) : నిధులను సమకూర్చడానికి రెవెన్యూ గిరిజన తండా పంచాయతీలుగా గుర్తించాలని బంజారా భారత్ సంస్థాపక జాతీయ అధ్యక్షులు మాజీ ఎంపీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవీంద్ర నాయక్ అన్నారు. చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో గల అతిథి గృహంలో కరంతోట్ రాఘవన్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశానికి ముఖ్య అతథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బంజారా జాతికి న్యాయం చేస్తుందని అన్నారు. దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ కుమార్ కు శాసనసభాపతి, భట్టి విక్రమార్కకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించిందని అన్నారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే దళిత ముఖ్యమంత్రిని చేస్తానని మాట తప్పారని ఆవేదనను వ్యక్తం చేశారు. బంజారాలు కొన్ని రాష్ట్రాలలో ఎస్టీలుగా, మరికొన్ని రాష్ట్రాలలో షెడ్యూల్ తెగలకు చెందినవారుగా ఉన్నారని అన్నారు. బ్రిటిష్ పరిపాలన కాలంలో బంజారాలను మాకు అనుకూలంగా ఉండాలని ఆనాటి పాలకులు ఆదేశిస్తే మీకు మద్దతుగా ఉండమని ఖరాఖండిగా చెప్పిన ఘనత బంజారాలకు దక్కుతుందని అన్నారు. మా మాట వినడం లేదని బ్రిటిష్ పాలకులు బంజారా జాతిని నేరజాతిగా ముద్రవేశారని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన అనంతరం 1952లో నాటి ప్రధానమంత్రి నెహ్రూ నేరజాతి ముద

శ్రీ నీల కంఠేశ్వర స్వామిని దర్శించుకున్న కవిత

- కుటుంబంతో కలిసి అభిషేకం, ప్రత్యేక పూజలు



నిజామాబాద్ నవంబర్ 25:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ లోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అనంతరం అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భక్తులకు నీలకంఠేశ్వర స్వామి కొంగు బంగారం కార్తీక పౌర్ణమి రోజు స్వామి వారి దర్శనం.. మరుసటి రోజు శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారికి అభిషేకం చేయడం మా కుటుంబ ఆనవాయితీ అని, నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో మరికొన్ని అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని అర్చకులు తెలిపారు. నిజామాబాద్ బిడ్డగా ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాను అని, ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచడాన్ని తమ రెస్పాన్సిబులిటీ గా తీసుకున్న యువతకు ధన్యవాదాలు తెలిపారు.

భూముల రీ సర్వే ద్వారా భూముల సమస్యలు పరిష్కారం అవుతాయి

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా,నవంబర్ 25,(విజన్ ఆంధ్ర); భూముల రీ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర మండలం సావర్గం గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సర్వే సంబంధిత వివరాలను వాకబు చేశారు. గ్రామంలో మొత్తం భూముల విస్తీర్ణం, ఇప్పటివరకు చేపట్టిన సర్వే, ఇంకా పూర్తి చేయాల్సిన సర్వే వివరాలను సమీక్షించారు. సర్వే బృందంలోని సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సర్వే ప్రక్రియను చేపట్టాలన్నారు. చేపట్టబోయే రీ సర్వేకు సంబంధించిన సమాచారం ముందుగానే సంబంధిత రైతులకు అందజేయాలని అన్నారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా రీ సర్వే ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలన్నారు. రీ సర్వే పూర్తవగానే సంబంధిత సమాచారాన్ని మొత్తం రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. రైతులంతా రీ సర్వే ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి అనంతరం జిల్లా కలెక్టర్, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిబిరాల నిర్వహణ తీరును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 59 సంవత్సరాల వయసుగల వారంతా బీమా పథకం కింద నమోదు కావాలని సూచించారు. అధికారులతో మాట్లాడుతూ గ్రామంలోని కుటుంబాల సంఖ్య, ఇప్పటివరకు పూర్తిచేసిన నమోదు, ఇంకా పూర్తి చేయవలసిన ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీమా పథకానికి సంబంధించి వివరాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. బీమా నమోదు చేసిన కుటుంబ సభ్యుల వివరాలు రిజిస్టర్ లో జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ విఠల్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీవో గంగాసింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి ఐదు లక్షల ఇందిరమ్మ జీవిత బీమా.



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ పట్టణంలోని ఐదవ వార్డ్ కౌన్సిలర్ శాల ప్రసాద్ గారి ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి గారి చేతుల మీద అర్హులైన లేదా రేషన్ కార్డు దారులకు ఇందిరమ్మ బీమా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోనె రఘు గారు సిద్దుల గుట్ట చైర్మన్ జిమ్మీ రవి. కాంగ్రెస్ నాయకులు దామోదర్ గారు కౌన్సిలర్ శాల ప్రసాద్ గారు రమేష్ గారు భూపేందర్ గారు గంగోలి గారు ఆకుల రాము గారు గుమ్మల మహేందర్ గారు నూతన నారాయణ రెడ్డి గారు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

జోగిపేటలో ఎస్సీ బాలికల హాస్టల్ లో భోజనం వికటించి విద్యార్థినిలకు తీవ్ర అస్వస్థత

- నలుగురు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థత

- హాస్టల్ లో పురుగుల అన్నం పెడుతున్నారంటూ విద్యార్థినుల ఆవేదన



అందోల్, నవంబర్ 25 (విజన్ ఆంధ్రప్రతినిధి)సంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది.సాక్షాత్తూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇలాకాలోనే విద్యార్థినులకు రక్షణ కరువైంది.సంగారెడ్డి జిల్లా జోగిపేటలో బుధవారం ఎస్సీ బాలికల వసతి గృహంలో పురుగుల అన్నం తిని పలువురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.భోజనం వికటించి విద్యార్థినిలకు తీవ్ర అస్వస్థత కారణంగా వాంతులు, కడుపునొప్పితో విలవిలలాడుతూ ఆసుపత్రి పాలయ్యారు.ఇంత జరుగుతున్నా హాస్టల్ నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని విద్యార్థినులు కన్నీటిపర్యంతమవుతున్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది.హాస్టల్‌లో పెట్టిన పురుగుల అన్నం తిన్న విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.ఉదయం భోజనం చేసిన తర్వాత జోగిపేట జూనియర్ కళాశాలకు వెళ్లిన విద్యార్థినులకు ఒక్కసారిగా కడుపునొప్పి,విపరీతంగా వాంతులు మొదలయ్యాయి. అస్వస్థతకు గురైన బైపీసీ సెకండియర్ విద్యార్థిని శాశ్వత, బీఈసీ విద్యార్థిని స్వప్న, అలాగే సీఈసీ ఫస్టియర్ విద్యార్థినులు నవీన, దీపిక, శైలజ, జ్ఞానేశ్వరి, గాయత్రిలను హుటాహుటిన జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌజన్య ఆధ్వర్యంలో వైద్య బృందం వారికి చికిత్స అందిస్తోంది. విషయం తెలుసుకున్న ఆర్డీఓ శ్రీనివాస్, ఎమ్మార్వో మధుకర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ తిరుపతి,ఎస్సై గిరి శ్రీకాంత్ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.అధికారులను చూడగానే బాధిత విద్యార్థినులు కంటతడి పెట్టారు.గత కొన్ని రోజులుగా హాస్టల్‌లో పురుగుల అన్నమే పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అన్నంలో పురుగులు వస్తున్నాయి, కడుపునొప్పి వస్తోందని వార్డెన్ సబిత, వంటమనిషి అనురాధ దృష్టికి తీసుకెళ్తే... "ఇలానే ఉంటుంది,ఎలా వండితే అలానే సర్దుకుని తినాలి, లేదంటే హాస్టల్ నుండి వెళ్ళిపోవాలి" అంటూ బెదిరిస్తున్నారని విద్యార్థినులు భయపడుతూ అధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని తల్లిదండ్రులు,విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌పై తనిఖీలు నిర్వహించాలని,నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

కన్నుల పండుగగా నిర్వహించిన "సాయి నటరాజ అకాడమీ" వార్షికోత్సవ వేడుకలు

ప్రముఖ కళాకారులకు 'విశిష్ట కళా సేవా పురస్కారాల ప్రధానం



హైదరాబాద్ నవంబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షణా సంస్థ "సాయి నటరాజ అకాడమీ అఫ్ కూచిపూడి డాన్స్" వ్యవస్థాపకూరాలు, డైరెక్టర్, కళాశ్రీ, ప్రఖ్యాత గురువు, డాక్టర్. పి. రమా దేవి నేతృత్వంలో అకాడమీ 37వ వార్షికోత్సవ వేడుకలు ఆనందోత్సాహల మధ్య వైభవోపేతంగా, కన్నుల పండుగగా ఘనంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం రవీంద్ర భారతి ప్రధాన మందిరం, సైఫాబాద్ హైదరాబాద్ లో నిర్వహించిన ఈ వేడుకలలో విద్యార్థులు గురు రమాదేవి నట్టు అంగానికి పక్క వాయిద్యాలకి అనుగుణంగా నేత్రపర్వంగా వివిధ కూచిపూడి నృత్యాంశాలను అద్భుతంగా. ప్రదర్శించి ప్రేక్షకులను అలరించి, ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టర్నరౌండ్ నిపుణుడు, మాజీ ఛైర్మన్, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలీమ్ కో) మేనేజింగ్ డైరెక్టర్ జి. నారాయణ రావు, విశిష్ట అతిథులుగా కూచిపూడి ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల రిటైర్డ్ హెచ్ఓడి, డైరెక్టర్ నృత్యోదయ కూచిపూడి డాన్స్ అక్కడమీ, డాక్టర్. ఆర్ . ప్రసన్న రాణి, టాప్ గ్రేడ్ కార్నాటిక్ ఓకలిస్ట్, ప్రధాన కార్యదర్శి కళాసాగరం సాంస్కృతిక సంస్థ, ఎన్ రామమూర్తి, గౌరవ అతిథులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫైనాన్స్, రిటైర్డ్ ఇండియన్ ఆయిల్ పసుమర్తి ఉదయ భాస్కర్, యక్షగాన కంఠీరవ, సాంప్రదాయ కూచిపూడి గురువు డాక్టర్. పసుమర్తి శేషు బాబు, నృత్య కళాకారుడు కూచిపూడి గురువు భాగవతుల చేతిరామ్ హాజరై విద్యార్థులను అభినందించి మోమెంటోలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకురాలు గురువు డాక్టర్. రమా దేవి రచించిన "హిస్టియానిక్ ఎక్స్ప్రెషన్స్ ఇన్ కూచిపూడి డాన్స్" పుస్తకాన్ని ఆవిష్కరించి కూచిపూడి నృత్యం పై సమగ్ర విశ్లేషణతో గురువు రమా దేవి ఈ పుస్తకాన్ని రచించినందుకు ఆమెను అభినందించి, కొనిఆడారు. కళామతల్లి ముద్దుబిడ్డ అని అభివర్ణించారు. కార్యక్రమంలో భాగంగా ఈ 2026 సంవత్సరానికి గాను "'విశిష్ట కళా సేవా పురస్కారాలను", ప్రముఖ కళాకారులు ఫెస్టివల్ ఆర్గనైజర్ శారద కృష్ణన్, కూచిపూడి డాన్స్ గురువు చింత శివ ఆదినారాయణ, కార్నాటిక్ ఓకల్ కనకం చంద్ర రావు, మృదంగం సుసర్ల శర్మ , స్టేజ్ సెట్టింగ్ సురభి వనరాస కిషోర్ కుమార్ లను సాయి నటరాజ అకాడమీ సంస్థ తరఫున అతిథులు ఘనంగా సత్కరించారు.

సాలూర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- అదనపు తరగతి గదులు మంజూరు

- ప్లే గ్రౌండ్, ప్రహరీ గోడ నిర్మాణాలకు నిధుల కేటాయింపు



విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఆదేశం

నిజామాబాద్, నవంబర్ 25 :(విజన్ ఆంధ్ర) సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులను పరిశీలించారు. ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు ప్రక్రియను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మౌలిక వసతులు, అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా విద్యార్థులకు పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవని హెచ్.ఎం రాజీ మంజుశ్రీ కలెక్టర్ దృష్టికి తేగా, ఐదు అదనపు తరగతి గదులను మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పాఠశాలకు ప్రహరీ గోడ, ప్లే గ్రౌండ్ ను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. అయితే వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింత గణనీయంగా పెరిగేలా అంకిత భావంతో కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, బోధనా విధులకు హాజరు కావాలని అన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ అయిన వారిని షోకాజ్ నోటీసులు అందించడం వంటివి కాకుండా నేరుగా సస్పెన్షన్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యార్థులు సైతం నూటికి నూరు శాతం మంది క్రమం తప్పకుండా బడికి హాజరయ్యేలా చూడాలన్నారు.

ఎక్కువ రోజుల పాటు గైర్హాజర్ అయ్యే విద్యార్థిని విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వారు ఎందుకు బడికి రావడం లేదన్నది క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థికి సంబంధించి తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలన్నారు. ఉన్నత పాఠశాలకు ఆనుకుని ఉన్న ఉర్దూ మీడియం స్కూల్ ను సైతం కలుపుకుని విద్యార్థులకు అనువైన రీతిలో ప్లే గ్రౌండ్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 8వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో భేటీ అయ్యారు. గణితం సబ్జెక్టుపై ప్రశ్నలు వేసి, విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు, చాక్లెట్లు అందించారు. అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఇంచార్జి డీ.ఈ.ఓ సాయాగౌడ్, తహసీల్దార్ ఎం.ఏ.నవాజ్ తదితరులు ఉన్నారు.

పేదవాడి ప్రాణం.. ప్రభుత్వ ఆసుపత్రి బాధ్యత!!

- రెఫరల్ కేంద్రంగా మార్చితే ఊరుకునేది లేదు

- చిన్న జబ్బుకే హైదరాబాద్, కరీంనగర్ పరుగులెందుకు?

- లిరామగుండం ఆసుపత్రిపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఫైర్





పెద్దపల్లి బ్యూరో చీఫ్, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర): పేదవాడి ప్రాణానికి భరోసా మన ఆసుపత్రే కావాలి."చిన్న జబ్బుకూ హైదరాబాద్, కరీంనగర్ పంపితే ఇక్కడ ఆసుపత్రి ఎందుకు?". రామగుండం ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

వివరాల్లోకి వెళ్తే....

అనారోగ్యం వస్తే ప్రైవేట్ ఆసుపత్రుల మెట్లెక్కే స్థోమత లేక, ఆస్తులు అమ్ముకోలేక, ఆశగా ప్రభుత్వ ఆసుపత్రి వైపు చూసే నిరుపేద కుటుంబాలెన్నో. అలాంటి పేదవాడి కన్నీరు తుడవాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి, కేవలం 'రెఫరల్ సెంటర్'గా మారితే చూస్తూ ఊరుకునేది లేదని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వైద్యుల పనితీరుపై నిప్పులు చెరిగారు.

ఆప్యాయపు పలకరింపు.. ఆపై కఠిన ఆదేశాలు!

ఉదయాన్నే ఎవరికీ సమాచారం లేకుండా ఆసుపత్రిలోకి అడుగుపెట్టిన ఎమ్మెల్యే, నేరుగా రోగుల వద్దకు వెళ్లారు. "అమ్మా.. బాగున్నారా? డాక్టర్లు సరిగ్గా చూస్తున్నారా? మందులు బయట రాస్తున్నారా లేక ఇక్కడే ఇస్తున్నారా?" అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డును కలియతిరుగుతూ అక్కడి సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భావోద్వేగ హెచ్చరికలు!

తనిఖీ అనంతరం వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు: "ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది కోటీశ్వరులు కాదు.. రెక్కాడితే కానీ డొక్కాడని పేద, మధ్యతరగతి ప్రజలు. వారికి ప్రాణం పోయాల్సిన బాధ్యత మీ చేతుల్లో ఉంది." "చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు కూడా ఇక్కడ వైద్యం చేయకుండా, నేరుగా కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రులకు రెఫర్ చేయడం ఇకపై కుదరదు. ఆ ప్రయాణ ఖర్చులు భరించలేక, మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్న పేద కుటుంబాల ఉసురు తగులుతుంది." "అవసరమైన అన్ని వసతులు కల్పిస్తాం.. కానీ చికిత్స మాత్రం ఇక్కడే పూర్తిస్థాయిలో జరగాలి.

24 గంటలూ వైద్యులు అప్రమత్తంగా ఉండాలి!

24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండి, అత్యవసర సమయాల్లో క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రాణాలు కాపాడాలి." వైద్య వృత్తిని కేవలం జీతం కోసం చేసే ఉద్యోగంగా కాకుండా, పేదలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశంగా భావించి అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వైద్యులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీతో ఆసుపత్రి వర్గాల్లో ఒక్కసారిగా అలజడి రేగగా, రోగుల్లో మాత్రం కొత్త ఆశ చిగురించింది.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి

- పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్



నిర్మల్ జిల్లా,నవంబర్ 25,(విజన్ ఆంధ్ర); జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు, భూభారతి దరఖాస్తులు, భూముల రీసర్వే, భూసేకరణ, కోర్టు కేసుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందించడంతో పాటు, పెండింగ్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్ పాల్గొని జిల్లాలో రెవెన్యూ శాఖ పరిధిలోని వివిధ అంశాల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా భూభారతి పథకం కింద జిల్లాలో 34 పాత కేసులు, 158 కొత్త కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వివరించారు. ముఖ్యంగా 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్లు దాఖలు చేసి, న్యాయపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేటాయించిన 40 రోవర్లను వినియోగిస్తూ సర్వే పనులు చేపడుతున్నట్లు డీఆర్వో వివరించారు. జిల్లాలోని 14 నాన్ క్యాడస్ట్రల్ గ్రామాలకు గాను 9 గ్రామాల్లో, 17 క్యాడస్ట్రల్ గ్రామాలకు గాను 8 గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించిన వివరాలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. జిల్లాలో భూసేకరణ కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. జీవో 59 కింద పెండింగ్‌లో ఉన్న 93 దరఖాస్తులకు సంబంధించి 91 మంది దరఖాస్తుదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ సూచించారు. తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు, ప్రతి పెండింగ్ దరఖాస్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని రెవెన్యూ అంశాలను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏవో ప్రవీణ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు సంధ్యారాణి, స్వాతి, సర్పరాజ్, ఈడీఎం నదీం తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో దేవాదాయ భూములను పరిశీలించిన కలెక్టర్



ములుగు నవంబర్ 25, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సమ్మక్క సారలమ్మ మేడారం జాతర అభివృద్ధి పనుల కోసం దేవాదాయ శాఖకు కేటాయించిన భూములను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. బుధవారం కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా మేడారంలో పర్యటించారు. దేవాదాయ శాఖకు కేటాయించిన 28 ఎకరాల భూమిని, శాశ్వత ప్రాతిపదికన బస్టాండ్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేడారంలోని ఇంగ్లీష్ మీడియం పాఠశాల వెనుక వైపున ఉన్న 28 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల ప్రస్తుత పరిస్థితి, ఆక్రమణలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు. భవిష్యత్తులో అతిథి గృహం, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు స్థలం అనుకూలతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో కుమారస్వామి, తహసీల్దార్ సురేష్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆయుష్ మిషన్‌లో 7 పోస్టులకు ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

ములుగు నవంబర్ 26, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కింద పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేయనున్న 7 పోస్టులకు జనరల్ ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 23న నోటిఫికేషన్ జారీ చేసి, అక్టోబర్ 26 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరించారు. 4 ఆయుష్ వైద్యాధికారి పోస్టులకు 114 మంది, 1 ఫార్మసిస్ట్ పోస్టుకు 22 మంది, 1 యోగా ప్రొఫెషనల్ పోస్టుకు 6 మంది, 1 సైకోసోషియల్ కౌన్సిలర్ పోస్టుకు 11 మంది చొప్పున మొత్తం 153 మంది దరఖాస్తు చేసుకున్నారు. జాబితాను జిల్లా వెబ్‌సైట్ https://mulugu.telangana.gov.in లో ఉంచారు. మెరిట్‌పై అభ్యంతరాలు ఉంటే 27, 28 తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల ఆయుష్ విభాగంలో సమర్పించాలని జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డా. ఈ. సునీత తెలిపారు. గడువు తర్వాత వచ్చే అభ్యంతరాలు పరిగణించబడవని స్పష్టం చేశారు. వివరాలకు: 99084 31655 నా భరణ సంప్రదించండి అని డాక్టర్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు

- కష్టాల్లో ఉన్న కుటుంబాలకు

రూ.5 లక్షల బీమా భరోసా : మంత్రి సీతక్క



ములుగు నవంబర్ 25, విజన్ ఆంధ్ర ప్రతినిధి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్ అందించి నిరుపేదల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అససూయ సీతక్క అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ క్రాస్ వద్ద చల్వాయి ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మంత్రి 186 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఇందులో గోవిందరావుపేట మండలానికి చెందిన 88 మంది, ఏటూరునాగారంకు చెందిన 27 మంది, ములుగుకు చెందిన 40 మంది, వెంకటాపూర్‌కు చెందిన 9 మంది, తాడ్వాయికి చెందిన 22 మంది ఉన్నారు. అనంతరం గోవిందరావుపేట మండలానికి చెందిన 15 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని చెప్పారు. తలసేమియా బాధితులకు కూడా పింఛన్లు ఇచ్చి ఆ కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. పింఛన్లు ఒకేసారి అందరికీ మంజూరు కాకపోయినా దశలవారీగా అర్హులందరికీ అందిస్తామని భరోసా ఇచ్చారు. ఏ సంక్షేమ పథకాన్ని నిలిపివేయబోమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. కుటుంబంలో సంప

మెగా హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : హెడ్ కానిస్టేబుల్ బాలయ్య



ములుగు నవంబర్ 26, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 28న గోవిందరావుపేటలో ఏర్పాటు చేస్తున్న మెగా హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు సూచన మేరకు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బాలయ్య కోరారు. బుధవారం వెంకటాపూర్ మండలం బూరుగుపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఉట్లతోగు గూడెంలో నివసిస్తున్న గుత్తి కోయలను బూరుగుపేట విపీఓ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ బాలయ్య సందర్శించారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఆధ్వర్యంలో 28న గోవిందరావుపేట మండలం పీఎస్ఆర్ గార్డెన్‌లో మెగా హెల్త్ క్యాంప్ జరగనుందని తెలిపి, గుత్తి కోయల కుటుంబాలను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

చర్లపల్లిలో ఉచిత యోగా శిబిరానికి విశేష స్పందన..!

- ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో కొనసాగుతున్న యోగా తరగతులు..!



కాప్రా/ఓ.యు. నవంబర్ 24(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : స్వామి రాందేవ్ బాబా ఆశీస్సులతో భారత్ స్వాభిమాన్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో హరినాథరావు గురూజీ సారథ్యంలో చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిబిరం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. శిబిరానికి సాధకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. అనుభవజ్ఞులైన యోగా గురువులు యోగా శిక్షకుల బృందం యోగ గురువు టి రామ్ శెట్టి, యువ ప్రబారి యోగ గురువు బలరాం రెడ్డి, సహ ప్రబారి యోగ గురువు వీరేశం పాల్గొని పలువురికి యోగాసనాలు, ప్రాణాయామంపై శిక్షణ అందిస్తున్నారు. స్థానిక నాయకులు, అధికారుల నుంచి కూడా శిబిరానికి ప్రశంసలు లభించాయి. ఈ ఉచిత యోగా తరగతులు మరో ఏడు రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు కొనసాగనున్నాయి. ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీ పుప్పాల లక్ష్మీకాంతయ్య పర్యవేక్షణ వహిస్తున్నారు.

ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకంలో ప్రతి కుటుంబాన్ని నమోదు చేయాలి

- నమోదు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

- రద్దీ నియంత్రణకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశం

- గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచన



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం' కింద జిల్లాలోని ప్రతి కుటుంబం తప్పనిసరిగా నమోదు చేసుకునేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఘనపురం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పథకం నమోదు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నమోదు కేంద్రాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, రద్దీని నియంత్రిస్తూ ప్రక్రియ సజావుగా సాగేలా వేర్వేరు కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నిర్వహించే నమోదు శిబిరాల సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ శిబిరాలకు తరలివచ్చి నమోదు చేసుకునేలా అవగాన కల్పించడంతో పాటు, ఏ ఒక్క కుటుంబం కూడా ఈ పథకానికి దూరం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ బీమా ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి, జిల్లాలో వంద శాతం నమోదు పూర్తయ్యేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీల్లో ఎంపీడీవో విజయ్, తహసీల్దార్ సుగుణ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

- జిల్లాలో మొత్తం 27,893 మంది ఓటర్ల నమోదు, - డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, - పారదర్శక ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ –రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి వనపర్తి జిల్లా పరిధిలోని ముసాయిదా ఓటరు జాబితాను (డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్) బుధవారం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 27,893 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో 17,385 మంది పురుష ఓటర్లు ఉండగా, 10,508 మంది మహిళా ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు.

అభ్యంతరాలకు డిసెంబర్ 10 తుది గడువు

అర్హులైన పట్టభద్రులందరూ ముసాయిదా జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ఒకసారి సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. జాబితాలో పేర్లు గల్లంతైనా, వివరాలలో ఏవైనా తప్పులు ఉన్నా, లేదా అనర్హుల పేర్లపై అభ్యంతరాలు ఉన్నా నిర్దిష్ట ఫారమ్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. గడువు లోపు అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులతో అధికారులు సమావేశం నిర్వహించారు. జాబితా వివరాలు, క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను పార్టీ ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీఆర్ఓ, ఏఈఆర్ వనపర్తి ఆర్డీఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రాహుల్ రెడ్డి రూ. 21 వేల సాయం

కీసర, నవంబర్ 25, విజన్ ఆంధ్ర : ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లిలోని హనుమాన్ ఆలయ హనుమాన్ విగ్రహానికి,దేవాలయ అభివృద్ధి, పనుల నిమిత్తం బిజెపి పార్టీ యువ మోర్చా నాయకులు కొకుట్ల రాహుల్ రెడ్డి రూ. 21 వేల సాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు రాహుల్ రెడ్డి ని శాలువాతో సన్మానించారు. ఆలయ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. అనంతరం రాహుల్ రెడ్డి మాట్లాడుతూ.. దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డును ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్ లో విలీనం చేస్తామంటే ఒప్పుకోం

- విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలు, విద్యావేత్తలతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ నవంబర్ 25:(విజన్ ఆంధ్ర) : ఇంటర్ విద్యను ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్ లో విలీనం చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. ఈ అంశంలో కచ్చితంగా విద్యార్థుల తల్లితండ్రులు, స్కూల్ యాజమాన్యాలు, ఇంటర్ కాలేజ్ ల యాజమాన్యాలు, విద్యావేత్తలతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బుధవారం నిజామామాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఇంటర్ విద్య విషయంలో నెలకొన్న అన్ని సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. స్కూల్ ఎడ్యుకేషన్ లో ఇంటర్ విద్యను విలీనం చేస్తే మౌలిక సదుపాయాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. ఇంటర్ లో స్కూల్ ఎడ్యుకేషన్ ను కలుపుతారా? స్కూల్ ఎడ్యుకేషన్ ను ఇంటర్ లో కలుపుతారా స్పష్టత ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఇంటర్మీడియేట్ విద్య కోసం తల్లితండ్రులు లక్షలు ఖర్చు చేస్తున్నారని.. కొత్తగా 9, 10 తరగతులను కూడా కలిపితే భారీగా ఫీజుల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను సమాంతరంగా ప్రోత్సహించకుండా, ఫీజుల నియంత్రణ చేపట్టకుండా స్కూల్ ఎడ్యుకేషన్ ఇంటర్ విద్యను కలిపితే చాలా ఇబ్బందులుంటాయన్నారు. ఈ అన్ని అంశాలపై ప్రభుత్వం ముందు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఏకపక్షంగా ముందుకు వెళ్తామంటే ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు.

రాష్ట్రానికి కేంద్రం కరువు సాయం చేయాలి

కరువు బారిన పడిన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కరువు బారిన పడ్డ రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన ఈ సమయంలో కూడా కేంద్రం నుంచి పైసా సాయం అందడం లేదని మండిపడ్డారు.16 వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రాకపోవడంతో సర్పంచులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్థానిక బీజేపీ ఎంపీ అర్వింద్ కేంద్రంతో కొట్లాడి 16 వ ఫైనాన్స్ కమిషన్ నిధులు వచ్చేలా చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో 18 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సరికాదన్నారు. మిగతా అన్ని మండలాల్లోనూ కరువు పరిస్థితులున్నాయని చెప్పారు. రీ సర్వే చేసి కొత్తగా కరువు మండలాల జాబితా ప్రకటించాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాదయాత్రలు చేస్తుంటే.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సమావేశాలు నిర్వహిస్తోంది.. ఇలా రెండు పార్టీలు ఎవరి డబ్బా వాళ్లే కొట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

రైతులను ఎలా ఆదుకుంటారో చెప్పాలి

కరువు పేరుతో రైతులను పంటలు వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం వారిని ఎలా ఆదుకుంటుందో చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఆరుతడి పంటలు వేస్తే ఎంత ధరకు కొంటారో స్పష్టత ఇవ్వాలన్నారు. ఇప్పటికే యూరియా విషయంలో రైతులను ఆగం చేస్తున్నారని.. మళ్లీ పంటల విషయంలోనూ వారిని గందరగోళానికి గురిచేయడం సరికాదన్నారు. ఇష్టానుసారంగా కరెంట్ కోతలు పెడుతున్నారని.. ఇలాంటి సమయంలో ప్రభుత్వాన్ని నమ్మి రైతులు పంటలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. అగ్రికల్చర్ అధికారులు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకొని పంటల విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు.

ప్రభుత్వ బీమా పథకాలు, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి

- ప్రైవేటు వడ్డీ వ్యాపారుల ఉచ్చులో పడొద్దు - కలెక్టర్ ఆదర్శ్ సురభి

- సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి

- మానాజిపేటలో ఆర్బీఐ, యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక సమ్మిళిత ప్రచార శిబిరం

- మహిళా సంఘాలకు రూ.10 కోట్ల రుణ చెక్కుల పంపిణీ



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ జీవిత బీమా పథకాలు, బ్యాంకు రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక భద్రత పొందాలని, ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇబ్బందులు పడొద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం ఘనపురం మండలం మానాజిపేట గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచార కార్యక్రమానికి' రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



బీమా అమలులో మానాజిపేట ఆదర్శం

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మానాజిపేట గ్రామంలో ఇప్పటికే 80 శాతం మంది ప్రజలు కేంద్ర ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాల్లో చేరడం అభినందనీయమని, మిగిలిన 20 శాతం మందిని కూడా పథకాల పరిధిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం రూ.20 వార్షిక ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా (సురక్ష బీమా), రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల జీవిత బీమా (జీవన్ జ్యోతి) లభిస్తాయని వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'ఇందిరా కుటుంబ జీవిత బీమా యోజన'లో గ్రామంలో 150 మంది నమోదు చేసుకున్నారని, మిగతా వారూ త్వరగా చేరాలని కోరారు. కరువు పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు అందించే రుణాలను వినియోగించుకోవాలని తెలిపారు. బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకుని సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.

సీఎస్ఆర్ నిధులతో బ్యాంకు సేవలు భేష్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో సీటీ స్కాన్ యంత్రం, పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.కోటి సాయం అందించిన యూనియన్ బ్యాంక్ సేవలను కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందిస్తూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఖాతాదారులు రీ-కేవైసీ పూర్తి చేసుకోవాలి: ఆర్బీఐ ఆర్డీ

ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ మాట్లాడుతూ, బ్యాంకు ఖాతాలు నిరుపయోగంగా మారకుండా ఖాతాదారులు తప్పనిసరిగా రీ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇలాంటి అవగాహన శిబిరాలు నిర్వహించి ప్రతి ఒక్కరినీ బీమా పరిధిలోకి తీసుకురావాలన్నారు. అనంతరం ఆర్బీఐ జీఎం సుప్రభాత్, యూనియన్ బ్యాంక్ సీజీఎం రవీంద్ర ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.

రూ.10 కోట్ల రుణ చెక్కుల అందజేత

కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద మంజూరైన రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను గ్రామానికి చెందిన వరలక్ష్మి, మల్లమ్మలకు అతిథులు అందజేశారు. క్లెయిమ్ చేయని ఖాతాలకు చెందిన రూ.3.15 లక్షల చెక్కును మండల మహిళా సమాఖ్యకు, స్వయం సహాయక సంఘాలకు రూ.10 కోట్ల బ్యాంకు లింకేజీ రుణ చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆర్ఎం వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీలత రాఘవేందర్, ఎల్డీఎం శివకుమార్, బ్యాంకు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్ చుట్టూ మరో రింగ్ రోడ్డు వస్తోంది

- RRR కోసం 90 గ్రామాల్లో భూసేకరణ మొదలైంది!

- 201 కి.మీ దక్షిణ భాగం

- రూ. 14,557 కోట్ల భారీ ప్రాజెక్టు

- వికారాబాద్‌లో నోటిఫికేషన్ వచ్చేసింది

- రంగారెడ్డిలోనే ఎక్కువ భూమి

- రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామంటున్న సర్కార్



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర: హైదరాబాద్ చుట్టూ మరో పెద్ద రింగ్ రోడ్డు వస్తోంది. దాని పేరే రీజినల్ రింగ్ రోడ్డు – RRR. దీని కోసం ప్రభుత్వం ఇప్పుడు ఫుల్ స్పీడ్‌తో భూసేకరణ మొదలు పెట్టింది. దక్షిణ భాగంలో 201 కి.మీ రోడ్డు కోసం 90 గ్రామాల్లో 4,962.42 ఎకరాలు తీసుకోనున్నారు. వికారాబాద్ జిల్లాలో ఇప్పటికే నోటిఫికేషన్ వచ్చేసింది. రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్ నగర్, యాదాద్రి, సంగారెడ్డి జిల్లాల్లో త్వరలోనే నోటిఫికేషన్లు రానున్నాయి. 100 మీటర్ల వెడల్పుతో కట్టే ఈ రోడ్డుకు దక్షిణ భాగానికే రూ. 14,557 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎంత భూమి?

వికారాబాద్‌లో మొదలైన ప్రక్రియ ఇప్పుడు మిగిలిన జిల్లాలకు పాకనుంది. అధికారులు గ్రామాల వారీగా సర్వే చేసి, ఎవరి భూమి ఎంత పోతుందో, ఎవరికి ఎంత పరిహారం వస్తుందో లెక్కలు వేస్తున్నారు. అందులో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 1,869 ఎకరాలు తీసుకుంటారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో రంగారెడ్డిలోనే ఎక్కువ గ్రామాలు RRR. కిందకు వస్తాయి. నల్లగొండ, మహబూబ్ నగర్, యాదాద్రి, సంగారెడ్డి జిల్లాల్లో కూడా వందల ఎకరాలు సేకరిస్తారు. మొత్తంగా 5 జిల్లాలు, 90 గ్రామాలు, 4,962 ఎకరాలు – ఇది చిన్న విషయం కాదు.

RRR. అంటే ఏంటి? ఎక్కడి నుంచి ఎక్కడికి?

RRR. మొత్తం 347 కి.మీ. అందులో ఉత్తర భాగం 146 కి.మీ, దక్షిణ భాగం 201 కి.మీ. దక్షిణ భాగం సంగారెడ్డి నుంచి మొదలై, వికారాబాద్, మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ, యాదాద్రి మీదుగా మళ్లీ సంగారెడ్డికి కలుస్తుంది. ఇప్పుడున్న ORR కు బయట, సుమారు 40-50 కి.మీ దూరంలో ఈ రోడ్డు కడతారు. దీంతో హైదరాబాద్‌లోకి రాకుండానే ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వెళ్లిపోవచ్చు. లారీలు, భారీ వాహనాలు నగరంలోకి రాకుండా బయట నుంచే వెళ్లిపోతాయి.

రోడ్డు ఎలా ఉంటుంది?

100 మీటర్ల వెడల్పు అంటే చాలా పెద్ద రోడ్డు. మొదట 6 లేన్లతో కట్టి, తర్వాత 8 లేన్లకు పెంచేలా డిజైన్ చేస్తున్నారు. రెండు వైపులా సర్వీస్ రోడ్లు, గ్రీన్ బెల్ట్, లైట్లు, డ్రైనేజీ అన్నీ ఉంటాయి. దక్షిణ భాగానికి రూ. 14,557 కోట్లు ఖర్చు అవుతుంది. అందులో భూసేకరణ, రోడ్డు, వంతెనలు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు అన్నీ కలిపి ఉంటాయి.

రైతుల పరిస్థితి ఏంటి?

భూమి ఇచ్చే రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. మార్కెట్ రేటు ప్రకారం, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తారు. అభ్యంతరాలు ఉంటే విని పరిష్కరిస్తామని అధికారులు అంటున్నారు. కానీ కొన్ని గ్రామాల్లో రైతులు భయపడుతున్నారు. "మా పంట భూములు పోతే మేం ఏం చేయాలి? పరిహారం సరిపోతుందా?" అని అడుగుతున్నారు. ప్రభుత్వం వారితో మాట్లాడి, న్యాయం చేయాలని కోరుతున్నారు.

RRR. వస్తే మనకు ఏం లాభం?

RRR. వస్తే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల్లో పెద్ద అభివృద్ధి వస్తుంది. కొత్త ఫ్యాక్టరీలు, గోదాములు, లాజిస్టిక్ హబ్‌లు, ఐటీ పార్కులు, కొత్త కాలనీలు వస్తాయి. వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయి. హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గుతుంది. కాలుష్యం తగ్గుతుంది. రైతులు తమ పంటను త్వరగా మార్కెట్‌కు తీసుకెళ్లవచ్చు. గ్రామాల్లో భూముల రేట్లు పెరుగుతాయి.

త్వరలోనే పనులు

భూసేకరణ అయిపోగానే రోడ్డు పనులు మొదలు పెట్టాలని ప్రభుత్వం అనుకుంటోంది. ప్యాకేజీలుగా విడగొట్టి టెండర్లు పిలుస్తారు. RRR. పూర్తయితే తెలంగాణ రూపురేఖలే మారిపోతాయని, హైదరాబాద్ మరింత పెద్ద నగరంగా ఎదుగుతుందని ప్రభుత్వం చెబుతోంది.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో తాగునీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలి

విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించాలి,- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,



మెదక్, నవంబర్ 25:(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) : ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి కొరత తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ,ఎస్సి,ఎస్టీ, బీసీ ,మైనార్టీ, మిషన్ భగీరథ, వివిధ శాఖల అధికారులతో ఎల్ నీ నో ప్రభావం ,విద్య సంస్థల్లో నీటి సంరక్షణ చర్యలు పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది జూన్, జూలై నెలల వరకు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్లో నీటి లభ్యతపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి విద్యా సంస్థలో నీటి అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. విద్యా సంస్థల్లో నీటి కొరత ఉన్నట్లు గుర్తిస్తే ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట నూతన బోర్లు వేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి సంరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించి, నీటిని పొదుపుగా వినియోగించే అలవాటును పెంపొందించాలని తెలిపారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, ప్రతిభను వెలికితీయాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, వక్తృత్వ పోటీలు, డిబేట్లు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యా సామర్థ్యాలు తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక గ్రూపులుగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థుల సహకారంతో పాటు ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణలో వారికి అదనపు బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పన, నీటి సంరక్షణకు సమాన ప్రాధాన్యతనిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ, మిషన్ భగీరథ డి,ఈ నాగభూషణం,జిల్లా ఇంటర్ విద్యాధికారి ప్రభావతి ,ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సింధు,ఎస్సి ,ఎస్టీ ,బిసి, మైనార్టీ విద్య సంస్థల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- నషా ముక్త్ భారత్ అభియాన్ కింద అవగాహన

వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు (డ్రగ్స్) దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వనపర్తి డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ మరియు శ్రీ చక్ర పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ?ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువత భవిష్యత్తుపై వాటి దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస

పౌల్ట్రీ రంగానికే తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట

వ్యాపారులు లేకుంటే ఇంత పెద్ద స్థాయిలో గుడ్ల ఉత్పత్తి సాధ్యం కాదని, వారి కృషిని ప్రభుత్వం గుర్తిస్తోందని తెలిపారు.

పౌల్ట్రీ రైతుల సమస్యలు – సీఎం స్పందన

పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు చేసుకునేందుకు ఎదురవుతున్న సమస్యలను నా దృష్టికి తీసుకొచ్చారని సీఎం తెలిపారు. సంక్షోభ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండాలని ప్రతిపాదనలు అందించారని చెప్పారు. పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు అనుమతులు, దాణా ధరలు, మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులు, వ్యాధులు, రుణ సౌకర్యాలు వంటివి. ఈ సమస్యలన్నింటిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. గ్రామ పంచాయతీలలో పౌల్ట్రీ నిర్మించుకోవడానికి సింగిల్ విండో విధానంలో అనుమతులు అందించేలా ప్రభుత్వం మార్పులు తీసుకొస్తుందని సీఎం కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేయాలంటే పంచాయతీ, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్, ఇతర శాఖల చుట్టూ తిరగాల్సి వస్తోందని, దానివల్ల సమయం, డబ్బు వృథా అవుతోందని ఆయన అన్నారు. సింగిల్ విండో వస్తే ఒకే చోట, నిర్ణీత సమయంలో అనుమతులు లభిస్తాయని, యువత, రైతులు సులభంగా పౌల్ట్రీ రంగంలోకి రాగలుగుతారని తెలిపారు.

మొక్కజొన్న కొరత – మంత్రులకు ఆదేశాలు

ఎల్ నినో కరువు పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్లకు సరిపడా సన్నంబియ్యం ప్రభుత్వం దగ్గర నిల్వలు ఉన్నాయని సీఎం తెలిపారు. ప్రజలకు ఆహార భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి లోటు రాకుండా చూస్తోందని అన్నారు. కానీ పౌల్ట్రీకి సంబంధించి మొక్కజొన్నల కొరత ఉందని మా దృష్టికి వచ్చిందని సీఎం చెప్పారు. మొక్కజొన్న పౌల్ట్రీ దాణాలో ప్రధాన ముడి పదార్థం. దాని కొరత వల్ల దాణా ధరలు పెరిగి, పౌల్ట్రీ రైతులపై భారం పడుతోందని ఆయన అన్నారు. ఆ సమస్యను పరిష్కరించేలా చూడాలని మా మంత్రులను ఆదేశిస్తున్నానని సీఎం స్పష్టం చేశారు. మొక్కజొన్న సాగును ప్రోత్సహించడం, రైతులకు మద్దతు ధర, విత్తనాలు, సాగు సలహాలు ఇవ్వడం, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేయడం, నిల్వల నిర్వహణ వంటి అన్ని అంశాలపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని తెలిపారు.

రైతుల ఆర్థిక శక్తిని బలోపేతం చేస్తున్న పరిశ్రమ

వ్యవసాయ కూలీలకు, రైతులకు ఉపాధి కలిగించే పరిశ్రమ పౌల్ట్రీ అని సీఎం అన్నారు. ఒక పౌల్ట్రీ ఫారం ఏర్పాటైతే దాని చుట్టూ ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని, దాణా తయారీ, రవాణా, మార్కెటింగ్, గుడ్ల సేకరణ, మాంసం ప్రాసెసింగ్ వంటి అనేక రంగాల్లో ఉద్యోగాలు వస్తాయని వివరించారు. పౌల్ట్రీ ఇండస్ట్రీ కేవలం కోళ్లను, గుడ్లను ఉత్పత్తి చేయడమే కాదు, రైతుల ఆర్థిక శక్తిని బలోపేతం చేస్తుందని సీఎం స్పష్టం చేశారు. వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ కూడా ఉంటే రైతుకు రెండు వైపుల నుంచి ఆదాయం వస్తుందని, కరువు, వరదలు వచ్చినా పౌల్ట్రీ ఆదాయం ఆదుకుంటుందని అన్నారు. ఈ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఒడిదుడుకులను తట్టుకుని పరిశ్రమలో నిలబడటం, పరిశ్రమను కాపాడటాన్ని ప్రభుత్వం అభినందిస్తోందని అన్నారు. గతంలో ఎన్నో సంక్షోభాలు వచ్చినా పౌల్ట్రీ రైతులు ధైర్యంగా నిలబడ్డారని, వారి పట్టుదలే ఈ రంగాన్ని ఇంత స్థాయికి తీసుకొచ్చిందని ప్రశంసించారు.

పౌల్ట్రీకి ప్రాధాన్యత రంగం హోదా – కొత్త పాలసీలు

పౌల్ట్రీని కూడా ఒక ప్రాధాన్యత రంగంగా గుర్తించి శాశ్వత పరిష్కారం దిశగా పాలసీలను రూపొందిస్తామని సీఎం ప్రకటించారు. తాత్కాలిక పరిష్కారాలు కాకుండా, దీర్ఘకాలికంగా రంగానికి మేలు చేసే పాలసీలు తీసుకొస్తామని చెప్పారు.కాలానుగుణంగా, క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా పాలసీలను ఇంప్రూవ్ చేసుకుంటామని సీఎం తెలిపారు. పాలసీలు ఒకసారి చేసి వదిలేయడం కాదని, ప్రతి ఏడాది రైతుల అభిప్రాయాలు తీసుకుని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేస్తామని అన్నారు.పాలసీలు, ప్రభుత్వ నిర్ణయాల విషయంలో మీకు చింత అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. తెలంగాణలో పాలసీ పెరాలసిస్ లేదని, గత ప్రభుత్వాలు రూపొందించిన మంచి పాలసీలను కొనసాగిస్తూనే, కొత్త పాలసీలను తీసుకొస్తున్నామని తెలిపారు. మంచిని ఎక్కడున్నా స్వీకరిస్తామని, రైతులకు మేలు చేసే ప్రతి నిర్ణయాన్ని తీసుకుంటామని అన్నారు.

2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని సీఎం అన్నారు. భారతదేశం స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తి చేసుకునే నాటికి తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఉండాలని ఆకాంక్షించారు.ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో వ్యవసాయం, పౌల్ట్రీ, డెయిరీ, చేపల పెంపకం, ఐటీ, ఫార్మా, పరిశ్రమలు, సేవా రంగం వంటి అన్ని రంగాల పాత్ర కీలకమని చెప్పారు. పౌల్ట్రీ రంగం కూడా ఆ ఆర్థిక ప్రయాణంలో భాగస్వామి కావాలని, తెలంగాణ గుడ్లను, చికెన్‌ను దేశవ్యాప్తంగా, విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు, రైతులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎక్స్‌పో విజయవంతం కావాలని, పౌల్ట్రీ రంగం మరింత అభివృద్ధి చెందాలని సీఎం ఆకాంక్షించారు.

అనుమతులు లేకుండానే బోరు వ్యాపారం..

- ప్రశ్నిస్తే బూతు పురాణాలు!
- రఘునాథ్ నియో సిటీ వెంచర్‌లో అక్రమ విద్యుత్ వినియోగం?
- విద్యుత్ అధికారుల విధులకు ఆటంకాలు..
- మండల ,జిల్లా విద్యుత్ అధికారులుచర్యలు తీసుకోవాలి





కొండాపూర్ (విజన్ ఆంధ్ర): నవంబర్ 25 : కొండాపూర్ మండల పరిధిలోని మునిదేవుని పల్లి గ్రామ శివారుకు చెందిన సర్వేనెంబర్ 82,83,85రఘునాథ్ నియో సిటీ వెంచర్‌లో విద్యుత్ అధికారుల అనుమతులు లేకుండానే బోరు మోటారు ద్వారా నీటిని వినియోగిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ విద్యుత్ వినియోగాన్ని ప్రశ్నించిన విద్యుత్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, బూతు పురాణాలతో దాడికి యత్నించారని విజన్ ఆంధ్ర రిపోర్టర్ హెచ్. శేఖర్ ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. దెబ్బడి సత్యనారాయణ, అంజనేయులు అనే ఇద్దరు వ్యక్తులు తమ భూమిని హైదరాబాద్‌కు చెందిన డెవలపర్లకు వెంచర్ అభివృద్ధి కోసం అప్పగించారు. డెవలపర్లు నాలా కన్వర్షన్ చేయించుకొని రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే వెంచర్ పనుల కోసం బోరు మోటారును వినియోగిస్తున్నప్పటికీ విద్యుత్ అధికారుల అనుమతులు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కొండాపూర్ మండల విద్యుత్ శాఖ ఏఈ సిద్ధిరాజ్, విజన్ ఆంధ్ర రిపోర్టర్ శేఖర్‌కు హెల్పర్ ధావన్ చేతికి గాయం కావడంతో అక్రమంగా విద్యుత్తు వాడే స్థలానికి వెళ్లడానికి వీలుకానందన రిపోర్టర్ బైక్ పై సంఘటన స్థలానికి హెల్పర్ దావల్ ను తీసుకువెళ్లడం జరిగింది. అక్రమంగా విద్యుత్ వాడకాన్ని గమనించిన హెల్పర్ కలెక్షన్ పూర్తిగా తొలగించే క్రమంలో అక్కడికి వచ్చిన దెబ్బడి సత్యనారాయణ, అంజనేయులు తమది వ్యవసాయ భూమి అని, తమ భూమిలో నీటిని విక్రయించుకునే హక్కు తమకుందని పేర్కొంటూ విద్యుత్ సిబ్బందిని బేదిరింపులకు గురి చేశారు. తమ భూమిలోకి రావడానికి మీరెవరంటూ బూతు మాటలతో దురుసుగా ప్రవర్తించారని, హెల్పర్‌తో పాటు రిపోర్టర్‌పై దాడికి యత్నించారని శేఖర్ ఆరోపించారు.

అక్రమ విద్యుత్ వినియోగంపై విచారణ జరపాలి

విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు లేకుండా బోరు మోటారు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని శేఖర్ కోరారు. విధుల్లో ఉన్న విద్యుత్ సిబ్బందిని అడ్డుకోవడం, దురుసుగా ప్రవర్తించడం వంటి ఘటనలపై సంబంధిత మండల, జిల్లా విద్యుత్ అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.అక్రమ విద్యుత్ వినియోగం నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కూడా విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని విజన్ ఆంధ్ర రిపోర్టర్ హెచ్. శేఖర్ కోరారు.

నేడు బెలిదే రమేష్ గుప్తా జన్మదిన వేడుకలు



కీసర, నవంబర్ 25, విజన్ ఆంధ్ర : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెలిదే రమేష్ గుప్తా జన్మదిన వేడుకలు గురువారం శ్రీ హరి హర పుత్ర వరాల అయ్యప్ప స్వామి దేవస్థానంలో జరగనున్నాయి. రమేష్ గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదం వితరణ చేయనున్నారు. అభిమానులు, శ్రేయోభిలాషులు తన జన్మదిన వేడుకల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా బెలిదే రమేష్ గుప్తా తెలిపారు.

తెలంగాణ నిరుద్యోగులకు బిగ్ గుడ్ న్యూస్

డిసెంబర్ 6న 2,000 హోంగార్డు పోస్టుల నోటిఫికేషన్!

- హోంగార్డు రైజింగ్ డే నాడే ప్రకటన
- ఇ+ఐ ఆఫీసులో జోరుగా కసరత్తు
- ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్‌లో సిబ్బంది కొరత
- ఇక తీరనున్న కష్టాలు



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

తెలంగాణలో ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు తీపి కబురు. రాష్ట్ర పోలీసు శాఖ త్వరలో 2,000 హోంగార్డు పోస్టులను భర్తీ చేయనుంది. డిసెంబర్ 6న హోంగార్డు రైజింగ్ డే సందర్భంగా ఈ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. పోలీస్ శాఖను మరింత బలోపేతం చేయడం కోసం నూతన రిక్రూటింగ్ పై ఇ+ఐ ఆఫీసు దృష్టి సారించింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న హోంగార్డులతోపాటు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, ఇతర విభాగాల్లోకి ఎంత మంది అవసరం అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

ఎందుకు 2,000 పోస్టులు?

ప్రస్తుతం రాష్ట్రంలో హోంగార్డుల కొరత తీవ్రంగా ఉంది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ జామ్‌లు, రద్దీ ప్రాంతాల్లో బందోబస్తు, పండుగలు, ఎన్నికలు, బహిరంగ సభలు, ఎ౫ా పర్యటనలు, ఆలయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వద్ద – ఇలా ప్రతి చోటా హోంగార్డుల అవసరం ఉంటుంది. కానీ ఉన్న సిబ్బంది సరిపోవడం లేదు. పోలీసులపై పని భారం పెరిగిపోతోంది. అందుకే ప్రభుత్వం ఒకేసారి 2,000 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. దీంతో పోలీస్ శాఖకు కొత్త ఊపు వస్తుందని, శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాల వారీగా ఎన్ని పోస్టులు అనే వివరాలు నోటిఫికేషన్‌లోనే వెల్లడి కానున్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో ఎక్కువ పోస్టులు ఉండే అవకాశం ఉంది. గ్రామీణ జిల్లాల్లో కూడా భారీగా పోస్టులు కేటాయించనున్నట్లు సమాచారం.

డిసెంబర్ 6 – హోంగార్డుల పండుగ రోజు

డిసెంబర్ 6 అంటే హోంగార్డులకు పండుగ రోజు. ప్రతి సంవత్సరం ఈ రోజున హోంగార్డు రైజింగ్ డేను ఘనంగా జరుపుకుంటారు. హోంగార్డుల సేవలను గుర్తించి, ఉత్తమ సేవలు అందించిన వారిని సన్మానిస్తారు. అదే రోజున కొత్త నోటిఫికేషన్ వస్తే అది హోంగార్డులకు, నిరుద్యోగులకు పెద్ద కానుక అవుతుంది. అందుకే ఇ+ఐ ఆఫీసులో ఈ నోటిఫికేషన్ కోసం కసరత్తు వేగంగా జరుగుతోంది. రోస్టర్, రిజర్వేషన్లు, అర్హతలు, వయస్సు, శారీరక ప్రమాణాలు వంటి వివరాలను ఖరారు చేస్తున్నారు.

ఎవరు అప్లై చేయవచ్చు?

గత నోటిఫికేషన్ల ప్రకారం చూస్తే, హోంగార్డు పోస్టుకు కనీసం 10వ తరగతి / ఇంటర్ పాస్ అయి ఉండాలి. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. ౫ాజ, ౫ా, దీజ, మహిళలకు వయస్సులో సడలింపు ఉంటుంది. శారీరకంగా దృఢంగా ఉండాలి. ఎత్తు, ఛాతి కొలతలు, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హై జంప్ వంటి ఫిజికల్ టెస్టులు ఉంటాయి. తెలంగాణలో నివసిస్తున్న వారు, తెలుగు మాట్లాడగలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఈసారి అర్హతల్లో ఏమైనా మార్పులు ఉంటాయా అనేది అధికారిక నోటిఫికేషన్ వచ్చిన తర్వాతే తెలుస్తుంది. అందుకే అభ్యర్థులు ఇప్పటి నుంచే ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని సీనియర్లు సూచిస్తున్నారు.

హోంగార్డు ఉద్యోగం అంటే ఏంటి?

హోంగార్డు అంటే పోలీసులకు కుడి భుజం లాంటి వారు. పోలీసులతో కలిసి ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, పెట్రోలింగ్, రాత్రి కాపలా వంటి విధులు నిర్వహిస్తారు. ప్రస్తుతం హోంగార్డులకు రోజువారీ గౌరవ వేతనం ఇస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం వేతనం పెంచింది. హోంగార్డుగా చేరిన వారికి తర్వాత కానిస్టేబుల్, ఇతర పోలీస్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. చాలా మంది హోంగార్డులు తర్వాత పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అందుకే పోలీస్ ఉద్యోగం కావాలనుకునే యువతకు హోంగార్డు ఒక మంచి మెట్టు.

ఇప్పటి నుంచి ఏం చేయాలి?

నోటిఫికేషన్ డిసెంబర్ 6న వస్తుందనే వార్తతో అభ్యర్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి.

– 10వ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ, ఆధార్ కార్డు సిద్ధంగా ఉంచుకోండి.

– రోజూ ఉదయం పరుగు, వ్యాయామం చేసి ఫిజికల్ టెస్టుకు సిద్ధం కండి.

– తెలంగాణ పోలీస్ శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను, ఇ+ఐ ఆఫీసు ప్రకటనలను గమనిస్తూ ఉండండి.

– ఫేక్ వార్తలు, ఫేక్ లింకులను నమ్మి మోసపోవద్దు. డబ్బులు అడిగే వారికి దూరంగా ఉండండి.

అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు

ప్రస్తుతం ఇది అధికారుల స్థాయిలో జరుగుతున్న చర్చ. డిసెంబర్ 6న నోటిఫికేషన్ వస్తుందా లేదా అనేది అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కానీ ఇ+ఐ ఆఫీసులో జరుగుతున్న కసరత్తు చూస్తుంటే నోటిఫికేషన్ త్వరలోనే వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 2,000 హోంగార్డు పోస్టుల భర్తీతో పోలీస్ శాఖ బలోపేతం అవుతుంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయి. నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుంది.

ఇంటర్ విద్యార్థులకు గుడ్ న్యూస్

- ఇక జంబ్లింగ్ బాధ లేదు, సొంత కాలేజీలోనే ప్రాక్టికల్స్!
- 2027 ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ రద్దు
- ఇంటర్ బోర్డు సంచలన నిర్ణయం
- జనవరి 29, 30న ఇంగ్లీష్ ప్రాక్టికల్స్
- ఫిబ్రవరి 1 నుంచి సైన్స్ ప్రాక్టికల్స్ షురూ

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

తెలంగాణలో లక్షలాది మంది ఇంటర్ విద్యార్థులు ఎదురుచూస్తున్న శుభవార్త వచ్చేసింది. 2027 ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఇక నుంచి విద్యార్థులు వేరే కాలేజీకి వెళ్లాల్సిన అవసరం లేదు. తాము చదువుతున్న సొంత కళాశాలలోనే ప్రాక్టికల్స్ రాసుకోవచ్చు. ఈ ఒక్క నిర్ణయంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పెద్ద ఊరట కలిగింది.

జంబ్లింగ్ అంటే ఎంత ఇబ్బందో తెలుసా?

గతంలో జంబ్లింగ్ విధానంలో ఒక కాలేజీ విద్యార్థులను వేరే కాలేజీకి పంపించేవారు. తెలియని కాలేజీ, తెలియని ల్యాబ్, తెలియని పరికరాలు, కొత్త ఎగ్జామినర్లు – విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు ముందే టెన్షన్‌తో వణికిపోయేవారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఉదయాన్నే లేచి బస్సులు పట్టుకోవాలి. అమ్మాయిలకు, గ్రామాల నుంచి వచ్చే పిల్లలకు ఇది పెద్ద భారం. ఖర్చు ఒకవైపు, భయం మరోవైపు. మంచిగా వచ్చిన ప్రాక్టికల్ కూడా టెన్షన్ వల్ల చెడిపోయేది. విద్యార్థులు, తల్లిదండ్రులు, లెక్చరర్లు ఎన్నోసార్లు ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. వారి వినతిని బోర్డు ఈసారి పరిగణనలోకి తీసుకుంది. విద్యార్థుల మానసిక ప్రశాంతతే ముఖ్యమని భావించి జంబ్లింగ్‌కు స్వస్తి పలికింది.

పరీక్షలు ఎప్పుడు? పూర్తి షెడ్యూల్

బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం:

– జనవరి 29: ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్

– జనవరి 30: ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్

– ఫిబ్రవరి 1 నుంచి 18 వరకు:లి సైన్స్ ప్రాక్టికల్స్ – ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ

సైన్స్ ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మరో బ్యాచ్. ఏ రోజు ఏ సబ్జెక్టు ప్రాక్టికల్ అనేది కాలేజీలు త్వరలోనే తెలియజేస్తాయి.

సొంత కాలేజీలో రాస్తే లాభాలేంటి?

– తెలిసిన ల్యాబ్, తెలిసిన పరికరాలు – భయం ఉండదు

– ప్రయాణం, ఖర్చు, టైమ్ వేస్ట్ ఉండదు

– తమ లెక్చరర్ల దగ్గరే ప్రాక్టీస్ చేసిన ఎక్స్‌పెరిమెంట్లే వస్తాయి

– అమ్మాయిలకు, గ్రామీణ విద్యార్థులకు పెద్ద భరోసా

అందుకే ఈ నిర్ణయాన్ని విద్యార్థి లోకం మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది.

మరి మోసాలకు చెక్ ఏంటి?

సొంత కాలేజీలో ప్రాక్టికల్స్ అంటే మార్కులు ఎక్కువ వేస్తారా? అనే అనుమానం కొందరిలో ఉంది. దీనికి బోర్డు ఇప్పటికే చెక్ పెట్టింది. ప్రాక్టికల్స్ సొంత కాలేజీలో జరిగినా, పరీక్ష నిర్వహించడానికి బయటి కాలేజీ నుంచి ఎగ్జామినర్ వస్తారు. ప్రతి ల్యాబ్‌లో జజుఎ నిఘా ఉంటుంది. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఎప్పుడైనా తనిఖీకి వస్తాయి. మార్కుల్లో తేడా వస్తే కాలేజీలపై చర్యలు తీసుకుంటారు. అంటే విద్యార్థులకు సౌకర్యం ఇస్తూనే, పరీక్షల్లో పారదర్శకతను కాపాడతామని బోర్డు స్పష్టం చేసింది.



విద్యార్థులు ఇప్పుడు ఏం చేయాలి?

ప్రాక్టికల్స్‌కు ఇంకా 2 నెలలు టైమ్ ఉంది. ఈ టైమ్‌ను వృథా చేయకండి.

– రికార్డులు ఇప్పటి నుంచే పూర్తి చేయండి. చివరి నిమిషంలో రాయొద్దు.

– ప్రతి ఎక్స్‌పెరిమెంట్‌ను స్వయంగా చేసి చూడండి.

– వైవా కోసం – ఎక్స్‌పెరిమెంట్ ఎందుకు చేస్తాం? దాని సూత్రం ఏంటి? రిజల్ట్ ఏంటి? అనే ప్రశ్నలకు సిద్ధంగా ఉండండి.

– ల్యాబ్ పరికరాల పేర్లు, వాడకం గుర్తు పెట్టుకోండి.

గుర్తుంచుకోండి – ప్రాక్టికల్ మార్కులు ఫైనల్ మార్కుల్లో కలుస్తాయి. ప్రాక్టికల్స్‌లో మంచి మార్కులు వస్తే ఇంటర్‌లో మంచి పర్సంటేజ్ వస్తుంది.

తల్లిదండ్రులు, లెక్చరర్ల సంతోషం

ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు కూడా హ్యాపీగా ఉన్నారు. “పిల్లలను దూరం పంపించాల్సిన టెన్షన్ తప్పింది. సొంత కాలేజీలోనే రాస్తే ధైర్యంగా రాస్తారు” అని అంటున్నారు. లెక్చరర్లు కూడా “మా పిల్లలకు మేమే నేర్పిన ప్రాక్టికల్స్, మా ల్యాబ్‌లోనే రాస్తే మంచి మార్కులు వస్తాయి” అని అంటున్నారు. మొత్తంగా, 2027 ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ రద్దు నిర్ణయం విద్యార్థులకు పెద్ద పండుగ లాంటిదే.

తెలంగాణ క్రీడాభివృద్ధికి బలమైన పునాదిగా 'ఖేలో ఇండియా'

మంత్రి వాకిటి శ్రీహరి, అధికారులతో కలిసి పోటీల ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ. 203 కోట్లు వెచ్చిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం వాటాగా ఈ క్రీడల నిర్వహణ కోసం రూ. 21 కోట్లు కేటాయించింది. అందులో భాగంగా రూ. 120 కోట్ల రాష్ట్ర బడ్జెట్ తో స్టేడియాలలో ప్రపంచ స్థాయి అభివృద్ధి పనులు, అత్యాధునిక క్రీడా పరికరాలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (ఖ౫+) 2026 నిర్వహణ నేపథ్యంలో ప్రభుత్వం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యూహరచన చేసింది. ఇతర రాష్ట్రాల్లో చేపట్టిన ఖేలో ఇండియా పోటీల సందర్భంగా తీసుకున్న తాత్కాలిక చర్యలకు పోకుండా శాశ్వత క్రీడా సదుపాయాలను కల్పించే ప్రక్రియ వేగంగా జరుగుతోంది.

2002 తర్వాత తొలిసారి ఇంత భారీ స్థాయి

అయితే, 2002 సంవత్సరం తర్వాత ఈ స్థాయిలో క్రీడలకు సంబంధించిన ప్రోత్సాహం అందించడం ఇదే తొలిసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన 2002 జాతీయ క్రీడల తర్వాత తెలంగాణలో మళ్ళీ జాతీయ స్థాయిలో ఇంతటి భారీ క్రీడా పోటీలను నిర్వహించనుండటం విశేషం. 2002 డిసెంబర్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో క్రీడాకారులు, అధికారులు కలిపి దాదాపు 8,000 మంది పాల్గొనగా ఈసారి ఖేలో ఇండియాలో అన్ని రాష్ట్రాల నుంచి 9,000 పైగా మంది హాజరుకానున్నట్లు అంచనా. ఈ సంఖ్య ప్రతి నాలుగేళ్లకోసారి జరిగే కామన్వెల్త్ క్రీడల కంటే రెట్టింపు. రాష్ట్రంలో భావి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ. 120 కోట్లతో పలు అంతర్జాతీయ క్రీడా అభివృద్ధి పనులు చేపడుతూ, అత్యాధునిక క్రీడా పరికరాలు సమకూరుస్తోంది. దీంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా క్రీడా సౌకర్యాలు రాష్ట్ర క్రీడాకారులకు ఉపయోగపడనున్నాయి. ఈ సౌకర్యాలు కేవలం ఖేలో ఇండియా కోసమే కాదు, భవిష్యత్తులో తెలంగాణ క్రీడాకారులు ప్రాక్టీస్ చేయడానికి, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం కావడానికి ఉపయోగపడతాయని సీఎం చెప్పారు.

డిసెంబర్ 11న అట్టహాసంగా ప్రారంభం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, డిసెంబర్ 11 న అట్టహాసంగా ఖేలో ఇండియా పోటీలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎల్బీ స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు, గచ్చిబౌలి స్టేడియంలో ముగింపు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. నగరమంతా క్రీడా స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ యువతను క్రీడల వైపు మళ్లించేందుకు దోహదపడేలా భవిష్యత్తుకు పునాది వేయడంపై దృష్టి సారించాలన్నారు. స్టేడియంల పునరుద్ధరణతో పాటు ఏర్పాట్లలో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. స్టేడియాలలో ఏర్పాట్ల నాణ్యతపై విజిలెన్స్ నిఘా ఉండాలన్నారు. పోటీల్లోని అన్ని వేదికల్లో టాయిలెట్లతో సహా అన్ని నిర్వహణ అవసరాలకు ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వాడాలన్నారు.

ఒక్కో విభాగానికి ఇంచార్జ్ – జిల్లాల వారీగా మంత్రులు

ఏర్పాట్లకు సంబంధించి ఒక్కో విభాగానికి ఒక్కొక్కరిని ఇంచార్జులుగా నియమించి బాధ్యతలను చేయాలని సూచించారు. ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. పోటీల ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లాలవారీగా మంత్రులను ఇంచార్జ్ గా నియమించాలన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో ఇంచార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పర్యవేక్షించాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి సూచించారు. మహబూబ్ నగర్ పరిధిలో జూపల్లి కృష్ణారావు, వరంగల్ పరిధిలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ పరిధిలో అడ్లూరి లక్ష్మణ్ కు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలన్నారు. ఖమ్మం పరిధిలో తుమ్మల నాగేశ్వర్ రావు, నిజామాబాద్ పరిధిలో సుదర్శన్ రెడ్డిని పోటీల ఏర్పాట్ల పర్యవేక్షణకు బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. పోలీస్, మున్సిపల్ అధికారులు ఎప్ప

గవర్నర్‌ను కలిసిన ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు

- తెలంగాణపై ప్రత్యేక అవగాహన
- 78వ ఆర్ఆర్ బ్యాచ్‌కు చెందిన చేతన రెడ్డి, హర్ష డెబోరియా మర్యాదపూర్వక భేటీ
- అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ నేతృత్వంలో రాజ్‌భవన్‌కు
- ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతోనూ భేటీ



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

తెలంగాణ కేడర్‌కు కేటాయించబడిన 78వ ఆర్ఆర్ (2025) బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు నేడు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష బిస్ట్, ఐపీఎస్ నేతృత్వంలో ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు చేతన రెడ్డి, హర్ష డెబోరియా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ అయ్యారు.

నాలుగు వారాల ప్రత్యేక శిక్షణలో భాగంగా భేటీ

78వ ఆర్ఆర్ బ్యాచ్‌లో భాగంగా తెలంగాణ కేడర్‌కు కేటాయించబడిన ఈ ఇద్దరు ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో నాలుగు వారాల ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానం, రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్‌ను కలిసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో జరిగిన భేటీ ద్వారా రాష్ట్ర పరిపాలన, రాజ్యాంగ వ్యవస్థ, తెలంగాణ ప్రత్యేకతలు తదితర అంశాలపై ప్రొబేషనరీ అధికారులు అవగాహన పొందారు. గవర్నర్ వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు సమాచారం.

ఈగల్ డైరెక్టర్‌ను కలిసిన ప్రొబేషనర్లు

అదే విధంగా ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు “ఈగల్” (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) డైరెక్టర్ సందీప్ శాండిల్యను కూడా కలిశారు. డ్రగ్ రవాణాను అరికట్టడం, బాధితులను డి-అడిక్షన్ సెంటర్లలో చేర్చడం, డ్రగ్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడంలో ఈగల్ ఫోర్స్ చేస్తున్న కృషిని ప్రొబేషనర్లు తెలుసుకున్నారు. ఈగల్ పనితీరును, వ్యూహాలను డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రొబేషనర్లకు వివరంగా వివరించారు. డ్రగ్స్‌పై పోరాటంలో యువ ఐపీఎస్ అధికారుల పాత్ర ఎంత కీలకమో ఆయన వారికి తెలియజేశారు.

భవిష్యత్ పోలీసింగ్‌కు పునాది

ఈ పర్యటనలు, భేటీలు ప్రొబేషనరీ అధికారులకు తెలంగాణను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని అకాడమీ వర్గాలు చెబుతున్నాయి. రాజ్యాంగ విలువలు, ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని వారికి సూచించారు.

పవిత్ర గోదావరి.. అపవిత్రం చేస్తున్న నిర్లక్ష్యం!

గోదావరి తీరాన అపరిశుభ్రత.. పట్టించుకునేదెవరు?

- నది ఒడ్డున పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- నీటిలోకి చేరుతున్న చెత్తాచెదారం.. కాలుష్యంపై ఆందోళన
- స్నానఘట్టాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కరువు
- ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

లక్షెట్టిపేట, నవంబర్ 24(విజన్ ఆంధ్ర) ప్రత్యేక కథనం:

పవిత్ర గోదావరి.. కోట్లాది మంది ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక. నిత్యం భక్తులు, స్థానికులు నదీ తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తూ, పూజలు నిర్వహిస్తూ ఉంటారు. అలాంటి పవిత్ర గోదావరి తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారా? అన్న ప్రశ్నలు ప్రస్తుతం లక్షెట్టిపేట గోదావరి నది పరిసరాల్లో నెలకొన్న పరిస్థితులను చూస్తే తలెత్తుతున్నాయి. ఒకవైపు ప్రశాంతంగా ప్రవహిస్తున్న గోదావరి.. మరోవైపు నది ఒడ్డున పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ వాటర్ బాటిళ్లు, తినుబండారాల ప్యాకెట్లు, పాత దుస్తులు, ఇతర వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. నదీ తీరంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తుండటంతో పరిసరాల పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. నది ఒడ్డున పడేసిన వ్యర్థాల్లో కొన్ని నీటిలోకి చేరుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. పవిత్రతకు ప్రతీకగా నిలవాల్సిన గోదావరి తీరం ఇలా అపరిశుభ్రతకు నిలయంగా మారడం స్థానికులను కలవరపెడుతోంది.

చెత్తాచెదారంతో నిండిన నదీ తీరం..

లక్షెట్టిపేట గోదావరి నది తీరంలోని స్నానఘట్టాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం పారిశుద్ధ్య నిర్వహణ తీరును ప్రశ్నిస్తోంది. పచ్చిక బయళ్ల మధ్య, రాళ్ల పక్కన, ఘాట్ పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, తినుబండారాల ప్యాకెట్లు చెల్లాచెదురుగా పడివున్నాయి. నదీ తీరానికి వచ్చే సందర్శకులు వినియోగించిన వస్తువులను అక్కడే వదిలివేయడం కూడా అపరిశుభ్రతకు కారణమవుతోంది. రోజురోజుకూ వ్యర్థాలు పేరుకుపోతే నదీ తీర సహజ అందాలు కనుమరుగవడమే కాకుండా పరిసర ప్రాంతాలు దుర్వాసనకు నిలయంగా మారే ప్రమాదం ఉంది. భక్తులు ప్రశాంతంగా గడపాల్సిన ప్రాంతం చెత్తాచెదారంతో దర్శనమివ్వడం విచారకరం.

నదిలోకి చేరుతున్న వ్యర్థాలు..

నదీ తీరంలో పడేసిన చెత్త అంతటితో ఆగడం లేదు. ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ బాటిళ్లు, పాత దుస్తులు తదితర వ్యర్థాలు నీటి అంచున కనిపిస్తున్నాయి. గాలి, నీటి ప్రవాహం కారణంగా ఇవి నదిలోకి చేరే పరిస్థితి ఉంది. ఇప్పటికే నీటి అంచున వ్యర్థాలు కనిపిస్తుండటంతో నదీ జలాల పరిశుభ్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు జలచరాలకు హాని కలిగించే ప్రమాదం ఉండటంతో పాటు పర్యావరణ సమతుల్యతపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.



నదిలో స్నానాలు ఆచరించే భక్తులు, స్థానికులు ఇదే ప్రాంతాన్ని వినియోగిస్తుండటంతో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పారిశుద్ధ్య నిర్వహణ ఏదీ?

పట్టణ పరిధిలోని గోదావరి నది తీరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. నదీ తీరంలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, తగిన సంఖ్యలో చెత్తకుండీలు ఏర్పాటు చేయడం, వ్యర్థాలను సేకరించి తరలించే విధంగా చర్యలు తీసుకోవడం అత్యవసరం. ముఖ్యంగా స్నానఘట్టాల వద్ద పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. నదిలో చెత్త వేయడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కేవలం అప్పుడప్పుడు శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం కాకుండా నిరంతర నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి.

పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ..

గోదావరి నది కేవలం నీటి వనరు మాత్రమే కాదు.. ప్రజల జీవన విధానంతో, ఆధ్యాత్మిక విశ్వాసాలతో ముడిపడిన సహజ సంపద. అలాంటి నదిని కాపాడుకోవడం ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత. నదీ తీరానికి వచ్చే వారు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలి. అధికారులు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే గోదావరి తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుంది. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతంగా అభివృద్ధి చెందాల్సిన నదీ తీరం అపరిశుభ్రతకు చిరునామాగా మారకుండా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



అధికారులు స్పందించాలి.. శాశ్వత పరిష్కారం చూపాలి..

గోదావరి నది తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించి, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ప్రణాళిక రూపొందించాలి. నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలి. చెత్తకుండీలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అవసరమైతే ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలి. గోదావరి తీరాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పవిత్ర గోదావరి నది గౌరవాన్ని, పర్యావరణాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



“పవిత్ర గోదావరి నది మన ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక. అలాంటి నది తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోవడం బాధాకరం. నదిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి నది తీరంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి. ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. చెత్తను నదిలో వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. గోదావరి నది పవిత్రతను, పర్యావరణాన్ని కాపాడేందుకు శాశ్వత ప్రణాళిక రూపొందించాలి. నదీ తీరాన్ని పరిశుభ్రంగా ఉంచే విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తగిన చర్యలు చేపట్టాలి” అని ఆయన కోరారు.

– అవునూరి వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి, లక్షెట్టిపేట

అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న సామాన్య ప్రజలు..!

- బయటపడే దారి ఏది?, - పెరుగుతున్న ధరలు..!, - తరుగుతున్న ఆదాయం..!



పెద్ద శంకరంపేట్, నవంబర్ 25 (విజన్ ఆంధ్ర) : రోజురోజుకూ పెరుగుతున్న అప్పుల భారం! నేటి సమాజంలో సామాన్య ప్రజల జీవితం రోజురోజుకూ భారంగా మారుతోంది. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే, మరోవైపు కుటుంబ ఆదాయం మాత్రం పెరగడం లేదు. వచ్చిన జీతం ఇంటి అద్దె, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకులకే సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో నెలవారీ ఖర్చుల కోసం చాలామంది అప్పులపై ఆధారపడాల్సి వస్తోంది.

అప్పు చేయడం తప్పనిసరి పరిస్థితిగా మారింది!

ఒకప్పుడు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అప్పు చేసేవారు. కానీ ప్రస్తుతం నెలవారీ ఖర్చులు తీర్చుకోవడానికి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. బ్యాంకు రుణాలు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీకి ఇచ్చే వ్యక్తిగత అప్పులు, ఆన్‌లైన్ రుణ యాప్‌లు సామాన్యుల జీవితాల్లోకి ప్రవేశించాయి. మొదట చిన్న మొత్తంతో ప్రారంభమైన అప్పు, వడ్డీ మీద వడ్డీ పెరిగి పెద్ద భారంగా మారుతోంది. ముఖ్యంగా చిరు వ్యాపారులు, కూలీలు, రైతులు, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువ కావడంతో కుటుంబ నిర్వహణ కష్టంగా మారుతోంది.

అప్పుల కోసం ఆత్మగౌరవాన్ని కోల్పోవద్దు!

అప్పులు తీర్చలేక కొందరు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అప్పు ఇచ్చిన వారి ఒత్తిళ్లు, వడ్డీ వ్యాపారుల వేధింపులు కుటుంబ ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఆందోళన చెందకుండా సరైన ఆర్థిక ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వాల బాధ్యత ఏమిటి?

సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలను పెంచాలి. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండే వైద్య, విద్యా సదుపాయాలను మెరుగుపరచాలి. చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందించాలి. రైతులకు గిట్టుబాటు ధరలు, కూలీలకు స్థిరమైన ఉపాధి కల్పించాలి. అధిక వడ్డీలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అక్రమ రుణ వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలి.

అప్పుల నుంచి బయటపడేందుకు మార్గాలేంటి..!

ప్రజలు కూడా తమ ఆదాయం, ఖర్చులపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి. అధిక వడ్డీ అప్పులను ముందుగా తీర్చే ప్రయత్నం చేయాలి. కొత్త అప్పులతో పాత అప్పులు తీర్చే అలవాటుకు దూరంగా ఉండాలి. అవసరమైతే బ్యాంకులు, ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకోవాలి.

సామాన్యుడి జీవితంలో ఆర్థిక భరోసా ఎప్పుడు?

ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా గౌరవంగా జీవించే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వాలు, సమాజం బాధ్యత. అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి కుటుంబానికి ఉపాధి, తగిన ఆదాయం, అందుబాటులో విద్య, వైద్యం, ఆర్థిక భద్రత కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

చివరగా ఒక్క ప్రశ్న..

రోజంతా కష్టపడి పనిచేసే సామాన్యుడికి తన కుటుంబాన్ని పోషించుకోవడానికి కూడా అప్పు చేయాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి? అప్పులు లేని ప్రశాంతమైన జీవితం సామాన్యుడికి ఎప్పుడు అందుతుంది?

- కే కనకరాజ్ గౌడ్ పెద్ద శంకరంపేట్

జోగిపేటలో విద్యార్థినుల కన్నీరు

- పురుగుల అన్నం తిని ఆస్పత్రి పాలైన బాలికలు, అధికారులకు కూడా తలుపు తీయని వైనం
- అందోల్ మండలం జోగిపేట ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం
- వాంతులు, విరేచనాలతో అస్వస్థత
- ఆధారాలు మాయం చేసేందుకు ఆహారం పారబోశారా?
- తహసీల్దార్, ఎస్ఐ అరగంట పాటు తలుపు కొట్టినా తెరవని సిబ్బంది
- తల్లిదండ్రుల ఆగ్రహం
- హాస్టళ్లలో ఆహార నాణ్యతపై కఠిన తనిఖీలు చేయాలని డిమాండ్

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 25, విజన్ ఆంధ్ర:

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేటలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హాస్టల్‌లో భోజనం చేసిన తర్వాత పలువురు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో తీవ్ర అస్వస్థత కలిగింది. ఒక్కసారిగా పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో హాస్టల్‌లో ఆందోళన, భయాందోళనలు నెలకొన్నాయి. తల్లిదండ్రులు హాస్టల్‌కు పరుగుపరుగున చేరుకుని తమ పిల్లల పరిస్థితిని చూసి ఆవేదన చెందారు. హాస్టల్‌లో పురుగుల అన్నం పెడుతున్నారంటూ విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం చేస్తుండగా అన్నంలో పురుగులు కనిపించాయని, అన్నం సరిగా ఉడకలేదని, కూరలో కూడా నాణ్యత లేదని వారు చెబుతున్నారు. ఇది ఒక్కరోజు సమస్య కాదని, గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. పలుసార్లు వార్డెన్, వంట సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని వారు వాపోయారు.

భోజనం చేసిన కొద్దిసేపటికే అస్వస్థత

విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం భోజనం చేసిన కొంతసేపటికే కొందరు విద్యార్థినులకు కడుపు నొప్పి, వాంతులు మొదలయ్యాయి. మరికొందరికి విరేచనాలు, తల తిరగడం, నీరసం వచ్చింది. ఒకరి తర్వాత ఒకరు అస్వస్థతకు గురికావడంతో తోటి విద్యార్థినులు భయపడ్డారు. వెంటనే హాస్టల్ సిబ్బందికి విషయం చెప్పగా, అస్వస్థతకు గురైన విద్యార్థినులను సమీప ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు విద్యార్థినులకు ప్రాథమిక చికిత్స అందించి, సెలైన్ పెట్టి పరిస్థితిని గమనిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపినట్లు సమాచారం. అయినప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతున్నారు.





హాస్టళ్లలో ఆహార నాణ్యత - రాష్ట్రవ్యాప్త చర్చ

తల్లిదండ్రుల ఆందోళన

- మా పిల్లలకు ఇదేనా భోజనం?

విషయం తెలియగానే తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాస్టల్‌కు చేరుకున్నారు. తమ పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని, వారి ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న పిల్లలకు హాస్టల్‌లోనే అన్నీ చూసుకోవాల్సి ఉంటుందని, అలాంటి చోట ఆహారంలో నిర్లక్ష్యం చేస్తే పిల్లల భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. హాస్టల్‌లో ఆహార నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన బియ్యం, కూరగాయలు, నూనె వాడాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవాలని, వారిని భయపెట్టవద్దని కోరారు.

సిబ్బంది తీరుపై తీవ్ర ఆరోపణలు

- తలుపు వేసి ఆహారం పారబోశారా?

ఈ ఘటనలో అత్యంత వివాదాస్పదంగా మారిన అంశం హాస్టల్ సిబ్బంది తీరు. విషయం బయటకు పొక్కకుండా హాస్టల్ డోర్ పెట్టుకొని మిగిలిన ఆహారాన్ని పారబోసి, వంట పాత్రలను శుభ్రం చేసినట్లు సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి. ఘటన తర్వాత ఆధారాలు లేకుండా చేయడానికి ప్రయత్నించారని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్, ఎస్ఐ వచ్చి డోర్ కొట్టినా అరగంట వరకు తీయలేదని చెబుతున్నారు. అధికారులు వచ్చిన విషయం తెలిసినా తలుపు తెరవకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోందని స్థానికులు అంటున్నారు. అరగంట తర్వాత తలుపు తీయగా, అప్పటికే వంట పాత్రలు శుభ్రం చేసినట్లు, మిగిలిన ఆహారం కనిపించలేదని వారు చెబుతున్నారు. అధికారుల ముందే ఇలా వ్యవహరిస్తే, సాధారణ సమయంలో విద్యార్థినుల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఆహార నమూనాలు సేకరించకుండా పారబోయడం వల్ల నిజాలు బయటకు రావని, దీనిపై కఠిన విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల విచారణ - నమూనాల సేకరణ, రికార్డుల పరిశీలన

విషయం తెలుసుకున్న తహసీల్దార్, పోలీసులు హాస్టల్‌కు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థినులతో విడివిడిగా మాట్లాడి, ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వంటశాల, స్టోర్ రూమ్, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆహార నమూనాలను సేకరించి పరీక్షకు పంపాలని, హాస్టల్ రికార్డులను, మెనూ చార్ట్, స్టాక్ రిజిస్టర్, బిల్లులను పరిశీలించాలని సూచించినట్లు సమాచారం. హాస్టల్‌లో ఆహార నాణ్యత, నీటి సరఫరా, వంటశాల పరిశుభ్రత, సిబ్బంది పనితీరుపై పూర్తి విచారణ జరపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లా అధికారులు ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి, నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు సమాచారం. విద్యార్థినుల ఆరోగ్యం ప్రస్తుతం మెరుగుపడుతోందని, వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

హాస్టల్‌లో ఉండే విద్యార్థినులు ఎక్కువగా పేద, వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చినవారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ, ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలపైనే ఆధారపడి చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన భోజనం, సురక్షితమైన వసతి, వైద్య సౌకర్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పలువురు అభిప్రాయపడుతున్నారు. జోగిపేట ఘటన రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో ఆహార నాణ్యత అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చింది. అన్ని హాస్టళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై కఠిన తనిఖీలు చేయాలని, ప్రతిరోజూ వార్డెన్, అధికారులు ఆహారాన్ని తనిఖీ చేయాలని, విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే వ్యవస్థను బలోపేతం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ ఘటనతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. తమ పిల్లలను హాస్టల్‌లో ఉంచాలంటే భయంగా ఉందని కొందరు తల్లిదండ్రులు అన్నారు. ప్రతిరోజూ ఆహారాన్ని తనిఖీ చేయాలని, వార్డెన్, వంట సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని, విద్యార్థినుల ఆరోగ్యాన్ని కాపాడాలని అందరూ కోరుతున్నారు. విచారణ నివేదిక వచ్చిన తర్వాత నిజాలు బయటకు వస్తాయని, బాధ్యులపై చర్యలు తీసుకుని విద్యార్థినులకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.